www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ట్రంప్ వచ్చేస్తున్నాడు!


వాషింగ్టన్‌లో ట్రంప్‌తో ముఖేశ్, నీతా అంబానీ

భారత కాలమానం ప్రకారం నేటి రాత్రి 10.30కి ప్రమాణం

వాషింగ్టన్‌లో తీవ్ర చలి.. బహిరంగ ప్రదేశంలో నిర్వహించొద్దని నిర్ణయం

కేపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో ప్రమాణ స్వీకారం

2

హాజరుకానున్న మస్క్, బెజోస్, జుకర్‌బర్గ్

అమెరికా వ్యాప్తంగా ట్రంప్ వ్యతిరేకుల నిరసనలు.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

సోమవారం | 20-1-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 275 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి ఉ. 9.59 తదుపరి సప్తమి; నక్షత్రం: హస్త రా. 8.30 తదుపరి చిత్ర; వర్జ్యం: తె.5.53 మొదలు; దుర్ముహూర్తం: మ.12.48-1.32; అమృతఘడియలు: మ.1.45-3.33; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.00 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మోదీ కొండంత అండ

చంద్రబాబు-మోదీ నాయకత్వాన మూడింతల అభివృద్ధి ఖాయం: షా

వైసీపీ విధ్వంసాన్ని మర్చిపోండి

6 నెలల్లోనే ఏపీకి 3 లక్షల కోట్లు

అమరావతి నిర్మాణానికి నిధులు

2028 నాటికి పోలవరం నీళ్లు పారిస్తాం

విశాఖ ఉక్కుకు ఊతమిచ్చి

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని మరింత పెంచాం

ప్రకృతి విపత్తుల నుంచి ఎన్డీఆర్ఎఫ్ రక్షణ

మానవ విధ్వంసాల నుంచి ఎన్డీయే అండ

అభివృద్ధికి అద్భుత అవకాశాలున్న ఆంధ్రప్రదేశ్ గత ప్రభుత్వంలో సర్వనాశనమైంది. రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు రేయింబవళ్లు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ కొండంత అండగా ఉంటారు.

\- కేంద్ర హోం మంత్రి అమిత్ షా


ఎన్ఐడీఎం దక్షిణ ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, చిత్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర

ఎన్డీఆర్ఎఫ్ వేడుకల్లో అమిత్ షా

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసం గురించి చింతించొద్దు. ఏపీ అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొండంత అండగా ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారు. ఇద్దరి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మూడింతల ప్రగతి సాధిస్తుంది' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారు. ఆదివారం విజయవాడ సమీపంలోని కొండపావులూరు వద్ద జరిగిన ఎన్డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్డీఆర్ఎఫ్ ప్రాంగణంలో నిర్మించిన ఎన్ఐడీఎం దక్షిణ సముదాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. 'సార్వత్రిక ఎన్నికల్లో మోదీ, చంద్రబాబుపై విశ్వాసంతో ఎన్డీయే కూటమిని గెలిపించిన ప్రతి ఒక్కరికీ నమస్కారాలు. నేను తెలుగులో మాట్లాడలేకపోతున్నందుకు క్షమించండి(మోదీ ఏపీకి వస్తే తెలుగులో ప్రసంగం మొదలు పెడతారు). నా ప్రసంగాన్ని పురందేశ్వరి మీకు తెలుగులో అనువదిస్తారు' అని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ వస్తుందని, మానవ విధ్వంసం నుంచి కాపాడేందుకు ఎన్డీయే ముందుంటుందని వ్యాఖ్యానించారు. ఎన్డీయే ప్రభుత్వం

మిగతా 11వ పేజీలో...

ఏపీకి పూర్వవైభవం తెస్తాం

గత పాలనలో అంతా విధ్వంసం

వెంటిలేటర్ నుంచి బయటపడ్డాం

కేంద్రం ఆక్సిజన్ ఇచ్చి ఆదుకుంది

ఉక్కుకు 11,440 కోట్ల సాయం

రైల్వే జోన్‌కు మోదీ శంకుస్థాపన

అమరావతి, పోలవరం పూర్తిచేస్తాం

ఏపీ పునర్నిర్మాణంలో అమిత్ షా సూచన సంతృప్తినిచ్చింది: సీఎం


వేదికపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు మాటామంతీ

11

ఆర్నెల్లలోనే కేంద్రం భారీ సాయం

రాష్ట్రాన్ని ఎన్డీయే కూటమి కాపాడుతోంది

ప్రతి పంచాయతీలోనూ 'విపత్తు' బృందాలు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ఏఐ.. నాయకా!

రాజకీయ నేతల బదులు.. భవిష్యత్తులో కృత్రిమ మేధ పాలన?

పాశ్చాత్యదేశాల్లో ఈ ప్రతిపాదనపై ఐదారేళ్లుగా విస్తృత చర్చ

2018లో పుతిన్ ప్రత్యర్థిగా 'అలీసా' అనే చాట్‌బాట్ తెరపైకి!

టోక్యోలో మేయర్ ఎన్నికల్లో.. హ్యూమనాయిడ్ రోబో పోటీ

ఏఐ అల్గారిథమ్స్ ద్వారా జరిపే పాలనకు 'అల్గోక్రసీ'గా పేరు

మనం ఏ ప్రశ్న అడిగినా ఠక్కున జవాబిచ్చే చాట్‌జీపీటీ.. వాట్సాప్‌లో కనిపించే మెటా ఏఐ.. ఇవన్నీ ఎన్నికల్లో పోటీ చేస్తే? కేంద్రంలో మోదీకి పోటీగా ప్రధాని పదవికి పోటీ పడితే, ఇక్కడ చంద్రబాబుకో, రేవంత్‌కో ప్రత్యర్థిగా రంగంలోకి దిగితే? ఊహించడానికే వింతగా ఉంది కదూ! మనకు కొత్తగా అనిపించొచ్చుగానీ.. పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికే ఈ ప్రతిపాదనపై విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి! 'ఏమో.. గుర్రం ఎగరావచ్చు' అన్న నానుడి చందంగా.. ఇప్పటికి ప్రతిపాదన దిశలోనే ఉన్న ఈ ఆలోచన భవిష్యత్తులో నిజం కావొచ్చు! ఏమో.. ఏఐ ఎప్పటికైనా ప్రధాని కుర్చీ ఎక్కావచ్చు!!

2

దావోస్ పర్యటనకు చంద్రబాబు

రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యం

11

దిగ్గజ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు

ప్రపంచ ఆర్థిక సదస్సులో 'బ్రాండ్ ఏపీ' నినాదం

బాబు వెంట లోకేశ్, భరత్, ఉన్నతాధికారులు



'తులసి'కి సంతర్పణ!

రూ. 10 లక్షల పనికి 3.06 కోట్లు సమర్పయామి

సీఐడీ మాజీ ఏడీజీ పీవీ సునీల్‌కుమార్ నిర్వాకం

పోలీసు గృహనిర్మాణ సంస్థ డ్యాష్‌బోర్డులో చేతివాటం

టెండరు ఖరారు నుంచే నిబంధనలకు తిలోదకాలు

రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడు తులసిబాబు కంపెనీకి చెల్లింపులు

ఇప్పటికీ అతీగతీ లేని డ్యాష్‌బోర్డు

12



వైసీపీ హయాంలో పలు అక్రమాలకు పాల్పడిన సీఐడీ మాజీ ఏడీజీ పీవీ సునీల్ కుమార్ అవినీతి బాగోతం మరొకటి తాజాగా వెలుగు చూసింది. పోలీసు గృహ నిర్మాణ సంస్థకు డ్యాష్‌బోర్డు రూపకల్పన పేరిట ప్రభుత్వ ఖజానా నుంచి రూ.కోట్ల సొమ్మును తన అనుచరుడికి అప్పనంగా దోచిపెట్టినట్లు తేలడం కలకలం రేపుతోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడిగా ఉన్న కామేపల్లి తులసిబాబే ఆ అనుచరుడు కావడం గమనార్హం.



చెక్కుచెదరని రాఫ్ట్ ఫౌండేషన్

12

అమరావతిలో నీటి నుంచి సచివాలయ పునాదులు బయటకు

16 అడుగుల మేర నీటి తోడివేత

బయటపడిన 1, 2 బ్లాకుల పునాదులు

అడుగు మేర పేరుకుపోయిన బురద

3, 4, 5 బ్లాకుల్లో కొనసాగుతున్న తోడకం

కాల్పుల విరమణతో.. గాజాలో ప్రశాంతత

ముగ్గురు బందీలను ఆలస్యంగా విడుదల చేసిన హమాస్

2

అప్పటివరకూ దాడులు జరిపిన ఇజ్రాయెల్.. 26 మంది మృతి

తేడాలొస్తే మళ్లీ యుద్ధం: నెతన్యాహు

సైఫ్‌పై దాడి చేసింది బంగ్లాదేశీయుడు!

థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో అరెస్టు, కోర్టులో హాజరు

ఐదు రోజుల పోలీసు కస్టడీకి న్యాయస్థానం అనుమతి

2

'టీ-5' మిశ్రమాన్ని ఆపండి!

డయాఫ్రమ్‌వాల్ కాంక్రీట్‌పై సీడబ్ల్యూసీ మళ్లీ వెనకడుగు

జల శక్తి కార్యదర్శి దేబశ్రీముఖర్జీ సందేహంతో పనుల్లో హంసపాదు


రాష్ట్ర జలవనరుల అధికారుల విస్మయం

దావోస్‌లో కేంద్రమంత్రి పాటిల్‌తో దీనిపై చర్చించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

పనులు ఆగకుండా చూసేలా గట్టి యత్నం

నేడు సీడబ్ల్యూసీ, సీఎస్ఎంఆర్ఎస్ చర్చలు

తుది నిర్ణయం వెల్లడిస్తామన్న సీడబ్ల్యూసీ



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జల జీవనాడి పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రమ్‌వాల్ పనులు ప్రారంభమయ్యాయని అందరూ సంతోషిస్తున్న సమయంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) 'టీ-5 ప్లాస్టిక్ కాంక్రీట్ విశ్రమం' వినియోగాన్ని ఆపాలని ఆదేశించింది. ఈ మిశ్రమం వినియోగంపై

మిగతా 12వ పేజీలో...

ఢిల్లీ.. ఎవరి ఖిల్లా?

అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముక్కోణపు పోటీ

గత అసెంబ్లీ ఎన్నికలకు, ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు పార్టీల ఓట్ల శాతాల్లో భారీతేడా

మెరుగుపడ్డ బీజేపీ, కాంగ్రెస్.. ప్రజలపై ఆమ్ ఆద్మీ పార్టీ వరాల జల్లు

నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు.. ఫిబ్రవరి 5న పోలింగ్



న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మురికివాడల్లోని జనం, ఆటో, క్యాబ్ డ్రైవర్లు, కార్మికులు ఆప్ వైపు! మధ్యతరగతి, ఉన్నతవర్గాల ప్రజలు కమలం పార్టీ వైపు! మైనారిటీలేమో కాంగ్రెస్‌వైపు, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ వర్గాల్లో ఎవరు ఏవైపు ఉన్నారు? అనే ప్రశ్నకు ఈ విశ్లేషణలే వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు తప్పదనిపిస్తోంది! నామినేషన్ల

మిగతా 12వ పేజీలో...

ఏ..ఐ.. నాయకా!!

రాజకీయ నాయకులకు బదులుగా.. భవిష్యత్తులో కృత్రిమ మేధ పాలన?




- 2017లో న్యూజిలాండ్‌లో తొలి వర్చువల్ నేత 'శామ్' సృష్టి
- గత ఏడాది యూకే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా.. 'ఏఐ స్టీవ్'

ఆరోగ్య సంరక్షణ.. బ్యాంకింగ్.. కోడింగ్.. ఈ-కామర్స్.. వ్యవసాయం.. అందుగలదు ఇందులేదని సందేహం అక్కర్లేదు.. కృత్రిమ మేధ ఇప్పుడు అన్ని రంగాల్లోకీ చొచ్చుకొచ్చేస్తోంది.. రాజకీయంతో సహా!! ఏఐ అనగానే.. మానవుల పనిని సులభతరం చేసే కోడింగ్‌గానో (చాట్‌జీపీటీలాంటివి).. స్మార్ట్‌ఫోన్‌లో మనకు కావాల్సిన సమాచారం అందించే వర్చువల్ అసిస్టెంట్‌గానో.. భౌతికంగా పనిచేసి పెట్టే రోబోలుగానో (ఆండ్రాయిడ్లు) భావిస్తున్నాం. ఒక్కముక్కలో చెప్పాలంటే.. ఇన్నాళ్లుగా మనం కృత్రిమ మేధను మనిషికి సహాయకారిగానే పరిగణిస్తూ వస్తున్నాం. కానీ.. అదే ఏఐని పొలిటీషియన్‌గా మార్చి ప్రజల జీవితాలనే మార్చేసే నిర్ణయాలు తీసుకునే స్థాయి దానికి కల్పిస్తే? ఇలా ఏఐ అల్గారిథమ్స్ ద్వారా పాలించడాన్ని 'అల్గోక్రసీ'గా నిపుణులు వ్యవహరిస్తున్నారు. ఈ ప్రతిపాదనపై పాశ్చాత్య దేశాల్లో ఐదారేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. ఎందుకంటే.. రాజకీయ నాయకుల కన్నా కృత్రిమ మేధ తీసుకునే నిర్ణయాలే నిష్పక్షపాతంగా, నిజంగా ప్రజలకు మేలు చేసే విధంగా ఉంటాయన్నది 'అల్గోక్రసీ'ని బలపరిచేవారి వాదన. ఏఐకి ఏ ఒక్క వర్గం మీదనో ప్రత్యేకంగా ప్రేమ ఉండదని.. సగటు రాజకీయనాయకుల్లాగా ఓటు బ్యాంకును బలపరచుకోవడం కోసం నిర్ణయాలు తీసుకోదని.. డబ్బు, పేరు ప్రతిష్ఠల కోసం పాకులాడదని.. దేశ సమగ్ర అభివృద్ధిని మాత్రమే దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటుందని వారు చెబుతారు. ఈ క్రమంలోనే.. కొన్ని దేశాల్లో జరిగిన ఎన్నికల్లో వర్చువల్ పొలిటీషియన్ల పేర్లు బలంగా తెరపైకి వచ్చాయి! ఉదాహరణకు 2017లో.. న్యూజిలాండ్‌కు చెందిన నిక్ గెర్రిట్సెన్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 'శామ్' అనే పేరుతో మానవ చరిత్రలోనే తొలి వర్చువల్ పొలిటీషియన్‌ను సృష్టించాడు. ఆయన దానికి 'భవిష్యత్తు రాజకీయ నాయకుడు' అని పేరుపెట్టాడు. చాట్‌జీపీటీ తరహాలోనే.. 'శామ్'ను ప్రజలు ఏ ప్రశ్న అడిగినా, అది తన వద్ద ఉన్న డేటాను విశ్లేషించి సమాధానం ఇస్తుంది. అయితే అలాంటి వర్చువల్ పొలిటీషియన్లు ఎన్నికల్లో పోటీ చేయడానికి చట్టాలు అనుమతించవు కాబట్టి ఇప్పటిదాకా అది అక్కడ ఎన్నికల బరిలోకి దిగలేదు. 2018లో రష్యాలో జరిగిన ఎన్నికల్లో పుతిన్‌కు పోటీగా.. 'యాండెక్స్' కంపెనీ అభివృద్ధి చేసిన అలీసా అనే చాట్‌బాట్‌ను ఒక వ్యక్తి నామినేట్ చేశాడు. ఒక్కరోజు వ్యవధిలోనే పాతికవేల మందికిపైగా రష్యన్లు దానికి తమ మద్దతు తెలపడం విశేషం. అదే ఏడాది టోక్యోలో.. ఒక హ్యూమనాయిడ్ రోబో టోక్యోలో మేయర్ ఎన్నికల్లో పోటీకి దిగింది. దాన్ని అభివృద్ధి చేసిన 'మికిహిటో మత్సుదా' దాని ప్రతినిధిగా వ్యవహరించి పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేశాడు. అప్పట్లో ఆయన తన ప్రచారంలో.. ఆ హ్యూమనాయిడ్ రోబోను ఒక 'ఆబ్జెక్టివ్ ఎంటిటీ'గా ప్రజల్లోకి తీసుకెళ్లాడు. దానికి ఎలాంటి పక్షపాతమూ ఉండదని.. ప్రజల అభిప్రాయాలను, విజ్ఞప్తులను స్వీకరించి, ఆ డేటాను విశ్లేషించి వారికి ఉపయోగపడేలా విధానాలను రూపొందిస్తుందని విస్తృతంగా ప్రచారం చేశాడు. ఆ రోబోను 'ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి కొత్త రూపం'గా అభివర్ణించాడు. ఇక.. నిరుడు జూన్‌లో యూకే పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో 'ఏఐ స్టీవ్' అనే కృత్రిమ మేధ అభ్యర్థి బరిలోకి దిగడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. యూకేలో 'న్యూరల్ వాయిస్' అనే కంపెనీని నడిపే స్టీవ్ ఎండాకాట్ ఈ ఏఐని తన తరఫున స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిపారు. ఒకవేళ ఎన్నికల్లో 'ఏఐ స్టీవ్' గెలిస్తే.. అతడి తరఫున ఎండాకాట్ పార్లమెంటేరియన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారని బ్రిటన్ ఎన్నికల కమిషన్ మొదట్లోనే తేల్చిచెప్పింది.

ఏఐ నడిపే పార్టీ..

ఎన్నికల్లో పోటీ చేయడం కాదు.. డెన్మార్క్‌లో 'లీడర్ లార్స్' అనే చాట్‌బాట్ పొలిటీషియన్ ఏకంగా ఒక పార్టీనే నడుపుతోందంటే నమ్ముతారా? ఆ పార్టీ పేరు 'సింథటిక్ పార్టీ'. 2022 మే నెలలో ప్రారంభమైన ఆ పార్టీ ప్రధాన లక్ష్యం.. మనుషులు, కృత్రిమమేధ కలిసి జీవించడం. ప్రపంచంలోనే తొలి 'ఏఐ ఆధారిత రాజకీయ పార్టీ' ఇది. డెన్మార్క్‌లోని ఆర్హస్ యూనివర్సిటీకి చెందిన 'ఆస్కర్ బ్రిల్డ్ స్టానేస్' అనే తత్వవేత్త ఈ పార్టీ వ్యవస్థాపకుడు. దీనికన్నా ముందు (2018లో) ఫిన్‌లాండ్‌లో 'ద ఏఐ పార్టీ'ని స్థాపించారుగానీ.. దాన్ని నడిపేది 'లీడర్ లార్స్' లాగా ఏఐ కాదు. మనుషులే. కాకపోతే, దేశానికి సంబంధించి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఏఐ పాత్ర ఎక్కువగా ఉండాలనేది ఆ పార్టీ లక్ష్యం.



ఏఐ స్టీవ్

లాభాలు.. నష్టాలు!

ఏఐ పొలిటీషియన్లకున్న ప్రధానమైన సానుకూల అంశం ఏంటంటే.. మామూలు రాజకీయ నాయకుల్లాగా వాటికి విశ్రాంతి అవసరం లేదు. యాప్/వెబ్‌పేజీల ద్వారా ఏ సమయంలోనైనా వాటితో నేరుగా సంభాషించవచ్చు. ఒకేసారి ఎక్కువ మంది ప్రశ్నలకు సమాధానమిచ్చే సామర్థ్యం కూడా వాటికి ఉంటుంది. వీటిని పక్కన పెడితే.. వాటికీ కొన్ని సమస్యలుంటాయి. కృత్రిమ మేధ పనిచేయడానికి విస్తృతంగా కంప్యూటేషనల్ వనరులు, పెద్ద ఎత్తున విద్యుత్తు వంటివి అవసరమవుతాయి. వాటికి నిరంతరాయంగా నెట్‌వర్క్ యాక్సెస్ ఉండాలి. ఏఐను రూపొందించేది మనుషులే. రకరకాల లాంగ్వేజ్ మోడల్స్ ద్వారా వాటిని అభివృద్ధి చేస్తారు. రూపకర్తలు వాటికి ఏ సమాచారం ఇస్తారో ఆ డేటా ఆధారంగా మాత్రమే అవి నిర్ణయాలు తీసుకోగలవు. 'రోబో' సినిమాలో చూపించినట్టు.. వికృత మనస్తత్వం కలిగిన నిపుణులెవరైనా అలా వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంటుంది. ఉదాహరణకు.. రష్యా చాట్‌బాట్ అలీసా ఒక సందర్భంలో గృహ హింసను సమర్థించే సమాధానం ఇచ్చింది. మరో సందర్భంలో.. కాల్పులను సమర్థిస్తూ సమాధానం ఇచ్చింది. కాబట్టి పూర్తిగా వాటిపై ఆధారపడలేని పరిస్థితి. అందుకే వీటికి బదులుగా.. 'ఏఐ పవర్డ్ డైరెక్ట్ డెమొక్రసీ' అనే మరో ప్రతిపాదనను సీజర్ హిడాల్గో అనే ఫిజిసిస్ట్ చేశారు. అంటే.. దేశంలోని పౌరులందరూ తమ తమ ఏఐ ఏజెంట్లను రూపొందించుకోవాలి. ఈ ఏఐ ఏజెంట్లన్నీ కలిసి ఆన్‌లైన్ ద్వారా సంప్రదింపులు జరుపుకొని అందరికీ ఆమోదయోగ్యమయ్యే నిర్ణయం తీసుకుంటాయని హిడాల్గో ప్రతిపాదించారు. దీన్ని ఆయన నిజమైన ప్రత్యక్ష ప్రజాస్వామ్యంగా, 'అవతార్ డెమొక్రసీ'గా అభివర్ణిస్తున్నారు. కానీ.. ఇది చాలా సంక్లిష్టమైన ప్రక్రియ అని, ఆచరణసాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మధ్యవర్తి ఏఐ!

విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వర్చువల్ పొలిటీషియన్ల మీద ఆధారపడడం కంటే.. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఏఐ ఆధారిత 'హబెర్మాస్ మెషీన్' వంటి ఉపకరణాల సాయం తీసుకోవడం మంచిదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. హబెర్మాస్ మెషీన్ అనేది.. గూగుల్‌కు చెందిన 'డీప్‌మైండ్' సంస్థ అభివృద్ధి చేసిన 'ఏఐ డిబేట్ మీడియేటర్'. ఒక అంశంపై వివిధ వర్గాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను అన్నింటినీ క్రోడీకరించి ఒక ఉమ్మడి ప్రాతిపదికను గుర్తించి అన్ని వర్గాలూ ఏకాభిప్రాయానికి వచ్చేలా చేసే మధ్యవర్తి లాంటి యంత్రం ఇది. ప్రయోగాల్లో భాగంగా ఈ మెషీన్ ఇప్పటికే పలు ట్రయల్ గ్రూపుల మధ్య అత్యంత సమస్యాత్మక అంశాల్లో ఏకాభిప్రాయం కుదర్చగలిగింది.

చివరాఖరు: కృత్రిమ మేధ ఇప్పటిదాకా ప్రత్యక్షంగా ఎన్నికల బరిలోకి దిగలేదుగానీ.. పరోక్షంగా ప్రపంచవ్యాప్తంగా చాలా ఎన్నికలను ప్రభావితం చేస్తోంది! ఎన్నికల సమయంలో ఓటర్ల మనసును ప్రభావితం చేసే విధంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులు, డీప్ ఫేక్ వీడియోలు.. ఇవన్నీ ఏఐ సాయంతో సృష్టిస్తున్నవే! కృత్రిమ మేధను మన రాజకీయ నాయకులు ఇప్పటికే విచ్చలవిడిగా వాడేస్తున్నారు మరి!!

(సెంట్రల్ డెస్క్)



జపాన్‌లోని టోక్యో నగర మేయర్ ఎన్నికల ప్రచారంలో రోబో

లోకం తీరు



'సివిల్స్' అభ్యర్థుల పిటిషన్‌పై న్యాయసలహాకు అమికస్ క్యూరీ

సెలక్షన్ లిస్టు కంటే ముందే ప్రిలిమ్స్‌కీ, కటాఫ్ వెల్లడించాలని సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 19: సివిల్ సర్వీసు ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి సమాధానాల కీ, కటాఫ్ మార్కులు, సాధించిన మార్కులను నియామక ప్రక్రియ పూర్తవకముందే వెల్లడించేలా యూపీఎస్సీకి ఆదేశాలివ్వాలంటూ ఆ అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశమ్మీద న్యాయపరమైన సలహా ఇచ్చేందుకు అమికస్ క్యూరీని నియమించింది. జస్టిస్ పీఎం నర్సింహా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం, సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తాను అమికస్ క్యూరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 2023లో సివిల్స్ సహా నిర్వహించిన దాదాపు అన్ని పరీక్షలకు సంబంధించి ప్రక్రియ పూర్తయ్యాకే సమాధానాల కీ, కటాఫ్ మార్కులు, అభ్యర్థులు సాధించిన మార్కులను వెల్లడించాలని నిర్ణయం తీసుకుంది. అభ్యర్థుల పిటిషన్‌పై వారి తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ప్రిలిమినరీ పరీక్షల య్యాక యూపీఎస్సీ వివరాలు వెల్లడించకపోవడం అనేది పారదర్శకత లోపమేనని సిబల్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సమాధానాల కీ, కటాఫ్ మార్కులు, మార్కులను యూపీఎస్సీ వెల్లడిస్తే అభ్యర్థులకు తాము చేసిన పొరపాట్లపైన, అలాగే ఒకవేళ తప్పుడు మూల్యాంకనం జరిగితే దానిపైనా స్పష్టమైన అవగాహన వస్తుందని ఆయన వాదించారు. కాగా ఈ అంశమ్మీద అదనపు అఫిడవిట్‌ను దాఖలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం, యూపీఎస్సీకి ధర్మాసనం ఆదేశించింది. అభ్యర్థులు లేవనెత్తిన అంశాలను వెల్లడిస్తే నియామక సంస్థకు ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయనేది అఫిడవిట్‌లో పొందుపర్చాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

కాల్పుల విరమణతో గాజాలో ప్రశాంతత

- ముగ్గురు బందీలను విడుదల చేసిన హమాస్


టెల్‌అవీవ్, జనవరి 19: బాంబింగ్.. షెల్లింగ్.. వైమానిక దాడులతో నామరూపాలు కోల్పోయిన గాజాలో కాల్పుల విరమణ ఒప్పందంతో ఆదివారం ప్రశాంతత నెలకొంది. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత మొదలైన యుద్ధం ఆదివారానికి 470వ రోజుకు చేరుకుంది. గత ఏడాది కూడా హమాస్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం అమలవ్వగా.. బందీల విడుదలలో ఆలస్యం, పేర్లను వెల్లడించకపోవడం వంటి కారణాలతో యుద్ధం కొనసాగుతూ వచ్చింది. తాజాగా అమెరికా, ఖతార్, ఈజిప్ట్ నెరపిన మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హమాస్ మధ్య మరోమారు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దశల వారీగా 33 మంది బందీలను విడుదల చేయడానికి హమాస్.. అందుకు ప్రతిగా తమ దేశ జైళ్లలో ఉన్న 737 మంది పాలస్తీనీయులను విడిచిపెట్టడానికి ఇజ్రాయెల్ అంగీకరించాయి. హమాస్ దాడులతో సంబంధం లేని 1,167 మంది గాజా పౌరులకూ స్వేచ్ఛ లభించనుంది. మరోవైపు, ఒప్పందం ప్రకారం ఆదివారం ఉదయం 8.30 నుంచి కాల్పుల విరమణను పాటించాలి. అప్పటి వరకూ గాజాపై దాడిని కొనసాగించిన ఇజ్రాయెల్.. తొలి విడతగా విడుదలవ్వనున్న ముగ్గురు బందీల జాబితా రాలేదనే సాకుతో ఉధృతిని పెంచింది. ఉదయం 11.15 గంటల వరకు హమాస్ వర్గాలు బందీలుగా ఉన్న ముగ్గురు ఇజ్రాయెలీ యువతుల పేర్ల(రోమి గోనెన్, ఎమిలి దమారి, డోరాన్ స్టెయిన్‌బెర్)ను విడుదల చేసే వరకు కూడా కాల్పులు కొనసాగాయి. ఖాన్‌యూనిస్‌పై జరిపిన ఈ దాడుల్లో 26 మంది చనిపోయారు. సాయంత్రానికి హమాస్ వర్గాలు ముగ్గురు బందీలను రెడ్‌క్రాస్‌కు అప్పగించాయి. కాగా, ఒప్పందం మేరకు బందీలను విడుదల చేయకుంటే గాజాలో మళ్లీ యుద్ధం తప్పదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరించారు.

సైఫ్‌పై దాడి చేసింది బంగ్లాదేశీయుడు!

- థానే దగ్గర్లోని ఓ కార్మిక శిబిరంలో అరెస్టు

ముంబై, జనవరి 19: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేశాడనే ఆరోపణలపై మహ్మద్ షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్(30) అలియాస్ బిజయ్ దాస్ అనే బంగ్లాదేశ్ పౌరుడిని ముంబై పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో షరీఫుల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అతనిని బాంద్రా న్యాయస్థానంలో హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయస్థానం నిందితుడి ఐదు రోజుల పోలీసు కస్టడీకి అనుమతినిచ్చింది. బంగ్లాదేశ్ పౌరుడైన షరీఫుల్ అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి బిజయ్ దాస్ అనే పేరుతో చలామణీ అవుతున్నాడని పోలీసులు న్యాయస్థానానికి తెలియజేశారు. దొంగతనం చేసేందుకు సైఫ్ అలీ ఖాన్ ఇంట్లోకి చొరబడిన షరీఫుల్.. సైఫ్‌పై దాడి చేసి పరారయ్యాడని తెలిపారు. వందలాది సీసీ కెమెరా ఫుటేజీల పరిశీలన అనంతరం దాదర్ రైల్వే స్టేషన్ వద్ద నిందితుడి సంచారాన్ని గుర్తించామని, థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. షెహజాద్ బంగ్లాదేశీ కావడంతో సైఫ్‌పై దాడి వెనుక అంతర్జాతీయ కుట్ర ఏమైనా ఉందా ? అని దర్యాప్తు చేయాల్సి ఉందని వివరించారు. కాగా, సైఫ్‌పై దాడి కేసులో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు శనివారం అరెస్టు చేసిన ఆకాశ్ కైలాశ్ కనోజియాను విచారణ అనంతరం పోలీసులు విడుదల చేశారు.

ప్రముఖ కవి సాంధ్యశ్రీ ఇక లేరు



హైదరాబాద్ సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సాంధ్యశ్రీగా తెలుగు కవితాలోకానికి సుపరిచితులైన ప్రముఖ కవి పుచ్చా లక్ష్మీనరసింహ శాస్త్రి (73) ఇక లేరు. కొంతకాలంగా హృద్రోగ, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న ఆయన ఈ నెల 17న అల్వాల్‌లోని తన స్వగృహంలో హఠాన్మరణం చెందారు. సాంధ్యశ్రీ మరణవార్త సాహితీలోకానికి ఆలస్యంగా తెలిసింది. సాంధ్యశ్రీ అంత్యక్రియలు జనవరి 18న అల్వాల్‌లోని శ్మశాన వాటికలో పూర్తయ్యాయి. సాంధ్యశ్రీ స్వస్థలం ఏపీలోని తెనాలి దగ్గర దంతలూరు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో దగ్గరి బంధుత్వం ఉండడంతో, ఆయన సాన్నిహిత్యంలో బాల్యాన్ని గడిపారు. కవిత్వం కవిత్వం కోసమే అనే విశ్వాసాన్ని రచనల ద్వారా ప్రకటించిన కవి సాంధ్యశ్రీ అంటూ.. సాంధ్యశ్రీ మరణానికి ప్రముఖ కవి శిఖామణి సంతాపం వ్యక్తం చేశారు.

ట్రంప్ వచ్చేస్తున్నాడు



ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్ బయల్దేరి వెళ్లే ముందు ట్రంప్ అభివాదం

మొండివాడు రాజు కన్నా బలవంతుడంటారు! కానీ.. మొండివాడే రాజైతే? విషయం ఏదైనా నిక్కచ్చిగా అభిప్రాయం చెప్పి.. నిర్మొహమాటంగా నిర్ణయాలు తీసుకునే డోనాల్డ్ ట్రంప్‌ను ఆయన విమర్శకులు 'మొండివాడు' అనే అంటారు!! అలాంటి ట్రంప్.. అమెరికా అధ్యక్షుడిగా సోమవారం మళ్లీ బాధ్యతలు చేపట్టనున్నారు. అమెరికా అధ్యక్షుడంటే ఆ ఒక్క దేశానికి మాత్రమే సంబంధించిన వ్యవహారం కాదు. ఆ పదవిలో ఉన్న వ్యక్తి ఆలోచనల ప్రభావం ప్రపంచమంతా ఉంటుంది!! అందునా ట్రంప్ లాంటి దూకుడు మనస్తత్వం ఉన్న వ్యక్తి అయితే ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో.. పలు అంశాలపై గత కొన్ని నెలలుగా ఆయన చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఆయన వైఖరి ఎలా ఉండవచ్చో నిపుణులు విశ్లేషిస్తున్నారిలా..

భారత్‌పై పన్నుల భారం?

ట్రంప్ తొలి హయాంలో అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాలు బలపడ్డాయి. కానీ.. వాణిజ్యం విషయంలో మాత్రం ఆయన పలుమార్లు ఘాటు వ్యాఖ్యలు చేశారు. భారత్ విధించే సుంకాలపై గట్టిగానే చిర్రుబుర్రులాడారు. 2019లో.. భారత్‌ను 'టారిఫ్ కింగ్'గా కూడా అభివర్ణించారాయన! అప్పటిదాకా భారత్‌కు ఉన్న 'జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ (జీఎస్పీ)'ని రద్దు చేశారు. గత ఏడాది డిసెంబరులో సైతం.. భారత్ విధిస్తున్న సుంకాలపై ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "అమెరికా ఉత్పత్తులపై భారత్, బ్రెజిల్ వంటి దేశాలు అత్యధికంగా 100%, 200% పన్నులు వేస్తున్నాయి.. దేనికైనా ప్రతిచర్య ఉంటుంది. వారు మాపై పన్నులు వేస్తే మేమూ అదే స్థాయిలో వసూలు చేస్తాం" అంటూ రివెంజ్ ట్యాక్స్ గురించి మాట్లాడారు. కాబట్టి వాణిజ్యంలో ఇరుదేశాల మధ్య ఘర్షణ.. పన్నుభారం తప్పకపోవచ్చు.

హెచ్1బీపై మెతక వైఖరి?

హెచ్1బీ వీసాలపై ట్రంప్ గతంలో తీవ్రస్థాయిలో విమర్శలు చేసేవారు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హెచ్1బీ ప్రోగ్రామ్ ద్వారా వచ్చే దరఖాస్తుల వడపోతను కఠినతరం చేశారు. కానీ, ఇప్పుడు.. హెచ్1బీ వీసాలను సమర్థించే ఈలన్ మస్క్, వివేక్ రామస్వామి వంటివారు తన పక్కనే ఉన్న నేపథ్యంలో ఇటీవలికాలంలో ఆయన స్వరం మారింది. ఆ వీసాలపై ఆయన వైఖరి మెత్తబడింది. "హెచ్1బీపై నాకు నమ్మకం ఉంది. అదొక గొప్ప కార్యక్రమం" అంటూ న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టంగా చెప్పారు. అయితే.. ట్రంప్ మద్దతుదారుల్లోనే మరో వర్గం, అమెరికాను మళ్లీ గొప్పగా చేయాలని వాదించే వారు (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్-మాగా) మాత్రం హెచ్1బీపై తీవ్ర వ్యతిరేకత వెలిబుచ్చుతున్నారు. కాబట్టి ఆ ఒత్తిడి కూడా ట్రంప్‌పై ఉండే అవకాశం ఉంది. దాన్ని ఎలా అధిగమిస్తారో చూడాలి!!

గ్రీన్‌లాండ్ స్వాధీనం!

అత్యంత వ్యూహాత్మకమైన ప్రాంతంలో ఉన్న గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో భాగం చేస్తామని.. అందుకు అవసరమైతే సైన్యాన్నిగానీ, ధనాన్నిగానీ ఉపయోగించడానికి సిద్ధమని ట్రంప్ చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. ఇంతకీ గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ దృష్టి ఎందుకు పడింది? అంటే.. ఆ దేశంలో అత్యంత అరుదైన వనరులు, నిక్షేపాలు ఉన్నాయి. యూరప్‌కు, ఉత్తర అమెరికాకు మధ్య వ్యూహాత్మక ప్రాంతంలో ఉందా భూభాగం. అటువైపుగా వెళ్లే రష్యన్ నౌకలు, అణు జలాంతర్గాములపై ఒక కన్ను వేసే అవకాశం అమెరికాకు అక్కడ ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే యూఎస్ అక్కడ ఒక శాశ్వత ఎయిర్‌బేస్ ఏర్పాటు చేసింది. అన్నిటికీ మించి.. గ్రీన్‌లాండ్ భౌగోళికంగా ఉత్తర అమెరికాలో భాగం! కానీ.. రాజకీయంగా 1953 వరకూ డెన్మార్క్ వలస ప్రాంతంగా ఉంది. ఇప్పుడు స్వయంపాలిత భూభాగంగా ఉంది. గ్రీన్‌లాండ్ రాజధానికి డెన్మార్క్ రాజధాని కోపెన్‌హేగన్ కన్నా కూడా న్యూయార్కే దగ్గర. వీటిన్నింటి నేపథ్యంలోనే ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను ఎలాగైనా స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. గతంలో హ్యారీ ట్రూమన్ హయాంలో కూడా ఈ ద్వీపాన్ని 100 మిలియన్ డాలర్లతో కొనుగోలు చేయడానికి ప్రయత్నించారు. కానీ, కుదర్లేదు. ఇప్పుడు కూడా డెన్మార్క్ ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తోంది. ట్రంప్ మాత్రం ఈ విషయంలో మొండిగానే వ్యవహరించే అవకాశం ఉంది. అప్పుడు.. డెన్మార్క్‌కు బదులుగా అమెరికాతో అనుబంధంగా ఉండే నిర్ణయం తీసుకునే హక్కు గ్రీన్‌లాండ్‌కు ఉంటుంది. ఫలితంగా ఇన్నాళ్లుగా డెన్మార్క్ నుంచి గ్రీన్‌లాండ్‌కు అందుతున్న రాయితీలు అమెరికా నుంచి అందుతాయన్నమాట.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం

తాను అధికారంలోకి వస్తేగనక వెంటనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని ట్రంప్ గతంలో ప్రకటించారు. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం ఇవ్వబోమని హామీ ఇవ్వడం ద్వారా రష్యాను యుద్ధవిరమణకు ట్రంప్ ఒప్పించవచ్చన్నది ఒక ఆలోచన. అది ఉక్రెయిన్‌కు పెద్ద దెబ్బే. నిజానికి 2023లో అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు అందాల్సిన 61 బిలియన్ల డాలర్ల ప్యాకేజీ.. ట్రంప్ ఒత్తిడి కారణంగానే ఆగిపోయింది. అందుకే ఉక్రెయినియన్లకు ఇప్పుడు ట్రంప్ మీద ఆశలేమీ లేవు.

పనామా కాలువ స్వాధీనం?

తీరాల మధ్య వాణిజ్య, సైనిక నౌకల రవాణాను సులభతరం చేసేందుకు అమెరికా నిర్మించిన పనామా కాలువ ప్రస్తుతం పనామా దేశ అధీనంలో ఉంది. 1977లో అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ చేసుకున్న ఒప్పందం ప్రకారం.. 1999 డిసెంబరులో ఈ కాలువపై నియంత్రణను అమెరికా కోల్పోయింది. అయితే.. ఇటీవలికాలంలో ఆ దేశం సరుకు రవాణా నౌకలపై రుసుములు పెంచేయడం, చైనాతో సత్సంబంధాలు పెట్టుకోవడం వంటి నిర్ణయాలు తీసుకుంది. అవే ట్రంప్ ఆగ్రహానికి కారణమయ్యాయి. కాబట్టి పగ్గాలు చేపట్టాక ట్రంప్ పనామాపై దూకుడుగానే వ్యవహరించే అవకాశం ఉందని అంచనా. ఇవే కాదు, వాణిజ్యలోటు భర్తీ కోసం కెనడా, మెక్సికోలను కూడా అమెరికాలో రాష్ట్రాలుగా చేరుస్తామని ట్రంప్ వ్యాఖ్యానించారు! అమెరికాకు సన్నిహితమైన యూరోపియన్ దేశాలనూ ఆయన వదల్లేదు. యూరప్ దేశాలకు, అమెరికాకు మధ్య వాణిజ్య అంతరం భారీగా ఉందని.. దాన్ని పూడ్చడానికి యూరప్ దేశాలు గ్యాస్, ఇంధనాన్ని అమెరికా నుంచే కొనుగోలు చేయాలని హెచ్చరించారు. లేదంటే ఈయూపై పన్నులు పెంచేస్తానని బెదిరించారు. భూతాప ముప్పును నివారించేందుకు పారిస్‌లో కుదుర్చుకున్న పర్యావరణ ఒప్పందం నుంచి వైదొలగుతానని ప్రకటించారు. ఇలా ఆయన చెప్పినవన్నీ చేస్తే ప్రపంచానికి పెనుముప్పేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

గాజా వార్ ముగిసినట్లేనా?

గాజాలో జరుగుతున్న యుద్ధం విషయంలో ట్రంప్ చాలా స్పష్టంగా హమాస్‌కు వ్యతిరేకంగా ఉన్నారు. తాను ప్రమాణం చేసే జనవరి 20లోపు హమాస్‌గనక తన వద్ద ఉన్న బందీలందరినీ ఇళ్లకు పంపించకపోతే ఈ దురాగతాలకు పాల్పడేవారికి నరకం చూపిస్తానని ఇటీవలే హెచ్చరికలు జారీ చేశారు. ఈ యుద్ధానికి కారకులైనవారికి గట్టి దెబ్బ పడుతుందంటూ పరోక్షంగా ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ క్రమంలోనే హమాస్ దిగివచ్చి ముగ్గురు బందీలను విడుదల చేసింది.

నేడు అధ్యక్షుడిగా ప్రమాణం

వాషింగ్టన్, జనవరి19: అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్(78) మరికొన్ని గంటల్లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకోసం ఆయన ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వర్జీనియాలోని ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌లో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. వాషింగ్టన్‌లో మైనస్ 11 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండటంతో ప్రతికూల వాతావరణం కారణంగా బహిరంగ ప్రదేశంలో కాకుండా కేపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటికే రిపబ్లికన్ పార్టీకి చెందిన అభిమానులు పెద్ద సంఖ్యలో వాషింగ్టన్ చేరుకున్నారు. కేపిటల్ హిల్ పరిసర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సెయింట్ జాన్స్ చర్చిలో ప్రార్థనలతో ట్రంప్ తన రోజును ప్రారంభిస్తారు. అక్కడ నుంచి వైట్‌హౌస్‌కు వెళ్లి అధ్యక్షుడు బైడెన్ ఇచ్చే తేనీటి విందులో పాల్గొంటారు. అక్కడ నుంచి కేపిటల్ హిల్ చేరుకుని ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం బైడెన్, కమలాహారిస్‌ల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రమాణ స్వీకారం తర్వాత ట్రంప్ తొలిరోజే వందకుపైగా ఆదేశాలపై సంతకాలు చేయనున్నారు. మరోవైపు, ట్రంప్ ప్రమాణ స్వీకారాన్ని వ్యతిరేకిస్తూ అనేక సంస్థలు దేశవ్యాప్తంగా ర్యాలీలు చేపట్టాయి. నిరసనకారులు ట్రంప్‌నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ట్రంప్ విధానాలను తప్పుబట్టారు.



వర్జీనియాలోని ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌లో వేడుకలు

ఏప్రిల్‌లో ట్రంప్ భారత పర్యటన

ట్రంప్ ఏప్రిల్‌లో భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. ప్రధాని మోదీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించే అవకాశాలు కూడా ఉన్నాయి. భారత్ అతి త్వరలో క్వాడ్ సమావేశాలకు ఆతిథ్యం ఇవ్వనుంది. అమెరికా క్వాడ్ కూటమిలో ఉండటంతో ట్రంప్ భారత్ వచ్చే అవకాశం ఉంది. చైనాతో సత్సంబంధాలు కోరుకుంటున్న ట్రంప్, ఆయన తొలి విదేశీ పర్యటన కోసం చైనానే ఎంచుకోవచ్చని తెలుస్తోంది.



ముగిసిన వైకుంఠ ద్వార దర్శనాలు

పది రోజుల్లో దాదాపు 6.83 లక్షల మందికి దర్శనం.. తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి వైకుంఠ ద్వారాలు మూతపడ్డాయి. పదిరోజుల పాటు దాదాపు 6.83 లక్షల మంది శ్రీవారిని దర్శించుకుని.. ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల పదో తేదీన వైకుంఠ ద్వారాలను తెరిచిన విషయం తెలిసిందే. గతేడాది తరహాలోనే పదిరోజుల పాటు (19వ తేదీ వరకు) వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించాలని నిర్ణయించిన టీటీడీ ఆన్‌లైన్ ద్వారా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణిటికెట్లను జారీ చేసింది. ఇక, ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లను జారీ చేసింది. ఇక, చివరిరోజు ఆదివారం దాదాపు 71వేల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆదివారం అర్ధరాత్రి ఏకాంతసేవతో వైకుంఠ ద్వారాలను మూసివేశారు. సోమవారం వేకువజాము సుప్రభాతసేవ నుంచి యథావిధిగా సాధారణ దర్శనాలు ప్రారంభం కానున్నాయి. వైకుంఠద్వార దర్శనాలు ముగిసిన క్రమంలో ఆదివారం తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది.



టీటీడీ ట్రస్టులకు చెన్నైకు చెందిన వర్ధమాన్ జైన్ ఆదివారం రూ.6 కోట్లు విరాళంగా అందజేశారు. ఎస్వీబీసీ కోసం రూ.5 కోట్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.కోటి వినియోగించాలని దాత కోరారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.



కప్పస్తంభం వద్ద జస్టిస్ ఠాకూర్ దంపతులు, జస్టిస్ పి.శ్రీసుధ దంపతులు, ఆలయంలో జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులు

అప్పన్న సేవలో న్యాయమూర్తులు

సింహాచలం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ ఠాకూర్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులు కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న తరువాత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వారికి వేదాశీర్వచనం, అధికారులు స్వామివారి ఫొటోలు, ప్రసాదాలను అందజేశారు.

దాచేపల్లికి చేరిన అయోధ్య రాముడి విల్లు



ధనుస్సు, బాణాన్ని దర్శించుకుంటున్న భక్తులు

దాచేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో గతేడాది ప్రారంభించిన ఆలయంలోని అయోధ్య రాముడి ధనుస్సు, బాణాన్ని హైదరాబాద్‌లో రూపొందించారు. దీనిని ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో విల్లు, బాణం ఊరేగింపు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి దాచేపల్లికి ఆదివారం చేరుకుంది. దాచేపల్లిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి వాటిని తీసుకురాగా, భక్తులు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి అంకమ్మతల్లి ఆలయానికి చేర్చారు. రామనామ స్మరణతో కోదండాన్ని దర్శించుకుని భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఊరేగింపు గురజాలకు బయల్దేరింది.

ఎన్ఐఆర్‌సీఏగా మారనున్న సీటీఆర్ఐ

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీటీఆర్ఐ) ఇక నుంచి జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఎన్ఐఆర్‌సీఏ)గా మారనుంది. గత ఏడు దశాబ్దాలుగా పొగాకు పరిశోధనలో సీటీఆర్ఐ గణనీయమైన సేవలందించింది. అయితే ఇటీవల నిర్లక్ష్యపు పంటగా పొగాకు గుర్తింపు, పొగాకు ఉత్పత్తులపై వేటు, ఆరోగ్య పరిరక్షణ దిశగా ఎదుర్కొంటున్న సమస్యలు, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా అడ్డంకులు, క్యూరింగ్‌లో కలప వినియోగం తదితర సమస్యలను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు సీటీఆర్ఐ డైరక్టర్ మాగంటి శేషుమాధవ్ ఆదివారం తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- టీఎన్‌యూఎస్ కేలండర్ ఆవిష్కరణలో హోం మంత్రి అనిత

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. టీఎన్‌యూఎస్ 2025 కేలండర్, డైరీని ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ఉపాధ్యాయ నియామకాలు, ఉపాధ్యాయ వర్గానికి పెద్దఎత్తున మేలు చేసింది తెలుగుదేశం ప్రభుత్వంలోనేనన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చెరుకూరి పూర్ణచంద్రరావు, కార్యదర్శి కొత్తగొర్ల వెంకట్రావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థల చైర్మన్ల తొలగింపు

ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, సభ్యులు రెడ్డి పద్మావతిని తొలగిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఏపీ పబ్లిక్ లైబ్రరీస్ చట్టం 1960 ప్రకారం గవర్నర్ ఆదేశాల మేరకు గ్రంథాలయ పరిషత్ చైర్మన్, సభ్యులతో పాటు విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ, కడప జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్.ఉషారాణి, చిత్తూరు గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నయనార్ మధుబాలను తొలగిస్తూ ఆదేశాలిచ్చారు. వెంటనే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.కోటి విలువైన నకిలీ సిగరెట్లు, ఖైనీ సీజ్



కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న సిగరెట్లు, ఖైనీ ప్యాకెట్లు

విజయవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్, రూరల్ మండలం అంబాపురంలో అనధికారికంగా నిల్వ చేసిన నకిలీ సిగరెట్లు, ఖైనీ ప్యాకెట్లను సెంట్రల్ జీఎస్టీ అధికారులు సీజ్ చేశారు. సెంట్రల్ జీఎస్టీలో యాంటీ ఎవేషన్, కస్టమ్స్ కమిషనరేట్ (ప్రివెంటివ్) అధికారులు.. శనివారం రాత్రి అంబాపురంలోని మారుమూల ప్రాంతాలు, అజిత్‌సింగ్‌నగర్‌లో ఉన్న గోడౌన్లలో సోదాలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తయారుచేసిన సిగరెట్లు, ఖైనీ ప్యాకెట్లు భారీగా ఉండటాన్ని గుర్తించారు. 102 సంచుల్లో 25.38 లక్షల జీటీపీఎల్ విమల్, గోల్డ్ విమల్, గోల్డ్‌ఫ్లేక్, పారిస్ సిగరెట్లు ఉన్నాయి. వాటి విలువ రూ.96.82 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. 23 సంచుల్లో 46 వేల స్పిట్ టుబాకో (ఖైనీ) ప్యాకెట్లు ఉన్నాయి. ఈ మొత్తం సరుకుకు ఎలాంటి ఈ-వే బిల్లులు లేకపోవడంతో అధికారులు సీజ్ చేశారు.

తిరుపతి జిల్లాలో లారీని ఢీకొన్న కారు

- ఇద్దరు పిల్లలు, ఓ మహిళ దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం, ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాద దృశ్యం

చంద్రగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లె వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పిల్లలు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన కార్తికేయ, ఆయన భార్య ఐశ్వర్య, కుమారులు జీవన్, విశ్వ, అత్త కలైవాణి, బావమరిది సతీష్ శ్రీవారి దర్శనార్థం ఆదివారం కారులో తిరుమలకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు ముందు సీట్లో ఉన్న జీవన్(10), విశ్వ(8) అక్కడిక్కడే మృతి చెందారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కలైవాణి(45) మృతి చెందారు. కార్తికేయ పరిస్థితి విషమంగా ఉండగా, ఐశ్వర్య, సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

తిరుమల ఘాట్‌లో కారు బోల్తా.. భక్తులకు స్వల్ప గాయాలు

తిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో కారు బోల్తాపడటంతో భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా కలకడకు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం పూర్తిచేసుకుని ఆదివారం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైంది. ఏడవ మైలు మలుపు వద్ద వారి కారు అదుపుతప్పి కుడివైపునున్న గుంతలోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్ అనే బాలుడికి ముఖం వద్ద గాయాలు కాగా, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు.

మన కాలపు హరిశ్చంద్రుడు

1987 ఫిబ్రవరి మాసం. పొద్దు గూకే వేళ అప్పుడే చలి ముసురుకుంటా వుంది. తెనాలి సత్యనారాయణ టాకీస్ రోడ్‌లో వుండే బాబు రికార్డింగ్ షాపు వచ్చిపోయే కస్టమర్లతో సందడిగా వుంది. పూటుగా మందు తాగిన ఇద్దరు ఆగంతకులు రికార్డింగ్ షాపు యజమాని ఉమామహేశ్వరరావు గారి ఎదురుగా నిల్చున్నారు. వారిలో సన్నగా బక్క పల్చగా వున్న వ్యక్తి 'ఏమండీ, మీ దగ్గర ఏమేమి క్యాసెట్లు దొరుకుతాయి?' అని అడిగాడు. వాళ్ల వాలకం చూసిన యజమాని 'అసలు నీకేం కావాలో ముందు చెప్పవయ్యా?' అన్నారు నిరాసక్తంగా. 'హరిశ్చంద్ర పద్యాలు డి.వి., బండారువి కాక, ఇంకెవరివైనా దొరుకుతాయా?' అడిగాడా వ్యక్తి. తలవంచుకొని ఏదో పని చేసుకుంటున్న ఉమా గారు, 'ఆ వున్నాయయ్యా! కెవి రెడ్డి, అరిగెల జేమ్సు, ఈ నడుమ కొత్తగా పాడుతున్న బండారు గారి కుమారుడు రవి కుమార్‌వి ఇవ్వమంటారా,' అన్నాడు కొంచెం ఆసక్తిగా. మళ్ళీ తనే 'ఈమధ్య చక్కగా పాడుతున్నాడని పేరొచ్చిన చీమకుర్తి నాగేశ్వరరావు క్యాసెట్ చేయాలనుకున్నాము. ఆయన మాకు దొరకలేదయ్యా' అన్నారు కించిత్ బాధ పడుతూ. ఆయన మాటలు వింటున్న ఆగంతకుడు కిలకిలా నవ్వుతూ, 'సార్! నేనేనండీ ఆ చీమకుర్తిని' అన్నాడు. ఆ షాపు యజమాని సంతోషానికి అవధులు లేకపోయాయి. తెనాలి లోనే వుంటూన్న హార్మోనిస్ట్ అంకయ్య గారిని అప్పటికప్పుడే పిలిపించి, హరిశ్చంద్ర పాత్ర వారణాసి, కాటిసీను పద్యాలు ఏకపాత్రగా, ఏకధాటిగా చీమకుర్తి చేత పాడించి రికార్డు చేశారు ఉమామహేశ్వరరావు గారు. ఆ రోజు అర్ధరాత్రి వరకూ వారణాసి, కాటి సీను లోని జాషువా పద్యాలు కొత్త రాగాలతో అద్భుతంగా పాడాడు చీమకుర్తి. 'ఇదంతా నిన్న మొన్ననే జరిగినట్లుందండీ. మళ్లీ పుడతాడా అటువంటి మహానట గాయక చక్రవర్తి!' కళ్ళు చెమర్చుతుండగా ఈ అపురూప జ్ఞాపకాన్ని నెమరు వేసుకున్నారు బాబు రికార్డింగ్ యజమాని ఉమామహేశ్వరరావు గారు. చీమకుర్తి తన జీవితంలో మొదటి సారి ఇచ్చిన రికార్డింగ్ అది. తన స్వంత బాణీలో పద్యాలు పాడి 'ఎవరీ చీమకుర్తి' అని అందరూ ఉలికిపడే విధంగా తెలుగు పద్య నాటక ప్రపంచాన్ని సంభ్రమానికి గురి చేసిన వాడు. ఇప్పుడా క్యాసెట్‌ని ఎవరెవరో యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మిలియన్స్ వ్యూస్‌గా వైరలయ్యి డబ్బులు సంపాయించి పెడుతోంది వాళ్ళకు. కానీ అంత ప్రయాసపడి ఆ క్యాసెట్‌ను రికార్డింగ్ చేసినవారికి గానీ, తన మధుర గాత్రంతో శ్రోతలను ఉర్రూతలూగించిన చీమకుర్తి సంబంధీకులకు గానీ ఏ ప్రయోజనం లేకపోయింది. 'వెంట వచ్చునది అదే యశస్సు, సత్యము' అని ఆయనే పాడినట్లు, కీర్తి మాత్రమే మిగిలుంది.

అది 2002వ సంవత్సరం. ఏప్రిల్ నెల ఎండలు మండిపోతున్నాయి. కడప పాత బస్టాండ్‌లో పోస్టర్లు వేశారు- పెద్ద చెప్పలిలో ఎల్లమ్మ తిరునాళ్ల సందర్భంగా హరిశ్చంద్ర నాటకం వేస్తున్నారని, 'వారణాసి' హరిశ్చంద్రుడుగా చీమకుర్తి నాగేశ్వరరావు వస్తున్నాడని. ఆ కరువు సీమలో చుట్టుపక్కల వందల గ్రామాల నుంచీ వేలమంది ప్రజలు చెప్పలి ఎల్లమ్మ తల్లి తిరునాళ్లకు హాజరవుతారు. ఎంతో భక్తితో ఎల్లమ్మ తల్లిని సేవించుకుని, ఆ రాత్రి ప్రదర్శించే నాటకాన్ని చూసి, తెల్లవారి గ్రామాలకు తరలిపోతారు. ఆరోజు 'సత్యహరిశ్చంద్ర నాటకం'లో ఆంధ్ర దేశంలో పేరు గాంచిన ఉద్దండులైన నటీనటులు- గుమ్మడి విమల కుమారి, బద్వేలు శ్రీహరిరావు, విజయరాజు, వై. గోపాలరావు, రామచంద్ర నాయుడు మొదలైన ఎందరో పెద్దలు ఉన్నారు. నేను కడపలో నా పనులు ముగించుకుని రాత్రి సమయానికి చెప్పలమ్మ తిరునాళ్ల జరిగే చోటుకు చేరుకున్నాను. అక్కడ మేకప్ రూంలో చూస్తే చీమకుర్తి కనిపించలేదు. విచారిస్తే, 'ఎక్కడో తాగి పడిపోయి వుంటాడు, చూడు పో' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు అక్కడున్న వాళ్ళు. అప్పటికి నాటకం మొదలై 'వేట సీను' హరిశ్చంద్రుడుగా గుమ్మడి విమల కుమారి అద్భుతంగా పాడి దిగినారు. 'అడవి సీను' హరిశ్చంద్ర పాత్రధారి బద్వేలు శ్రీహరి రావు వేదిక ఎక్కినారు. కానీ 'వారణాసి' హరిశ్చంద్రుడి జాడే లేదు. తరువాత వారణాసి సీను కాబట్టి ఇప్పుడాయన మేకప్పు వేసుకుంటూ వుండాలి. సరే ఎక్కడైనా పడుకుండిపోయాడేమోనని, ఆయన్ని వెతుకుతూ వేదిక చుట్టూ తిరుగుతూ వున్నా. అక్కడ ఒక చోట 'అబ్బ చీమలు! దానికి తోడు ఉబ్బగా ఉంది. అట్లా విసురు వెంకమ్మా!' అంటున్న గొంతు వినపడింది. అక్కడ, పుట్ట పక్కనే నేలపై తువ్వాలు పరుచుకుని, చీమకుర్తి పడుకుని వున్నాడు. 'అన్నా! ఇక్కడున్నావా? అడవి సీను అయిపోవచ్చింది!' అన్నాను. 'అయ్యా వచ్చావా? ఆ కాంట్రాక్టర్ రెడ్డి కనపడలేదా? కనీసం అన్నం కూడా పెట్టించలేదయ్యా!' అన్నాడు ఎంతో బాధగా. ఆయనని వెంటపెట్టుకొని పోయి అన్నదానం దగ్గర భోజనం పెట్టించి, మేకప్ రూమ్ దగ్గరకి వచ్చాము. అడవి సీను అయిపోయింది. హడావిడిగా మేకప్ ముగించుకుని వేదిక ఎక్కినాడు చీమకుర్తి. ప్రక్కన చంద్రమతీ లోహితాస్య నక్షత్రక సమేతంగా వారణాసి ఘట్టంలోకి ప్రవేశించినాడు. 'దేవీ కష్టములెట్లుండిననూ, పుణ్యక్షేత్రమైన వారణాసిని దర్శించితిమి చూడూ, ఈ వారణాసీ,' అని డైలాగు చెప్పి, 'భక్తయోగపదన్యాసి వారణాసి' అని పాడగానే జనం వన్స్‌మోర్ వన్స్‌మోర్‌లు కొడుతూ చప్పట్లూ కేకలతో ఆ ప్రాంతం హోరెత్తిపోయింది! తిరిగి అదే పద్యాన్ని భాగేశ్వరీ రాగంలో సమ్మోహనంగా పాడాడు చీమకుర్తి. పద్యాల ప్రభంజనం మొదలయ్యింది! 'అంతటి రాజచంద్రునకు ఆత్మజనై - కకుబంత కాంత విశ్రాంత యశోవిశాలుని త్రిశంకు నృపాలుని యిల్లు జొచ్చి' అని చీమకుర్తి ముఖారి రాగం హెచ్చు స్థాయిల్లో పాడుతుంటే వింటున్న జనం ఏడుస్తున్నారు. ఆ ప్రాంతమంతా నిశ్శబ్దమైపోయింది. తనని బానిసగా విక్రయించినప్పుడు చంద్రమతి పతీ వియోగ దుఃఖంతో హరిశ్చంద్రుని పాదాలపై పడి మొరపెట్టుకునేవేళ, రారాజు బిడ్డయైన దేవికి ఇంతటి కష్టం తెచ్చిపెట్టినందుకు ఒకింత చింతిస్తూ, 'ఛీ ఛీ కఠినాత్మా హరిశ్చంద్రా! నీవు నిక్కముగా కిరాతులకు జన్మించవలసిన వాడవు గదా!' అని డైలాగు చెప్పి పద్యం చదివేవేళ, 'పట్టపుందేవినమ్మితే బానిసగనూ' అంటూ కళ్ళ వెంబడి పెల్లుబికిన కన్నీటి బిందువులామె శిరస్సుపై జారిపడటం ప్రేక్షక హృదయాలను కలచివేసిన దృశ్యం. కమలాపురం ప్రాంతానికి చీమకుర్తిని తొలిసారి బుక్ చేసినారు. ఎట్లా పాడి రక్తి కట్టిస్తాడో మరి ఈ నాటకాన్ని అనుకున్నాను. కానీ ఆ రోజు చీమకుర్తి ఒక్క చుక్క కూడా మందు ముట్టలేదంటే ఎవరూ నమ్మలేని నిజం. కొత్త ప్రాంతమని భయమో బిడియమో తెలియదు గానీ ఆ నాటకంలో చిరస్మరణీయంగా పాడినాడు. ఈలలతో కేకలతో ఆ పేదజనం డబ్బుల దండలతో చీమకుర్తిని ముంచేశారు. వేదిక ఎక్కక ముందు ఆయన అనామకుడే. పాడి దిగిన తర్వాత ఆయన చుట్టూ వున్న జన సమూహాన్ని దాటుకుని ఆయన్ని చేరుకోవడానికి చాలా సమయం పట్టింది.


(బొమ్మ: పెంచల్దాస్)

పగలంతా సని చేసి అలసి పోయిన శ్రమ జీవులకు తన గాన మాధుర్యంతో 30ఏళ్ళ పాటు సేద తీర్చిన మహాకళాకారుడు చీమకుర్తి నాగేశ్వరరావు. ఆంధ్ర రాష్ట్రమే గాక ఇతర రాష్ట్రాలలో దాదాపు 3000 ప్రదర్శనలు ఇచ్చి రంగస్థలాన హరిశ్చంద్ర పాత్రకు జీవం పోసి తెలుగు గుండెలపై చెరగని ముద్ర వేసిన కళాకారుడు. తెలుగు నాట రోజుకో పద్యమైనా వినకుంటే పూటగడవని మాస్ ఫాన్స్ వున్నారు చీమకుర్తికి.


చీమకుర్తి భార్య వెంకమ్మతో పెంచల్దాస్

పగలంతా పని చేసి అలసిపోయిన శ్రమ జీవులకు తన గాన మాధుర్యంతో 30 ఏళ్ళ పాటు సేద తీర్చిన మహాకళాకారుడు చీమకుర్తి. ఆంధ్ర రాష్ట్రమే గాక ఇతర రాష్ట్రాలలో దాదాపు 3000 ప్రదర్శనలు ఇచ్చి రంగస్థలాన హరిశ్చంద్ర పాత్రకు జీవం పోసి తెలుగు గుండెలపై చెరగని ముద్ర వేసిన కళాకారుడు. తన ముందు తరం 'హరిశ్చంద్ర' పాత్రధారులైన బండారు రామారావు, డి.వి. సుబ్బారావు గార్లను అనుకరిస్తూనే అరుదైన స్వంత బాణీని ఏర్పరచుకున్నాడు. ఆ నడుమ కీ.శే. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తన 'పాడుతా తీయగా' ప్రోగ్రామ్‌లో ఔత్సాహిక గాయకుల చేత చీమకుర్తి పద్యాలు పాడించి 'ఇటువంటి సంగీతకారుణ్ణి నా జీవితంలో వినలేదు కనలేదు' అని వేనోళ్ళ పొగిడారు. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న చీమకుర్తి గురించి ప్రస్తావిస్తూ, 'కళ తప్ప ఇంకేమీ తెలియని వాడు. భారతరత్నకు అర్హుడు' అని ప్రశంసించినారు. తెలుగు నాట రోజుకో పద్యమైనా వినకుంటే పూట గడవని మాస్ ఫాన్స్ వున్నారు చీమకుర్తికి.

2006లో చీమకుర్తి చివరి నాటకం నెల్లూరు టౌన్ హాల్‌లో జరిగింది. బొత్తిగా చిక్కిపోయినాడు. ఎముకల గూడుకు వేషం వేసినట్లుగా వుంది ఆయన రూపం. 'భక్తయోగ పదన్యాసి' పద్యమే పాడలేకున్నాడు. వేదిక ముందు అశేష జనవాహిని టిక్కెట్టు కొని మరీ వచ్చి వున్నారు. ఆ పద్యం కాకపోతే ఇంకో పద్యమైనా పాడతాడు అనుకుంటూ పడిగాపులు పడ్డారే గానీ, చీమకుర్తిని పల్లెత్తు మాట అనలేకపోయారు. 'అయ్యా నా ఆరోగ్యం బాగులేదు. డి.వి., బండారు- మేమంతా తాగి తాగి ఇట్టయినాము. మాలాగా ఎవరూ కాకూడదు' అంటూ మధ్య మధ్యలో జనానికి హితవు చెపుతున్నాడు. గాత్రం సహకరించక మధ్యలోనే స్టేజీ దిగిపోయాడు. దిగేముందు కన్నీటి పర్యంతమవుతూ చేతులు జోడించి నమస్కరిస్తూనే వున్నాడు. ఇది జరిగిన కొద్ది రోజులకే దేహయాత్ర చాలించాడు.

ఈమధ్య ఒకసారి చీమకుర్తికి పోయి రావాలనుకున్నాను. నాగేశ్వరరావు సగభాగం వెంకమ్మ గారు అక్కడే వున్నారు. అప్పుడే ఆయన వెళ్ళిపోయి 18ఏళ్లయ్యింది. ఆమె ఎలా ఉందో, ఆ కుటుంబం ఎలా వుందో చూసి రావాలనిపించింది. చీమకుర్తికి చేరుకునేసరికి మధ్యాహ్నం అయ్యింది. ఎన్నోసార్లు అగ్రహారం వచ్చినాను గానీ, ఇప్పుడు ఇల్లు కనుక్కోలేకపోయినాను. ఆ వీధి మొత్తం మారిపోయింది. ఎవరో ఇల్లు చూపించారు. కనీసం విద్యుత్ సరఫరా లేని ఆ చీకటి ఇంట్లోకి అడుగుపెట్టగానే కుక్కి మంచంలో లేవలేని స్థితిలో వున్న వెంకమ్మ నన్ను చూసి లేవబోయారు. ఆ స్థితిలో ఆమెను చూడగానే నా కళ్ళ వెంట కన్నీళ్లు కారాయి. ఒక్కగానొక్క కుమారుడు కూలిపని చేస్తూ వండి పెడుతున్నాడు. వెంకమ్మ గారు కాలు చెయ్యి ఆడి, తిరిగే రోజుల్లో పూట గడవక కూలి పనులకు వెళ్లేవారట. చీమకుర్తి నడిబొడ్డున అభిమానులు నాగేశ్వరరావు గారి విగ్రహం నిలిపిన చోట గంపలో జామకాయలు, వేరుశెనక్కాయలు పెట్టి అమ్ముకునే వారట. ఇప్పుడు అదీ లేదు. 'హృదయమున దుఃఖమింతేనియున్ పదిల పడదూ - మరతునన్నా సతీసుతుల్ మరుపురారు' అని పరితపిస్తూ కాటిసీన్లో భార్యాబిడ్డల్ని తలచుకొని దుఃఖించిన చీమకుర్తి నేడు వారి దీనస్థితిని చూడలేక ముదురు తమస్సులో మునిగిపోయినాడు. చీమకుర్తి కొండల్లో గుంకినాడు.

(జనవరి 21 చీమకుర్తి నాగేశ్వరరావు వర్ధంతి)

■ పుట్టా పెంచల్దాస్
✆ 63055 22467

కవితా సంపుటాలకు ఆహ్వానం

పాలమూరు సాహితీ అవార్డుల కోసం 2024 సంవత్సరంలో ముద్రితమైన వచన కవితా సంపుటాలు మూడేసి ప్రతులను జనవరి 31 లోగా చిరునామా: భీంపల్లి శ్రీకాంత్, ఇం.నం. 8538, టీచర్స్ కాలని, మహబూబ్ నగర్ - 509001కు పంపాలి. ఉత్తమ వచన కవితా సంపుటికి రూ.5,116/- నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేస్తారు. వివరాలకు: 90328 44017.

భీంపల్లి శ్రీకాంత్

వుప్పల నరసింహం యాది

జర్నలిస్ట్, రచయిత వుప్పల నరసింహం యాదిలో సభ జనవరి 21 మ.2గంటలకు బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్, సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియం, 1వ అంతస్తు, నిజాం కాలేజీ ఎదురుగా, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షులు వుప్పల బాలరాజు. జయధీర్ తిరుమలరావు, బి.ఎస్. రాములు, ఆడెపు లక్ష్మీపతి, కవి యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, తుమ్మలపల్లి రఘురాములు, శంకర నారాయణ, అనిల్ అట్లూరి, కె.పి. అశోక్ కుమార్, జంపాల ప్రవీణ్ తదితరులు ప్రసంగిస్తారు.

వనపట్ల సుబ్బయ్య

ఊరి పద్యం

మా ఊరిప్పుడు
మహా రాకాసిలా సాగే బాట పక్కన
ముడుచుకు పడుకున్న కుక్క పిల్ల

మా ఊరిప్పుడు
మూడు కాళ్ళతో నడయాడే
ముదివగ్గుల వృద్ధాశ్రమం

మా ఊరిప్పుడు
దేశాల బాట పట్టిన బిడ్డల కోసం
ఎదురు చూసే చకోరం

మా ఊరిప్పుడు
పలకరింపును ఫోన్లలో
వెతుక్కునే యశోధర

మా ఊరిప్పుడు
సీరియళ్ళ ద్వేషాన్ని కప్పుకున్న
టీవీల జిలుగు తెర


మా ఊరిప్పుడు
భరోసా కోసం అంగలార్చే రైతుల
నాగేటి సాలు

మా ఊరిప్పుడు
కడుపు కోసం కైకిలయ్యే
కూలీల అన్నం ముద్ద

మా ఊరిప్పుడు
పింఛన్లు, రేషన్ కార్డుల మధ్య
నలుగుతున్న ఓట్ల పెట్టె

మా ఊరిప్పుడు
పాడె మోసే నలుగురి కోసం
వెతుక్కుంటున్న వల్లకాడు

■ వి.ఆర్. తూములూరి
✆ 97052 07945



మధ్యతరగతి స్త్రీ నా ఇతివృత్తం

– స్వాతీ శ్రీపాద

"There is no greater agony than bearing an untold story inside you" అని ఎప్పుడో మాయా ఏంజిలో అన్నట్టు స్వాతి శ్రీపాద ఎంత వేదనను మోస్తున్నారో బాల్యం నుంచీ- ఆరు దశాబ్దాలకు పైగా నిరంతర ప్రవాహంగా రాస్తూనే వున్నారు. కవిత, కథ, నవల, పాట- ఒకటేమిటి దాదాపు అన్ని ప్రక్రియల్లోనూ సృజించి తన ముద్ర చాటుకున్నారు. ఇప్పటికి ఎనిమిది కవితా సంపుటాలు, ఏడు నవలలు, ఆరు కవితా సంకలనాలు వెలువరించడంతోపాటు, తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల వారికి చేర్చాలనే ఉన్నతాశయంతో సుమారు మూడు డజన్ల పుస్తకాలను ఆంగ్లంలోకి అనువదించారు. ఆమె నేడు సుశీలా నారాయణ రెడ్డి సాహితీ అవార్డ్ అందుకుంటున్న సందర్భంగా ఆమెతో సంభాషణ.

ఇంటర్వ్యూ ■ దేశరాజు

1963 నుంచి రాస్తున్నా మీపై దిగంబర కవిత్వం, అరసం, విరసం ప్రభావాలు పడకపోడానికి కారణం?

చెప్పడానికి 1963 అని ఒక లెక్క చెప్పినా, ఒకటో తరగతిలో బీర్కూరు ప్రభుత్వ పాఠశాలలో పాటల పోటీ పెడితే నేను స్వంతంగా పాట అల్లుకుని పాడాననీ, బహుమతులుగా రిబ్బన్ ముక్క, రెండు రంగు చాక్‌పీస్‌లూ, రెండు బలపాలూ ఇచ్చారని అమ్మ చెప్పేది. రాయాలన్న తపన జన్మాంతరాల నుండి తెచ్చుకున్నట్టున్నాను. 1963 నెహ్రూ మరణం అప్పుడూ ఏవో పేరడీ పాటలు రాసిన గుర్తు. అరసాలూ, విరసాలూ ఏవైనా సమాజంలో ఒక గుర్తింపు కోసమే. ఆరోజుల్లో విరసం రెండో వార్షిక సభలకు వెళ్ళాను. శ్రీశ్రీని సభలో ఎవరో అడిగారు 'విప్లవం మీ ఊపిరి అయితే, నా హృదయంలో నిదురించే చెలీ అని పాట ఎలా రాశారు' అని. 'నా హృదయంలో నిదురించే చెలి విప్లవమే' అన్నారాయన. ఎన్ని విప్లవాలు నాలుక చివరి నుండి వచ్చినా, దెబ్బ తగిలితే అమ్మా అనే అంటాము, అన్నమే తింటాము. ఈ ప్రపంచం నడిచేది ప్రేమ మీదే అనిపించింది. బయట ఉద్యమ ప్రభావాలూ, ఇంట్లో ఛాందస భావాలూ ఏవీ నాపై ప్రభావం చూపలేదు.

కథ, నవలా రచనలో మీరు అనుసరించే రచనా వైఖరి ఏమిటి?

చిన్నప్పుడు విపరీతంగా చదువుతూ, సమస్యలకు రచనలో పరిష్కారాలు వెతుకున్న దశ తర్వాత, క్రమంగా నా చుట్టూ రోజువారీ జీవితంలో కనిపించే సమస్యలు, వాటి మూలాలు తీసుకుని నాకు తోచిన, నేను అభిలషించే పరిష్కారాలు అందించడం మొదలెట్టాను. అవే నా కథలు, నవలలు. అయితే నాకున్న పరిధిలో నా రచనలకు మూలాధారాలు మధ్య తరగతి స్త్రీల సమస్యలు. అలాగని అది ఫెమినిజం కాదు. స్త్రీలు ఎదుర్కునే చిత్ర విచిత్రమైన సంఘర్షణలు. గుడ్డిగా ఏవైపూ పక్షపాతం చూపను. అందుకే కొన్నిచోట్ల సెంటిమెంట్‌కు విలువ ఇవ్వడం, తప్పని చోట నియమ నిబంధనలు తోసిరాజని అడుగు ముందుకు వెయ్యడం కనిపిస్తుంది.



చిన్నప్పుడు విపరీతంగా చదువుతూ, సమస్యలకు రచనలో పరిష్కారాలు వెతుకున్న దశ తర్వాత, క్రమంగా నా చుట్టూ రోజువారీ జీవితంలో కనిపించే సమస్యలు, వాటి మూలాలు తీసుకుని నాకు తోచిన, నేను అభిలషించే పరిష్కారాలు అందించడం మొదలెట్టాను. అవే నా కథలు, నవలలు.

తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేసేప్పుడు ఎదురైన ప్రధానమైన ఇబ్బందులు ఏమిటి?

చాలా ఏళ్ళ పాటు తెలుగు గాలి కూడా సోకని ఉద్యోగంలో ఉండటం వల్ల నా ఆలోచన ఎప్పుడూ రెండు భాషల్లో సాగేది. అనువాదం నన్ను నేను పూర్తిగా పనిలో నిమగ్నం చేసుకునేందుకు ఇష్టంగా అలవరచుకున్న వ్యాపకం. నిజమే మన తెలుగు నుడికారాలూ, మనకే స్వంతమైన వ్యక్తీకరణలూ ఇంగ్లీష్‌లోకి రాలేవు. సంస్కృతి, ఆచార వ్యవహారాలూ, ఆహారపు అలవాట్లూ కొంచెం ఇబ్బందే. కాని మన భాషతో పాటు వాటినీ పరిచయం చెయ్యాలని నా అభిప్రాయం. అది మంచి అనువాదంగా అనిపించకపోవచ్చు. కాని మన శైలి, మన జీవన విధానం చెప్పలేకపోతే ఇక అనువాదాలెందుకు? మరొకటి మనం మనంగా కాక మరొకరిని దృష్టిలో పెట్టుకుని అనువదించడం. మన భావం స్పష్టంగా అన్యభాషీయులకు చేరాలి. రాజీ పడకపోతే కష్టమే.

తెలుగు పాటలను ఇంగ్లీషులోకి తీసుకెళ్లేప్పుడు ఎటువంటి పద్ధతులు అనుసరించారు? వ్యవహారికాలు, సామెతలు, మాండలిక పదాలు అనువాదానికి లొంగాయా?

జన్మతహా పాట మీద ఉన్న వ్యామోహం వల్ల కావచ్చు కొంత తెలీకుండానే ఆ దారిలోకి వెళ్ళాను. 'నేలమ్మా, నేలమ్మా' అనగానే వెంటనే అదే ట్యూన్‌లో 'మదర్ సాయిల్, మదర్ సాయిల్' అనాలనిపించింది. ఆ ఎంపిక తెలియాలంటే రెండు భాషలలో పద విజ్ఞానం పెంచుకోవాలి. నేను పేరుకో, గుర్తింపుకో అనువాదం చెయ్యడం లేదు. సో నో కాంప్రమైజ్. సామెతలు కొన్ని సరిసమానాలు ఉన్నాయి. లేనివి సృష్టించుకోవాలి. మాండలికాలూ అంతే. సరైన పదం కోసం రోజులకు రోజులు పని ఆపేసి ఆలోచించిన సందర్భాలెన్నో ఉన్నాయి.

ఆరు దశాబ్దాల సాహిత్య వ్యాసంగాన్ని అవలోకనం చేసుకుంటే ఏమనిపిస్తుంది?

ఆరేనా? నాతోపాటు పుట్టి నాతోనే సాగుతున్న ఈ కృషి అవలోకనం చేసుకోడమంటే నా జీవితాన్ని అవలోకనం చేసుకోడమే. ప్రతిక్షణమూ జీవితంలోనూ, సాహిత్యంలోనూ ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉన్నాను. ఏదో సాధించానని ఎప్పుడూ అనిపించదు.

కవిత, కథ, నవల, పాట, అనువాదం అన్ని ప్రక్రియల్లో చేయి తిరిగిన మీకు తగిన గుర్తింపు వచ్చిందని భావిస్తున్నారా?


ఏ గుర్తింపు కోసమో రాసుకోలేదు. రోజూ ఓ కవితో, పాటో రాస్తూనే ఉంటా. నలుగురితో పంచుకుంటా. చదివి ఆనందిస్తారని. చుట్టూ మనసుకు హత్తుకునే ఘటనలు, మనసును నొప్పించే మాటలు, మనసు మెలితిప్పే బాధలు అన్నీ కవిత్వం కాలేవు. ఏదో పరిష్కారం చెప్పాలన్న తపన కథలో తప్ప సాధ్యం కాదు, సుదీర్ఘమైన జీవితం ప్రస్తావించడానికి నవల తప్ప మరో దారిలేదు. రచన నా హెల్త్ డ్రింక్, రచన నా ఎనర్జీ బూస్టర్. అది నా ఊపిరి, ఉనికి. అవ్యక్తాన్ని వ్యక్తం చేసే బాధ్యత నాది.

కాళ్లకి మబ్బులు మొలిచి నింగిలో తేలిన హాయి!

నా మొదటి పుస్తకం

వసీరా

"**కాళ్లు** తడవకుండా సముద్రాన్ని దాటిన మేధావి కూడా, కళ్లు తడవకుండా జీవితాన్ని దాటలేడు" – ఇది నా మొదటి కవిత, ఆంధ్రజ్యోతిలో అచ్చయ్యింది. అచ్చులో తొలిసారి నా పేరు చూసుకున్న ఆశ్చర్యం ఆనందం అంతా ఇంతా కాదు. ఆ సంబరంలో ఆంధ్రజ్యోతి పేపర్ వచ్చే దుకాణాలకీ లైబ్రరీలకీ ఇళ్లకీ సైకిల్ మీద రయ్యిమంటూ పోయి, అక్కడి పేపర్లో కూడా నా పేరు ఉందని ఆశ్చర్యపోయి, మురిసిపోయాను. అమలాపురం ఊరంతా తోరణాలు కట్టినంత పని చేశాను. 1980లో అలా మొదలయ్యింది నా జర్నీ. నా కవితలు ఎక్కువగా ఆంధ్రజ్యోతి, ప్రజాసాహితి పత్రికల్లో వచ్చాయి. పుస్తక రూపంలో రాకముందే సంచార కవి పెమ్మరాజు గోపాలకృష్ణ ద్వారా పొయెట్రీ సర్కిల్స్ లోకి వెళ్లిపోయాయి. నా సమకాలికుల పుస్తకాలు ఒక్కటొక్కటే వస్తున్నాయి. నాకు టెన్షన్ మొదలయ్యింది. పుస్తకం వెయ్యాలి, కానీ డబ్బుల్లేవు. వాసిరెడ్డి నవీన్ సొంత డబ్బుతో 'లోహనది' పుస్తకం అచ్చు వేశాడు. డబ్బు దగ్గర నుండి, శివారెడ్డి గారిచేత ముందు మాట రాయించడం, శీలావీర్రాజు గారి చేత కవర్ పేజీ బొమ్మవేయించడం, ప్రెస్సు వాళ్లతో మాట్లాడ్డం మొదలైన నొప్పులన్నీ తనే పడ్డాడు. అంచేత నాకు నొప్పి తెలియలేదు. 'లోహనది'లో కవిత్వం నచ్చిన శీలా వీర్రాజుగారు కూడా మిగతావాటికి భిన్నంగా అధివాస్తవిక ముఖచిత్రం వేసి ఇచ్చారు. హ్యాండ్ కంపోజింగ్. 'ఝరీ' పొయెట్రీ సర్కిల్ తరఫున 1989 ఆగస్టులో పుస్తకం వచ్చింది. వెల పది రూపాయలు. చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రెరీలో పోలీసు, సిఆర్పీ దళాల పహరాలో కిక్కిరిసిన జనం మధ్య పుస్తకా విష్కరణ జరిగింది. జైలు నుండి విడుదలైన వరవరరావు గారు పాల్గొన్న మొదటి సమావేశం అది. కారా మాస్టారు పుస్తకం ఆవిష్కరించారు. దేవిప్రియ అధ్యక్షుడు. వివి, శివారెడ్డి ప్రధాన వక్తలు. పెమ్మరాజు గోపాలకృష్ణకు అంకితం ఇచ్చాను. ఆయన తొలి ప్రతి స్వీకరించారు. పుస్తకం మొదటి కాపీల కట్ట విప్పి పుస్తకం చూసిన వెంటనే తీవ్రభావోద్వేగానికి గురయ్యాను. పుస్తకాల్ని కాసేపు గుండెకు హత్తుకుని ఉంచుకున్నాను. సభలో వివి అద్భుతంగా మాట్లాడారు. సభానంతరం ఆటోగ్రాఫులు ఇవ్వడం, పుస్తకాల మీద సంతకం చేసి ఇవ్వడం గొప్ప సంతోషం. పుస్తకానికి మంచి స్పందన లభించింది. ప్రగతిశీల శిబిరాలు ఇందులో కవిత్వాన్ని ఓన్ చేసుకున్నాయి. వసీరా ఏం చెప్పినా కవిత్వమే చెప్పాడంటూ చేకూరి రామారావు ఆంధ్రజ్యోతిలో 'చేరాతలు' కాలమ్‌లో రాశారు. ప్రసవం తర్వాత బిడ్డ అందచందాలని గుణగణాల్నీ పదిమందీ మెచ్చుకుంటే ఆ కిక్కే వేరు. నిప్పుల్ని మింగి, ఎన్నో నొప్పుల్ని భరించి కవితలు రాసిన బాధంతా మర్చిపోయి, ఒక్కసారి కాళ్లకి మబ్బులు మొలిచి నింగిలో తేలిన హాయి. 'లోహనది'కి గరికపాటి, ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డులు వచ్చాయి. ఆ డబ్బుతో వాసిరెడ్డి నవీన్ బాకీ తీర్చేశా. కానీ ఇప్పటికీ రుణపడే ఉన్నాను. దాదాపు 30ఏళ్ల తర్వాత 'లోహనది'లో కవితలు ఇప్పటికీ రిలవెంట్ అని భావించి మిత్రులు శ్వేత యర్రం, మల్లికార్జున్ తమ అజు పబ్లికేషన్స్ నుండి రీప్రింటు వేశారు. 80 దశకాన్ని రిప్రజెంట్ చేసే కవిత్వ పుస్తకాల్లో 'లోహనది' ఒకటి కావడం, ఇప్పటి వారికీ బాగా నచ్చడం సంతోషకరం.





ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
సోమవారం 20 జనవరి 2025

'గిరిజన-ఆదివాసీ' సమ్మేళనం





'గిరిజన-ఆదివాసీ' సమ్మేళనంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో 'గిరిజన-ఆదివాసీ' సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు హాజరయ్యారు. గిరిజన సోదరులు వివిధ ఉత్పత్తులు, హస్తకళలకు సంబంధించి తమకు ఉండే సహజసిద్ధ నైపుణ్యాలకు వ్యాపార విలువలను జోడించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ప్రదర్శిం చిన గిరిజన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శన లు, గిరిజన వేషధారణలు ఆకట్టుకున్నాయి.



అభివృద్ధి పండగ



ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌ఐడీఎం పరికరాలను ఆసక్తిగా గమనిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్

కొండపావులూరులో కొలువుతీరిన కేంద్ర ప్రభుత్వ సంస్థలు

ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌ఐడీఎం భవనాలు ప్రారంభించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



మాక్ డ్రిల్ ప్రదర్శిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

- హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్
- ఆకట్టుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాల మాక్ డ్రిల్

విజయవాడ/గన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మండలం కొండపావులూరులో కేంద్ర విపత్తు సంస్థలు కొలువుతీరాయి. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఐడీఎం), జాతీయ విపత్తు సహాయక బృందాలు (ఎన్‌డీఆర్‌ఎఫ్) ప్రాంగణాలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సీఎం చంద్రబాబుతో కలిసి శనివారం ఘనంగా ప్రారంభించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్, ఎన్ఐడీఎం ప్రాంగణాలు పచ్చని చెట్ల మధ్య ఆకర్షణీయంగా దర్శనమిచ్చాయి. ఎన్ఐడీఎం, ఎన్‌డీఆర్‌ఎఫ్ భవనాలు, వాటి విశిష్టతలను ఆయా సంస్థల విభాగాధిపతులు వివరించారు. తొలుత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఎన్ఐడీఎం ప్రాంగణానికి చేరుకున్నారు. ఎన్ఐడీఎం విభాగాధిపతి క్యాంపస్ గురించి వివరించారు. త్రీడీ ప్రింట్స్‌ను చూపిస్తూ ఆయా బ్లాకులలో ఏమి జరుగుతుందో చెప్పారు. ఆ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్‌లకు ఆయా సంస్థల అధిపతులు యంత్ర పరికరాల గురించి వివరించారు. వీరంతా మిగతా 6లో..

వికసిత్ పంచాయత్ లక్ష్యంగా గ్రామాభివృద్ధి

- ఎంపీ కేశినేని శివనాథ్



6లో

అమిత్‌షా రాజీనామా చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



స్వరాభిషేకం

సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీత సన్మండలి నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజస్వామి ఉత్సవాల్లో ఆదివారం ఘనరాగ పంచరత్న కృతుల గోష్టి గానం నిర్వహించారు. 300 మందికి పైగా కళాకారులు పాల్గొని త్యాగరాజస్వామికి స్వరాభిషేకం చేశారు. 6లో



పొగ దొంగలు!

కోట్లలో నకిలీ సిగరెట్ల వ్యాపారం



ఉత్తరాది ముఠాలతో దోస్తీ

- ప్రైవేటు కొరియర్ల ద్వారా వస్తున్న సరుకు
- పన్నుల చెల్లింపులకు ఎగనామం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): అమరావతికి అటువైపున ఉన్న గుంటూరు, ఇటువైపున ఉమ్మడి కృష్ణాజిల్లాలో 'పొగ' మాఫియా పాతుకుపోతోంది. నకిలీ సిగరెట్ల చలామణికి రెండు జిల్లాలు కేంద్ర బిందువులుగా మారుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సరుకుకు ఉమ్మడి కృష్ణా జిల్లాను కేంద్రంగా మార్చుకుంటున్నారు. అసలు బ్రాండ్లను పోలి ఉండే బ్రాండ్లతో నకిలీ సిగరెట్లను తీసుకొచ్చి కోట్లాది రూపాయలను ఆర్జిస్తున్నారు. రాష్ట్రం మొత్తానికి నకిలీ సిగరెట్లకు అంటే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు పిన్‌కోడ్‌గా మారుతున్నాయి. ఈ మాఫియా తీరుతో అన్ని అనుమతులతో సిగరెట్లను తయారు చేస్తున్న కంపెనీలు తలలు పట్టుకుంటున్నాయి. తాజాగా సెంట్రల్ జీఎస్టీ అధికారులు అజిత్‌సింగ్‌నగర్, అంబాపురంలో రూ.కోటి విలువ చేసే నకిలీ సిగరెట్లు, ఖైనీ సరుకును సీజ్ చేశారు.

తెర వెనుక ఎవరు?

బిహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో నకి'లీల'లు ఎక్కువగా ఉంటాయి. అక్కడ తయారవుతున్న నకిలీ సిగరెట్లను రెండు జిల్లాలకు చెందిన మాఫియా ప్రైవేటు కొరియర్లలో రప్పిస్తోంది. నిబంధనల ప్రకారం ఒక పార్శిల్‌ను కొరియర్ చేసినప్పుడు బుక్ చేసే సమయంలో అందులో ఉన్న వస్తువులు ఏమిటి అన్నది ఆయా సంస్థల ప్రతినిధులు పరిశీలించాలి. అటువంటిది నకిలీ సిగరెట్లు ఏకంగా కొరియర్లలో రాష్ట్రాలు, నగరాలు దాటి రావడం వెనుక ఈ కొరియర్ సంస్థల పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకుముందు ఈ మాఫియా ప్రత్యేకంగా కంటైనర్లను బుక్ చేసుకుని సిగరెట్లను తీసుకొచ్చేవారు. ఈ సమాచారం తెలుసుకున్న సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు టోల్‌ప్లాజాల వద్ద తనిఖీలు చేయడంతో ఈ నకిలీ సిగరెట్ల బాగోతం వెలుగులోకి వస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కంటైనర్లు వరుసగా సీజీఎస్టీ, కస్టమ్స్ బృందాలకు పట్టుబడుతుండడంతో మాఫియా కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఉత్తరాదిలో ఉన్న కంపెనీలకు ఇక్కడ నుంచి ఆర్డర్లు ఇచ్చి కొరియర్ సంస్థల ద్వారా రప్పించుకుంటోంది. విజయవాడకు శివారున ఉన్న అజిత్‌సింగ్‌నగర్, అంబాపురం, ముస్తాబాద, గన్నవరం, కేసరపల్లిలో కొరియర్ సంస్థలకు చెందిన గోడౌన్లు ఉన్నాయి. ఇక్కడికి వచ్చిన సరుకును మాఫియా కింద పనిచేసే ఏజెంట్లు తీసుకుంటున్నారు. గడిచిన ఏడాది బిహార్‌లోని పాట్నా నుంచి డీటీడీసీ కొరియర్‌కు వచ్చిన నకిలీ సిగరెట్లను సెంట్రల్ జీఎస్టీ అధికారులు సీజ్ చేశారు. రూ.2.46కోట్లు విలువ ఉండే ఈ సరుకుకు ఇన్వాయిస్‌లో మాత్రం రూ.8లక్షల విలువను చూపించారు. నకిలీ సిగరెట్లతో పొగప్రియుల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రభుత్వ ఖజానాకు పన్నులు చెల్లించకుండా గండికొడుతున్నారు. ఈ ఇన్వాయిస్‌ల మీద మాత్రం బీడీలు అని రాశారు.

దర్యాప్తు ఏమవుతున్నట్టు?

సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు విదేశీ బంగారం, నకిలీ సిగరెట్లను సీజ్ చేసినప్పుడు హడావుడి చేస్తున్నారు. ఆ తర్వాత దర్యాప్తును పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్మగ్లింగ్ సరుకులను పట్టుకున్నప్పుడు ఒక ప్రకటన విడుదల చేస్తున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొంటున్నారు. తర్వాత దర్యాప్తు విషయంలో అడుగు ముందుకు పడడం లేదని తెలుస్తోంది. సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు ఇప్పటి వరకు సీజ్ చేసిన స్మగ్లింగ్ వస్తువుల కేసుల్లో ఇదే జరుగుతోంది. ఇప్పటి వరకు ఫలానా కేసులో అసలు నిందితులను గుర్తించామని, పట్టుకున్నామని ప్రకటించలేదు. ఈ మొత్తం వ్యవహారం ఆయా సంస్థల అధికారుల తీరుపై అనుమానాలకు తావిస్తోంది. సరుకును సీజ్ చేసినా అసలు నిందితులను పట్టుకోవడానికి అధికారులు అడుగులు వేయకపోవడం మాఫియాకు పెద్ద అవకాశంగా మారుతోందని ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నకిలీ మాఫియా వేళ్లూనుకుపోతోందని తెలుస్తోంది.

అందని అల్పాహారం

పదో తరగతి విద్యార్థులకు ప్రారంభమైన సాయంత్రం క్లాసులు

నేటి వరకు జిల్లా పరిషత్ నుంచి మంజూరు కాని నిధులు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు.. పట్టించుకోని అధికారులు



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేసేందుకు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆయా సబ్జెక్టు టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళ విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు జిల్లా పరిషత్ నుంచి ఏటా నిధులను విడుదల చేస్తారు. అయితే ఈ ఏడాది నిధులు ఇంకా విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు మాత్రం సంబంధిత ఫైలును జెడ్పీకి పంపాం, నిధులు విడుదల కావాల్సి ఉందని చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల ఆధారంగా వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి వారికి ఉదయం, సాయంత్రం సమయాల్లో దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు మార్చిలో జరిగే పరీక్షలకు సమాయత్తం చేసేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 25 వేల మందికిపైగా విద్యార్థులకు డిసెంబరు నుంచి ఈ ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 415 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థినీ, విద్యార్థులకు అల్పాహారం ఇచ్చే నిమిత్తం జిల్లా పరిషత్ నుంచి నిధులను విడుదల చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో ఏడాదికి రూ.45లక్షలు కేటాయించేవారు. గతేడాది ఈ మొత్తాన్ని రూ.17లక్షలకు కుదించారు. జిల్లా పరిషత్ నుంచి నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయితే కలెక్టర్ ఆమోదంతో ఈ నిధులు ఆయా ఉన్నత పాఠశాలలకు విడుదల అవుతాయి. ఏటా జనవరిలో ఈ నిధులను విడుదల చేస్తే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించేవారు. ఈ ఏడాది ఇంకా ఈ నిధులను విడుదల చేయకపోవడంతో అల్పాహారం అందడంలేదు.

దాతల సహకారం తీసుకుంటారా?

విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు జిల్లా పరిషత్ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో విద్యాశాఖ అధికారులు గ్రామాల్లోని దాతల సహకారంతో ఈ కార్యక్రమానికి నిధులు సమకూర్చుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చెప్పారు. అయితే వారు ఈ వ్యవహారంపై అంతగా దృష్టిసారించలేదు.

జిల్లా పరిషత్‌కు లేఖ రాశాం

జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే సాయంత్రం సమయంలో అల్పాహారం ఇచ్చేందుకు ఏటా మాదిరిగానే నిధులు విడుదల చేయాలని జిల్లా పరిషత్‌కు ఇప్పటికే లేఖ రాశాం. నిధులు విడుదలపై ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. నిధులు వచ్చిన వెంటనే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాం.

-పీవీజే రామారావు, డీఈవో

కిటకిట..



విజయవాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సంక్రాంతి పండగ సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణాలతో బెజవాడ రైల్వే జంక్షన్ జామ్ అయ్యింది. ఆదివారం రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఎంతలా అంటే రైల్వే స్టేషన్ ప్రాంగణం దగ్గర వచ్చీపోయే వాహనాలలో దిగే ప్రయాణికులతో స్తంభించి పోయింది. రైల్వేస్టేషన్ బయట వాహనాలు ముందుకు కదలటానికే ఇబ్బందులు ఉంటే.. రైల్వేస్టేషన్‌లో రద్దీ చెప్పలేనంతగా మారింది. ప్లాట్‌ఫామ్‌లు కిటకిటలాడాయి. రైళ్లు రావటమే తరువాయి అన్నట్టుగా పరిస్థితి తయారైంది. రైళ్లు వస్తుంటే ప్రయాణికులు ఎగబడ్డారు. రైల్వేస్టేషన్‌లో 10 ప్లాట్‌ఫామ్‌లు ఉండగా.. ప్రతి ప్లాట్‌ఫామ్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఫుట్ ఓవర్ బ్రిడ్జిల మీద అయితే ప్రయాణికులకు ఊపిరి సలపనంత పనైంది. సంక్రాంతి పండగలో ఆదివారం నాటి రద్దీ ఎన్నడూ కనిపించలేదు. మరోవైపు బస్‌స్టేషన్‌లో ఈ స్థాయి కాకపోయినా సాధారణ రద్దీ నెలకొంది. షెడ్యూల్ బస్సులన్నీ కిటకిటలాడాయి.



ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ప్రయాణికుల సందడి

యోగి వేమన రచనలు నైతిక విలువలకు పునాదులు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ


వేమన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానవంతమైన సమాజం కోసం ప్రతి వ్యక్తి ఆచరించాల్సిన నైతిక విలువలను వెయ్యేళ్ల క్రితమే ప్రజాకవి వేమన తన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి వ్యక్తి ఎలా జీవించాలి అనే అంశాలపై ఎన్నో వచన కవిత్వాలు, పద్యాలు వేమన రచించారన్నారు. తెలుగు గడ్డపై ఎంతోమంది కవులకు వేమన మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఒక కవి అంతిమ లక్ష్యం సమసమాజ స్థాపనే అన్న అంశాన్ని 1000 సంవత్సరాల క్రితమే ఆయన ప్రబోధించారన్నారు. నేటి తరం కవులు, రచయితలు కూడా యోగి వేమన ఆశించిన జ్ఞానవంతమైన సమాజ స్థాపన లక్ష్యంగా రచనలు చేయాలని సూచించారు. ప్రధానంగా నేటితరం విద్యార్థులు యోగి వేమన రచించిన వేల పద్యాలను కంఠస్థం చేయడం ద్వారా తెలుగు భాషపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


వేమన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు

సంఘ సంస్కర్త యోగి వేమన

» సీపీ రాజశేఖర్ బాబు

గుణదల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా కవి, సంఘ సంస్కర్తగా యోగి వేమన దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తెలిపారు. యోగి వేమన జయంతి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు సాహితి, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడని కొనియాడారు. అటువంటి మహనీయుడి జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించుకోవడం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. వేమన ఆవిష్కరించిన నైతిక విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ట్రైనీ ఐపీఎస్ మనీషా, సీపీవో అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

అమిత్‌షా రాజీనామా చేయాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ధర్నాచౌక్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యానించిన కేంద్రమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని లేదా బర్తరఫ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, అంబేడ్కర్‌ను గౌరవించుకుంటూ ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను సీఎం, చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్ ఖండించకపోవడాన్ని తప్పుబట్టారు. బీజేపీ నాయకులకు రాజ్యాంగంపై, అంబేడ్కర్‌ను పదేపదే కించపరచేలా మాట్లాడటం దారుణమన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ఆపార్టీ నేత ప్రకటించారని గుర్తుచేశారు. అమిత్‌షా రాజీనామా చేసేంత వరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు. సీపీఎం రాష్ట్రదర్శివర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, బీజేపీ నేతలకు మనువాదం తలకెక్కిందని విమర్శించారు. సీపీఐ (ఎంఎల్) నేతలు డి.హరినాథ్, పోలారి, ఎంసీపీఐయూ నేత ఖాదర్ బాషా, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పలు వామపక్షాలు, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

22న బాస్కెట్‌బాల్ ఎంపికలు

లబ్బీపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న అండర్-23 బాయ్స్ అండ్ గర్ల్స్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్‌సీ బోస్ తెలిపారు. ఆంధ్ర లయోలా కళాశాలలో 22న మధ్యాహ్నం 3గంటలకు ఈ ఎంపికలు ప్రారంభమవుతాయని, ఎంపికైన జట్లు ఈ నెల 28 నుంచి 31 వరకు విజయవాడలో జరిగే మొదటి ఆంధ్రప్రదేశ్ అండర్-23 ఇంటర్ డిస్ట్రిక్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డ్ జిరాక్స్, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు.

ఘనంగా పంచరత్న గోష్టిగానం

సంప్రదాయ దుస్తుల్లో కర్ణాటక సంగీత విద్వాంసులు

» 300 మంది బృందగానం

» ముగిసిన ఆరాధన సంగీతోత్సవాలు




సత్యనారాయణపురం ఘంటసాల సంగీత కళాశాలలో 300 మందికి పైగా కళాకారుల త్యాగరాజ స్వరాభిషేకం

విజయవాడ కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : ఎందరో మహానుభావులు అందరికీ వందనము.. చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమనుభవించు వారెందరో మహానుభావులు.. అంటూ సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి పంచరత్న కృతుల గోష్టి గానంలో శ్రోతలను పరమానంద భరితులను చేశారు. సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీత సన్మండలి నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి ఉత్సవాల్లో ఆదివారం ఘనరాగ పంచరత్న కృతుల గోష్టి గానం నిర్వహించారు. 300 మందికి పైగా కళాకారులు పాల్గొని త్యాగరాజస్వామికి స్వరాభిషేకం నిర్వహించారు. ఆ తీయని మధుర గాత్రాలతో సంగీత ప్రియులను అమృత రసరాగ ప్రవాహంలో మునకలు వేయించారు. తొలుత నట రాగం ఆదితాళంలో 'జగదానందకారక జయ జానకీ ప్రాణ నాయకా..' అంటూ పంచరత్నాల్లో తొలి కృతిని పాడి జనరంజకం చేశారు. తదుపరి గౌళ రాగం ఆదితాళంలో 'దుడుకు గల నన్నే దొర కొడుకు బ్రోచురా ఎంతో కడు దుర్విషయాకృష్టుడై గడియ గడియకు నిండాయి..' అంటూ రెండో కృతిని పాడి ఆహూతులను అలరించారు. ఆరభి రాగం ఆదితాళంలో 'సాధించెనే ఓ మనసా.. బోధించిన సన్మార్గ వచనముల..' అంటూ ప్రారంభించి 'సమయానికి తగు మాటలాడెనే దేవకి వసుదేవుల నేగించినటు..' అనుపల్లవితో ఈ కృతి గానం మరింత సుందర సుధా రసాలను ఒలికించింది. వరాళి రాగం ఆదితాళంలో 'కనక రుచిర కనకవసన.. నిన్ను దిన దినమున మనసున..' కృతిని పాడి సంగీత విద్వాంసుల బృందం కరతాళధ్వనులు అందుకుంది. చివరిగా ఎందరో మహానుభావులు కీర్తన గానంచేసి భక్తిమార్గంలో ఉన్న మహానుభావుల వైశిష్ట్యాన్ని గుర్తుచేశారు. ప్రారంభం నుంచి చివరివరకూ అంచెలంచెలుగా తారస్థాయినందుకున్న ఈ కీర్తనల గానం సాహిత్యసొగసుతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. కార్యక్రమాన్ని ఆకాశవాణి లైవ్ ప్రసారం చేయగా ప్రతినిధులు పాల్గొన్నారు. అధ్యక్షులు మోదుమూడి సుధాకర్ పర్యవేక్షించారు.

గన్నవరంలో అమిత్‌షాకు వీడ్కోలు


గన్నవరం విమానాశ్రయం వద్ద కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వీడ్కోలు పలుకుతున్న సీఎం చంద్రబాబు తదితరులు

గన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం కొండపావులూరులోని ఎన్ఐడీఎం, ఎన్డీఆర్ఎఫ్ సంస్థలను ప్రారంభించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి రోడ్డు మార్గాన ఆదివారం మధ్యాహ్నం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు ఘన వీడ్కోలు లభించింది. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, బండి సంజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరీ, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కనకమేడల రవీంద్రకుమార్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, కాగిత కృష్ణ ప్రసాద్, అరిమిల్లి రాధాకృష్ణ, బత్తుల బలరామకృష్ణ, ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, స్వచ్ఛాంధ్ర మిషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, కలెక్టర్ డీకే బాలాజీ, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్, ఎస్పీ గంగాధరరావు, నెట్టెం రఘురాం తదితరులు సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో అమిత్‌షా ఢిల్లీ వెళ్లారు.

వికసిత్ పంచాయత్ లక్ష్యంగా గ్రామాభివృద్ధి

» ఎంపీ కేశినేని శివనాథ్


కలెక్టర్ లక్ష్మీశతో సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

భారతీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పార్లమెంట్ పరిధిలోని 295 గ్రామాలను అభివృద్ధిచేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)అన్నారు. భారతీనగర్‌లోని ఓ హోటల్‌లో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సమక్షంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ (ఎన్.ఐ.ఆర్.డి) ప్రతినిధులు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశతో ప్రత్యేక సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలను వికసిత్‌పంచాయత్ దిశగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను ఎన్.ఐ.ఆర్.డి ప్రతినిధులు, కలెక్టర్ లక్ష్మీశలకు వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న 295 గ్రామాలను రెండున్నర సంవత్సరాల్లోగా సమగ్ర అభివృద్ధి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపీ కోరారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి కోసం చేపట్టబోయే కార్యక్రమాలకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఎన్.ఐ.ఆర్.డి ప్రతినిధులు మాట్లాడుతూ, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ముందుగా ఈ పైలట్ ప్రాజెక్ట్ చేయపడతామన్నారు. నియోజకవర్గానికి ఆరుగ్రామాలు ఎంపిక చేసి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగు నియోజకవర్గాలకు కలిపి 32 మంది సిబ్బందికి హైదరాబాద్‌లో 15రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ఎన్.ఐ.ఆర్.డి మద్దతుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డి సీనియర్ కన్సల్టెంట్ మహ్మద్‌ఖాన్, అసోసియేట్ ప్రొఫెసర్ అంజన్‌కుమార్ బాంజా, ఎన్ఐఆర్‌డి అధికారులు దిలిప్‌కుమార్ పాల్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లికి లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం

చల్లపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దకాలంగా చల్లపల్లిలో జరుగుతున్న స్వచ్ఛ చల్లపల్లి సేవా ఉద్యమానికి లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారం లభించింది. విశాఖపట్నంలో లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పుణ్యతిథి, ఏఎన్నార్ శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా వివిధ రంగాల్లో ప్రముఖులకు పురస్కారాలను అందజేసి సత్కరించారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంతో దేశానికే స్ఫూర్తిగా నిలిచిన వైద్య దంపతులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతిలను ఫౌండేషన్ పురస్కారానికి ఎంపికచేశారు. అనివార్యకారణాలవల్ల వారు వెళ్లలేకపోవటంతో స్వచ్ఛ చల్లపల్లి ప్రతినిధిగా విశ్రాంత ఉపాధ్యాయులు, స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి ఉదయ శంకర శాస్త్రి పురస్కారాన్ని స్వీకరించారు. త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, ప్రముఖ సినీనటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఫౌండేషన్ నిర్వాహకులు, మాజీ రాజ్యసభ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పురస్కారం, లక్ష రూపాయల నగదు అందజేశారు.


స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి శాస్త్రికి లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాన్ని అందజేస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, సినీనటులు బ్రహ్మానందం, గంటా శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు

జగన్ ప్రభుత్వంలో తీవ్రంగా వేధించారు

» మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆవేదన

విజయవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జగన్ ప్రభుత్వంలో తనను తీవ్రంగా వేధింపులకు గురిచేశారని.. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన మర్నాడే ఉద్యోగం లేకుండా చేశాడని మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కమ్మ వ్యతిరేక పాలసీని తీసుకొచ్చి 2004 నుంచి అమలు చేశారన్నారు. నాడు వైఎస్ నాటిన విత్తనం నేడు విషవృక్షంగా మారింది' అని ఆరోపించారు. విజయవాడలో ఆదివారం కొసరాజు వారి ఆత్మీయ కలయిక సమావేశంలో ఆయన మాట్లాడారు. తన 30 ఏళ్ల సర్వీసులో 10-15 ఏళ్లు మాత్రమే సక్రమమైన పోస్టింగ్‌లు చేశానన్నారు. రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చి కమ్మ వ్యతిరేక పాలసీని స్టేట్ పాలసీగా మార్చారని ఆరోపించారు. దానిని జగన్ ప్రభుత్వంలో తీవ్రం చేశారని ధ్వజమెత్తారు. 2019లో అధికారంలోకి వచ్చిన మర్నాడే ఉద్యోగం లేకుండా చేశాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టింగ్, జీతం అడిగితే సస్పెండ్ చేశారన్నారు. కెరీర్‌లో ఊహించని మచ్చ వేయాలని చూశారన్నారు. చట్టం, న్యాయం రెండు తనను నిప్పుగా నిలబెట్టాయన్నారు. వరదలు, వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇచ్చిన విరాళాల్లో 75 శాతం కమ్మవారివేనని చెప్పారు. సామాజికవర్గంతో పాటు సమాజానికి సైతం అందరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ సీవీసీ కొసరాజు వీరయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.


బోర్ల వద్ద వైర్లను కోసివేయడాన్ని చూపిస్తున్న రైతులు

వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ చోరీ

» 25 బోర్ల వద్ద కోసివేసిన కేబుళ్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని వ్యవసాయ బోరు మోటార్ల వద్ద కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. కోడూరుపాడు, ఉమామహేశ్వరపురం గ్రామాల్లోని 25 వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను శనివారం రాత్రి చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. పంటకు నీళ్లు పెట్టేందుకు ఆదివారం ఉదయం మోటార్లు ఆన్ చేయడానికి వెళ్లిన రైతులకు కేబుల్‌వైర్లు కత్తిరించినట్లు గమనించారు. కేబుల్‌వైర్లలో ఉండే రాగితీగల కోసం దుండగులు చోరీకి పాల్పడి ఉండవచ్చని రైతులు తెలిపారు. ఆళ్ల బాలకృష్ణకు చెందిన 3బోర్ల వద్ద, ఆవాలు జోజికి చెందిన బోరు వద్ద, నూకల మహేష్‌కు చెందిన 2బోర్ల వద్ద, నువ్వుల శ్రీనివాసరావుకు చెందిన 3బోర్ల వద్దనే కాకుండా చుట్టుపక్కల సుమారు 18బోర్ల వద్ద వైర్లను కత్తిరించారని వివరించారు. చోరీ చేసిన కేబుళ్ల విలువ సుమారు 3లక్షల వరకూ ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు వైర్ల దొంగలను పట్టుకుని తమకు రక్షణ కల్పించాలని వీరవల్లి పోలీసులకు రైతులు ఫిర్యాదు చేశారు. పంటకు నీరందించే సమయంలో కేబుళ్లను కోసివేయడంతో తడి అందక దిగుబడి తగ్గుతుందని, కేబుళ్ల చోరీతో రెండువైపులా నష్టపోతున్నామని రైతులు వాపోయారు.


నిందితుడు, మత్తు మందుకు వినియోగించే ముడి పదార్థాలతో ఎక్సైజ్ పోలీసులు

నిందితుల అరెస్టు

» 73 కిలోల ముడిపదార్థాలు స్వాధీనం

విస్సన్నపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సంచలనం రేపిన మత్తు మందుల తయారీకి వినియోగించే ముడిపదార్థాలు కలిగి ఉన్న కేసులో నిందితుడు భీమిరెడ్డి వెంకట రెడ్డిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం కలగర రామచంద్రాపురంలో అరెస్టు చేశారు. ముడిపదార్థాల తయారీకి వినియోగించే మిషన్‌తో పాటు 73 కిలోల ముడిపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నట్టు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్ దేవ్‌శర్మ ఆదేశాల మేరకు సీఐ కె.విద్యాసుధాకర్ అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితుడి వద్ద లభించిన రా మెటీరియల్ నార్కొటిక్ డ్రగ్స్‌కు సంబంధించినదిగా ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలకు సహకరించాలి

» పాస్మ రాష్ట్ర కమిటీ నేతలు

ధర్నాచౌక్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ సెక్యూరిటీ మెంబర్స్ అసోసియేషన్ (పాస్మ) రాష్ట్ర అధ్యక్షుడిగా బొందలపాటి వెంకట్రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజులపాటి నాగేంద్రరావు, వైస్ ప్రెసిడెంట్‌గా కె.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. నగర ప్రధానకార్యదర్శిగా బూరగడ్డ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ మేకల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.బ్రహ్మయ్యలు ఎన్నికయ్యారు. రాష్ట్రంలో అర్హత కలిగిన సెక్యూరిటీ ఏజెన్సీలకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవకాశాలు కల్పించాలని నూతన కార్యవర్గం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి ఏజెన్సీలకు అన్ని రకాల సహకారం అందించాలన్నారు.

అభివృద్ధి పండగ

(5వ పేజీ తరువాయి)

బ్యాటరీ వాహనంపై ఎన్‌డీఆర్ఎఫ్ ప్రాంగణం, భవనాలను వీక్షించారు.

రెస్క్యూ ఆపరేషన్‌పై మాక్ డ్రిల్

బహుళ అంతస్తుల భవనాలలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలు ఎలా రెస్క్యూ చేస్తాయన్న దానిపై ప్రాంగణంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. బాధితులను బయటకు తీసుకువచ్చే విన్యాసాలను ప్రదర్శించారు. ఈ విన్యాసాలను అమిత్‌షా, చంద్రబాబు ఆసాంతం వీక్షించారు.

విపత్తుల నివారణకు ఉపయోగించే పరికరాల ప్రదర్శన

విపత్తులను నివారించటానికి ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలు ఉపయోగించే పనిముట్లను కూడా ఈ సందర్భంగా ప్రదర్శనకు పెట్టారు. ఆయా పరికరాల గురించి వాటి వినియోగం గురించి ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు వివరించారు.

ఎన్‌డీఆర్ఎఫ్ ప్రాంగణంలో మొక్కలు నాటిన అతిథులు

ఎన్‌డీఆర్ఎఫ్ ప్రాంగణంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు బండి సంజయ్, రామ్మోహన్‌నాయుడు తలా ఒక మొక్క నాటి నీరు పోశారు.

దుర్గమ్మ సేవలో బండి సంజయ్



వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వారికి ఈఈ వైకుంఠరావు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం.. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు.





ఇక వెళ్లొస్తాం..!

సంక్రాంతి పండుగ ముగిసింది.. పండుగ సెలవుల్లో పిల్లాపాపలతో సొంతూళ్లలో సరదాగా గడిపిన ప్రజలు కుటుంబసమేతంగా తమ గమ్యస్థానాలకు తిరుగుప్రయాణమయ్యారు.. నగరంలోని ప్రధాన వీధులు వాహనాలతో నిండిపోయాయి. పండిట్ నెహ్రూ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. కొందరు బైక్‌ల పైనే తమ ప్రయాణాన్ని కొనసాగించారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)





సంక్రాంతికి వస్తున్నాం.. విజయోత్సవ వేడుక

ధర్నాచౌక్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన విక్టరీ వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం విజయోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విక్టరీ రానా యూత్ అధ్యక్షుడు పోతిన వెంకటేష్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని అలంకార్ థియేటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. థియేటర్ అధినేత కాకుమాను ప్రసాద్, పోతిన మహేష్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ హీరో వెంకటేష్ ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు తన సినిమాతో ప్రేక్షకులను అలరిస్తున్నారని కొనియాడారు. నమ్మి సాయి, పోతిన సాయి, జానీ, విజయ్, రాజగిరి గోపి, నాగోతి వాసు, పోతిన యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ అంతర్గత రోడ్లో వృథాగా పోతున్న మున్సిపల్ వాటర్

పనుల ఆలస్యం.. వృథాగా జలం

భారతీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పనుల ఆలస్యం కావడంతో జలం వృథాగా పోతున్నాయని గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పెద్దలు వాపోతున్నారు. 4వ డివిజన్ పరిధిలోని గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ అంతర్గత రోడ్లో ఉన్న మున్సిపల్ వాటర్ పైపు ఇటీవల లీకేజ్ (ధ్వంసం) అయింది. పైపు మరమ్మతుల కోసం వీఎంసీ సిబ్బంది గొయ్యి తవ్వి పనులు ప్రారంభించారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాటర్ వదిలిన ప్రతిసారి ఆ లీకేజీ నుంచి మున్సిపల్ వాటర్ వృథాగా పోతుంది. వీటి పనులు పూర్తి చేయడంలో ఆలస్యం జరగడంతో రోడ్డు మార్జిన్‌లోని గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్లో ప్రయాణించడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని స్థానిక పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలుతీసుకోవాలని వారు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన గొయ్యి

డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం



వాటర్ ట్యాంక్ సమీపంలో ఖాళీస్థలంలో పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలు

భారతీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన నాగార్జున నగర్ కాలనీ పరిస్థితి ఉంది. తూర్పు నియోజకవర్గంలోని 3వ డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీ ఉంది. డివిజన్‌లోని ప్రధాన కాలనీలో నాగార్జున నగర్ కాలనీ ఒకటి. కొంతకాలంగా ఇక్కడ ప్రధాన సమస్యలపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో సమస్యలకు నిలయంగా మారింది. ప్రధాన, అంతర్గత రోడ్లో పూడికతో నిండిన డ్రైనేజీ వ్యవస్థ, ఖాళీస్థలాలో పేరుకుపోతున్న చెత్త, ఇతర వ్యర్థాలు, గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు, దుర్వాసన వెదజల్లుతున్న ప్రధాన డ్రైనేజీలు కాలనీ ప్రజలను పట్టిపీడిస్తున్నాయి.

ప్రమాదకరంగా మారిన ఖాళీ స్థలాలు

ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు, మురుగు నీరు చేరడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. నివాసాల మధ్య నున్న ఖాళీస్థలాల గురించి స్థల యజమానులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు తమ నివాసాల్లోని చెత్త, ఇతర వ్యర్థాలను పడేయడంతో మినీ డంపింగ్ యార్డులా మారింది.



కాలనీ సర్వీస్ రోడ్డులో ప్రధాన డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు



ఆయుష్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు సైడ్ కాలువల్లో పెరిగిన పచ్చగడ్డి

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

కొంతకాలంగా కాలనీలోని ప్రధాన, సైడ్ డ్రైనేజీ వ్యవస్థపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో కాలువలన్నీ పూడికతో నిండిపోయి ప్రధాన డ్రైనేజీల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుని మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తున్నాయి. డ్రైయినేజీలు పనిచేయకపోవడంతోపాటు, రోడ్డు పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షం పడిన రోడ్డు నీటితో మునిగిపోతుంది. ఆ మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో బయటికి రాలేకపోతున్నామంటే స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



పడవలరేవు వంతెనపై వ్యాపారం చేస్తున్న పండ్ల వ్యాపారులు

పాదచారులకు చోటేది..?

పటమట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరనగర్ నుంచి పటమట సెంటర్ బెంజ్‌సర్కిల్ వైపు వచ్చేవారికి పడవల రేవు వంతెన ప్రధానమైనది. ప్రతి రోజు కొన్ని వేలమంది ద్విచక్రవాహనాలపై, కార్లలో ఈమార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ వంతెనపై ఫుట్‌పాత్ మీద నడిచే వీల్లేకుండా పండ్లు, కూరగాయల వ్యాపారులు నిరాటంకంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. పాదచారులకు నడిచే దారి లేక వంతెనపై నడవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆదివారం పటమట లంక చేపల మార్కెట్ వచ్చే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను వంతెనపై నిలిపేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌పై వ్యాపారులను వేరే ప్రాంతానికి తరలించి ట్రాఫిక్ కష్టాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



వంతెన మధ్యలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు



1998-99 టెన్త్ బ్యాచ్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పటమట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 25 ఏళ్ల క్రితం 1998-99 టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆత్మీయంగా కలుసుకున్నారు. తమతో చదివిన స్నేహితులంతా ఒకేచోట కలుసుకోవడంతో సంతోషంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. వారి మధ్య మిగిలిపోయిన తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బషీర్, కమిటీ సభ్యులు నాగార్జున, ఛాముండేశ్వరి, గోపాల కృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కేంద్రం ప్రోత్సాహం పెంపు అభినందనీయం

పటమట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులను ప్రాణాపాయ స్థితి నుంచి సాధ్యమైనంత వరకు రక్షించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గోల్డెన్ అవర్‌ను ప్రాణానికంగా తీసుకుందని యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్ అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ గోల్డెన్ అవర్ అంటే ప్రమాదం జరిగిన గంటలోపే క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే వ్యక్తులకు ఇప్పటి వరకు రూ.5వేలున్న ప్రోత్సాహాన్ని రూ.25వేలకు పెంచడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ రోజుల్లో రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులు చుట్టూ చేరి కనికరం లేకుండా పైశాచికంగా సెల్‌ఫోన్స్‌లో వీడియోలు తీస్తూ గాయపడిన వారిని సమయానికి ఆసుపత్రికి తీసుకుపోకుండా కాలయాపన చేస్తున్నారని, మరి కొంతమంది కేసులవుతాయనే భయంతో నిర్లక్ష్యంగా ఉండటంతో అనేక మంది ప్రాణాలు పోతున్నాయన్నారు.

దంత సంరక్షణపై ఆరోగ్య సదస్సు

పటమట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): షుగర్, రక్తపోటున్నవారు తమ దంతాలు, చిగుళ్లపై దృష్టి సారించాలని లేకుంటే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రముఖ దంత వైద్యురాలు హిమజ అన్నారు. వాసవ్య నర్సింగ్ హోంలో డాక్టర్ సమరం అధ్యక్షతన దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. షుగర్ ఉన్నవారికి చిగుళ్ల వాపు సహజమని, నోటి దుర్వాసనతో ఇతరులతో మాట్లాడేందుకు ఇబ్బందులు పడతారన్నారు. ఈ సమస్యలతో పాటు నోటి, గొంతు సమస్యలు తలెత్తుతాయన్నారు. ఫ్లోరైడ్ ఉన్న టూత్ పేస్ట్‌ను వాడటం, సరైన పద్ధతిలో దంతధావనం చేయడం, నాలుకను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

అమిత్ షాకు నేతల ఘన స్వాగతం

భారతీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యటనలో భాగంగా విజయవాడ నగరానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు భారతీనగర్ కాలనీలోని నోవాటెల్‌లో బస ఏర్పాటు చేశారు. ఆదివారం కొండపావులూరులో జాతీయ విపత్తు సంస్థ ప్రారంభోత్సవానికి వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు భారతీనగర్ కాలనీలో నోవాటెల్ వద్ద కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్వాగతం పలికారు. వీరితో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, కాకినాడ ఎంపీ తంగేళ్ల శ్రీనివాస్, వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సీహెచ్ ఆదినారాయణ రెడ్డి, ఏపీ బీజేపీ మీడియా సెల్ కన్వీనర్ పాతూరి నాగభూషణం, పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.



మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రమేష్ మృతి పార్టీకి తీరనిలోటు: గద్దె

రామలింగేశ్వరనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. టీడీపీ నేత గోగుల రమేష్ శనివారం మృతి చెందగా కళానగర్‌లోని ఇంటి వద్ద ఉన్న రమేష్ మృతదేహాన్ని గద్దె రామ్మోహన్ ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రమేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణలంక ప్రాంతంలో పార్టీకి, నేతలకు, కార్యకర్తలకు రమేష్ ఎప్పుడూ అండగా ఉంటూ చురుకైన పాత్ర పోషించాడని, ఆయన మరణం తీరనిలోటన్నారు, అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. పార్టీ నేతలు వంగవీటి రాధా, బొప్పన భవకుమార్ పాటు, తూర్పు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కిర తిరుపతయ్య, జనసేన నేతలు అమ్మిశెట్టి వాసు, టీడీపీ నేతలు రాయి రంగమ్మ, దుర్గారావు, కొప్పోలు శ్రీనివాస చౌదరి, వైసీపీ నేతలు ఆళ్ల చల్లారావు, దామోదర్ నివాళులర్పించారు.

టమాటా కొంటేనే మిర్చి

- రైతు బజారులో దుకాణదారుడి డిమాండ్‌తో విస్తుపోయిన వినియోగదారుడు
- ఫిర్యాదు చేద్దామంటే అందుబాటులో ఉండని అధికారి



సత్యనారాయణపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రైతుబజార్‌లో కూరగాయలు కొందామని వెళ్లిన వినియోగదారుడికి కురగాయల విక్రేతల మాటకు దిమ్మదిరిగింది. టమాటా కొంటేనే ...పచ్చిమిర్చి ఇస్తానని చెప్పడంతో ఖంగుతిన్నాడు. లేకపోతే 100గ్రాముల పచ్చిమిర్చి మాత్రమే అమ్ముతానని అంతకు మించి ఇవ్వనని సమాదానానికి ప్రశ్నించిన వినియోగదారుడికి.. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని అనడంతో ఫిర్యాదు చేద్దామని ఆఫీసుకు వెళితే అక్కడ ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. చేసేది లేక కిలో పచ్చిమిర్చికి కోసం కిలో టమాట కొనుగోలు చేయాల్సి వచ్చిందని వినియోగదారుడు తెలిపారు.

మాచవరం డౌన్‌లో ఉంటున్న సూర్యదేవర జగన్నాథరావు ఆదివారం గాంధీనగర్ సాంబమూర్తి రోడ్డులోని రైతు బజారుకు వెళ్లాడు. కిలో పచ్చిమిర్చి కావాలని అడిగాడు. స్టాల్‌లో ఉన్న మహిళ కిలో ఇవ్వడం కుదరదు 100గ్రాములు ఇస్తానడంతో అదేంటని ప్రశ్నించాడు. కేజీ టమాట కొనుగోలు చేస్తేనే కేజీ పచ్చిమిర్చి ఇస్తాననడంతో నాకు టమాట అవసరం లేదన్నాడు. టమాటాలు ఎక్కువ వచ్చాయి. అమ్ముడు అవ్వడం లేదని ఈ విధంగా పెట్టామని చెప్పింది. దీనికి ఎస్టేట్ ఆఫీసర్ అనుమతి ఇచ్చార అని అడిగితే, అవన్నీ నీకేందుకు తీసుకుంటే తీసుకో లేకపోతే వెళ్లిపో అన్నారు. ఈ విషయమై ఎస్టేట్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తానంటే నీఇష్టం వచ్చిన వాళ్లకి చెప్పుకోమని అనడంతో ఆయన ఫిర్యాదు చేద్దామని వెళితే అక్కడ ఎస్టేట్ ఆఫీసర్ కనిపించలేదు. ఆఫీసులో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో చేసేదిలేక కిలో పచ్చిమిర్చి కోసం అవసరం లేక పోయిన కిలో టమాటాను కొనుగోలు చేయాల్సి వచ్చిందిన్నారు.

జరిగిన సంఘటనను ఆంధ్రజ్యోతి ప్రతినిధి దృష్టికి వినియోగదారుడు తీసుకెళ్లాడు. రైతు బజారుల్లో అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తనకు జరిగనట్లు కాకుండా ఇతరులకు ఎవరికి ఇటువంటివి జరగకుండా ఉండాలనే ఈ విషయాని మీ దృష్టికి తీసుకువస్తున్నట్టు తెలిపాడు.



దిక్సూచి DIKSUCHI

ఇంటర్ ప్రాక్టికల్స్ ఇలా చేస్తే ఫుల్ మార్కులు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య దాదాపు ఇరవై లక్షలకు దగ్గరగా ఉంటుంది. దీనిలో సగం అంటే పది లక్షల వరకు ఇంటర్ రెండో సంవత్సరంలో ఉంటారు. ఇందులో అరవై, డెబ్బయి శాతం మంది ఎంపీసీ, బైపీసీ వారే.

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన జేఈఈ, నీట్, బిట్‌శాట్‌లలో ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేకపోయినా, టీఎస్, ఏపీ ఎప్‌సెట్‌లలో ఎంపీసీ, బైపీసీ సబ్జెక్టులకు 25 శాతం మెయిటేజీ ఉంటుంది. దీని కారణంగా ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌కి ప్రాధాన్యం పెరిగింది. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో 30 మార్కుల చొప్పున మొత్తం ప్రాక్టికల్స్‌కి 60 మార్కులు కేటాయించారు. బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున మొత్తం 120 మార్కులు కేటాయించడం జరిగింది.

- జాతీయస్థాయి పోటీ పరీక్షలపై దృష్టిపెట్టిన కొన్ని కాలేజీలు విద్యార్థులకు ప్రాక్టికల్స్ సరిగ్గా చేయించకుండా కేవలం పరీక్షలకు ముందు తూతూ మంత్రంలాగే నడిపించి పంపుతున్నారనే వార్తలు రావడంతో ఇంటర్మీడియెట్ బోర్డు ఈ ల్యాబ్ పరీక్షలను కూడా సీరియస్‌గా నిర్వహించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగానే సీసీటీవీల ఏర్పాటు, కచ్చితమైన అటెండెన్స్, ప్రశ్నపత్రం లీక్ కాకుండా జాగ్రత్తలతోపాటు, రికార్డు పుస్తకాలను సరిగ్గా వాల్యుయేట్ చేయించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.
- అయితే ల్యాబ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల కేవలం మార్కుల కోసమే కాకుండా కొంత సబ్జెక్టు నాలెడ్జ్ పెంచుకుంటే జేఈఈ, నీట్ పరీక్షల్లో కూడా ఉపయోగపడుతుంది. విద్యార్థులు ఈ కింది అంశాలపై దృష్టిపెడితే ప్రాక్టికల్స్‌లో పూర్తి స్థాయి మార్కులు సాధించవచ్చు.

1. **ప్రాక్టికల్ రికార్డ్ బుక్స్:** సిలబస్‌లో ఉన్న అన్ని ప్రయోగాలు, వాటి అబ్జర్వేషన్స్/ రిజల్ట్స్‌ను జాగ్రత్తగా రాయాలి. అయితే కొంతమంది విద్యార్థులు రికార్డు ఇంకొకరితో రాయిస్తారు. దీనివల్ల సబ్జెక్టు నాలెడ్జ్ పెరగకపోవడంతో, పరీక్షలో ఎగ్జామినర్ అడిగే ప్రశ్నలకు మార్క్స్‌పోగొట్టుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి రికార్డులు సొంతంగా రాయడం ఉత్తమం.
2. **ప్రయోగాల సూత్రాలు:** ఎక్విప్‌మెంట్స్ లేదా ఇన్‌స్ట్రుమెంట్స్‌తో ప్రాక్టికల్స్ చేస్తున్నప్పుడు ఆ ప్రయోగం వెనక ఉన్న ఫండమెంటల్స్‌ను, ఇన్‌స్ట్రుమెంట్స్‌ని, వాటి ఉపయోగాలను అర్థం చేసుకోవాలి. పక్కన ప్రయోగం చేస్తున్న విద్యార్థులను అనుకరించవద్దు.
3. **గ్రాఫ్ డ్రాయింగ్:** ఇది అతి ముఖ్యమైన అంశం. మీ ల్యాబ్ సిలబస్‌లో గ్రాఫ్స్ ఉన్నట్లయితే రికార్డ్ బుక్స్‌లో వాటిని జాగ్రత్తగా పొందుపర్చడంతో పాటు ఎగ్జామ్‌లో గీయాల్సి వస్తే, దానికి సంబంధించిన డేటాని సరిగ్గా విశ్లేషించాలి.
4. **డయాగ్రామ్స్:** బోటనీ, జువాలజీ ప్రయోగాలకు అవసరమైన డయాగ్రామ్స్‌ని కచ్చితంగా గీయడం నేర్చుకోవాలి. అంతే కాకుండా వాటి లేబులింగ్ స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి.
5. **సేఫ్టీ:** మీ కాలేజీలో లాబ్స్ చేస్తున్నప్పుడు, పరీక్షలో కూడా కెమికల్స్, ఎలక్ట్రిసిటీకి సంబంధించిన ఇన్‌స్ట్రుమెంట్స్‌ని జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలి. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే అక్కడ ఉన్న ఇన్‌స్ట్రక్టర్‌కి తెలపాలి.
6. **మాల్‌ఫంక్షనింగ్:** పరీక్షలో ఏదైనా కారణంగాఒక ఇన్‌స్ట్రుమెంట్ సరిగ్గా పనిచేయకపోతే వెం టనే ఎగ్జామినర్‌కి తెలిపి దానిని రిపేర్ చేయించుకోవడమో లేదా ఇన్‌స్ట్రుమెంట్ మార్చుకోవడమో చేయాలి.



7. **నమూనా పరీక్షలు - ముఖ్యమైన ప్రశ్నలు:** గత సంవత్సరాల ప్రశ్నలతో ఒక ఇంపార్టెంట్ క్వశ్చన్ బుక్‌లెట్ తయారు చేసుకోవాలి. పరీక్షకు ముందు ఈ ప్రశ్నలను తప్పకుండా రివిజన్ చేసుకోవాలి.
8. **వైవా - వాయిస్:** పరీక్ష రోజు ఎగ్జామ్ హాల్‌లో మీ ప్రవర్తన సరిగ్గా ఉండాలి. పక్కన విద్యార్థిని కాపీ చేయడం లేదా మెజర్‌మెంట్స్‌ని కాపీ చేయకూడదు. వైవాలో అడిగే ప్రశ్నలకు సరిగ్గా సమాధానం ఇవ్వాలి. ప్రశ్నలు ఎలా వస్తున్నాయనే విషయంలో మీ ముందు సెషన్‌లో పరీక్షకు వెళ్లిన విద్యార్థుల నుంచి కొంత ఫీడ్‌బాక్ తీసుకోవచ్చు, ఎలాంటి తొందరపాటు లేకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరైతే పూర్తి మార్కులు సాధించవచ్చు.

గుడ్‌లక్




డాక్టర్ పవన్‌కుమార్ కాసు, డైరెక్టర్
సంజీవని జూనియర్ కాలేజీ, హైదరాబాద్

SCHOLARSHIP ALERT

Kotak Suraksha

Description: Kotak Securities Limited (KSL) invites applications from students pursuing general/professional graduation.
Eligibility: Open to PwD applicants across India who are currently pursuing general or professional graduation courses. Applicants must have secured at least 55% marks in their previous academic year and their annual family income must not exceed INR 3,20,000.



Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year
Last Date to Apply: 28>01>2025
Application mode: Online only
Short **buddy4study.com**



హెచ్‌పీసీఎల్‌లో డిప్లొమా అభ్యర్థులకు..

జాబ్ కార్నర్

మొత్తం ఖాళీలు **234**

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా చేసిన ఆసక్తి గల అభ్యర్థులు 2025 ఫిబ్రవరి 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- **జూనియర్ ఎగ్జిక్యూటీవ్ (మెకానికల్):** 130 పోస్టులు
- **జూనియర్ ఎగ్జిక్యూటీవ్(ఎలక్ట్రికల్):** 65 పోస్టులు
- **జూనియర్ ఎగ్జిక్యూటీవ్(ఇన్‌స్ట్రుమెంటేషన్):** 37 పోస్టులు
- **జూనియర్ ఎగ్జిక్యూటీవ్(కెమికల్):** 2 పోస్టులు


అర్హత: పోస్టుకు సంబంధించిన బ్రాంచ్‌లో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా పూర్తి చేసి ఉండాలి.
వయస్సు: అభ్యర్థుల వయస్సు దరఖాస్తు దాఖలు చేసే తేదీ నాటికి 18-25 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ఉంటుంది.
దరఖాస్తు విధానం: 2025 ఫిబ్రవరి 14 తేదీలోపు దరఖాస్తు దాఖలు చేయాలి.
పూర్తి వివరాల కోసం www.hindustanpetroleum.comలోCareers?Current Openings వెబ్‌పేజీ చూడవచ్చు.

ఇండియన్ ఆర్మీలో క్రీడా కోటా

ఇండియన్ ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్(క్రీడా కోటా) ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు ఈ డైరెక్ట్ ఎంట్రీ ఉద్యోగాలకు 2025 ఫిబ్రవరి 28లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.
క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్, అర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, జూడో, కయాకింగ్ అండ్ కెనోయింగ్, కబడ్డీ, స్విమ్మింగ్, సెయిలింగ్, షైటింగ్, ట్రయాథ్లాన్, వాలీబాల్, వుషు, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, రోయింగ్.
అర్హత: పది/ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు, నిర్దుష్టమైన శారీరక ప్రమాణాలు ఉండాలి. అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్/ ఖేలో ఇండియా గేమ్స్/ యూత్ గేమ్స్/ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులై ఉండాలి.
వయస్సు: పదిహేడున్నర సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2000 మార్చి 31 నుంచి 2007 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టరేట్ ఆఫ్ పీజీ అండ్ స్పోర్ట్స్ జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెచ్ క్యూ(ఆర్మీ), రూమ్ నెం.747, 'ఏ' వింగ్, సేనా భవన్, న్యూఢిల్లీ చిరునామాకు పంపించాలి.
పూర్తి వివరాలకు https://joinindianarmy.nic.in/Authentication.aspx వెబ్‌సైట్ చూడవచ్చు.









మోకాళ్ల నొప్పులా?

సాధారణంగా మహిళలకు వయసు పెరిగేకొద్దీ మోకాళ్లలో మృదులాస్థి అరిగిపోతుంటుంది. దీనివల్ల మెట్లు ఎక్కేటపుడు, దిగేటపుడు, నడుస్తున్నపుడు మోకాళ్లలో విపరీతంగా నొప్పి వస్తుంది. తాజా కూరగాయలు, పండ్లు తీసుకుంటూ కొన్ని చిట్కాలు పాటిస్తే చాలా వరకు ఈ నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఆ చిట్కాల వివరాలు...

అల్లం నీళ్లు : స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు కప్పుల నీళ్లు పోసి బాగా మరిగించండి. దీనిలో ఒక చెంచా అల్లం తురుం, ఒక చెంచా పసుపు వేసి రెండు నిమిషాలు ఉడికిన తరవాత ఈ నీళ్లను వడకట్టి అందులో ఒక చెంచా తేనె కలిపి తాగండి. ఇలా రోజూ తాగితే మోకాళ్ల నొప్పి తగ్గుతుంది.

పసుపు పాలు : ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు, ఒక చెంచా తేనె కలుపుకుని తాగుతూ ఉంటే మోకాళ్ల నొప్పి, వాపు తగ్గుతాయి. పసుపులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, పాలలోని కాల్షియం కలిసి నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

దాల్చిన చెక్క టీ : స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి వేడిచేయండి. అందులో ఒక అంగుళం పొడవున్న దాల్చిన చెక్క లేదా అర చెంచా దాల్చిన చెక్క పొడి వేసి అయిదు నిమిషాలు ఉడకనివ్వండి. తరవాత ఈ నీటిని వడకట్టి అందులో ఒక చెంచా తేనె కలుపుకుని తాగండి. ఇలా రెండు రోజులకోసారి తాగుతూ ఉంటే మోకాళ్లలో గుజ్జు పెరిగి నొప్పి తగ్గుతుంది.

అరటిపండు : అరటిపండులో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, కాల్షియం, పొటాషియం, సోడియం, మెగ్నీషియం, పీండి పదార్థాలు ఉంటాయి. ఇవన్నీ కండరాలను బలోపేతం చేస్తాయి. ప్రతిరోజూ ఒక అరటి పండు తింటూ ఉంటే మోకాళ్లలోని కీళ్లు పెళుసుబారకుండా మృదువుగా కదులుతాయి. దీంతో వాపు, నొప్పి బాధించవు.

దానిమ్మ గింజలు : వీటిలో సి విటమిన్, పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి మోకాళ్లలో కీళ్ల చుట్టూ ఆవరించి ఉన్న గుజ్జును కాపాడతాయి. ప్రతిరోజూ గుప్పెడు దానిమ్మ గింజలు తింటూ ఉంటే మోకాళ్ల నొప్పులు రావు.

వాము : వాము వాత గుణాన్ని హరిస్తుంది. మోకాళ్లలో కదలికలను సులభతరం చేస్తుంది. ప్రతిరోజూ భోజనం తరవాత ఒక చెంచా వాము తింటూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

పోషకాహారం : నానబెట్టిన బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు గింజలను తరచూ తినాలి. పాలకూర, మెంతికూర, తోటకూరలను ఆహారంలో చేర్చుకుంటే మోకాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. చిక్కుళ్లు, గుడ్లు, చేపలు, పాల ఉత్పత్తులను తీసుకోవడం వల్ల మోకాళ్ల సమస్యలు రావు.

ఆమే అతడి ధైర్యం

దాదాపు పాతికేళ్ల క్రితమే తెర మీద నుంచి తప్పుకున్నా... భర్త అజిత్‌ను వెన్నంటి ప్రోత్సహించి... ఆయన విజయాలకు ప్రేరణనిస్తున్నారు షాలినీ. ఆడంబరాలకు దూరంగా ఉండే ఈ కోలీవుడ్ సెలబ్రిటీ జంట... దుబాయ్‌లో జరిగిన '24 హెచ్ కార్ రేసింగ్'లో సందడి చేసింది. షాలినీపై అజిత్ ప్రశంసలు, రేస్ అనంతరం ఆమెను హత్తుకున్న అతని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'సఖి'గా యువ హృదయాలను దోచిన షాలినీ ఇప్పుడు భర్త కెరీర్‌కు, అభిరుచులకు అండగా నిలుస్తున్నారు.



"షాలూ! నన్ను రేస్‌లో పాల్గొననిచ్చినందుకు ధన్యవాదాలు..." దుబాయ్‌లో ఈ నెల రెండో వారంలో జరిగిన '24 హెచ్ కార్ రేసింగ్'లో తమ జట్టు మూడో స్థానంలో నిలిచిన తరువాత... తమిళ్ స్టార్ హీరో అజిత్ వేదిక పైనుంచి చెప్పిన ఈ మాటలకు ఆ హాల్ అంతా కరతాళ ధ్వనులతో మార్మోగింది. ముందు వరుసలో నిలబడిన అజిత్ భార్య షాలినీ చిరునవ్వుతో ప్రతిస్పందించారు. అంతకుముందు రేస్ పూర్తయ్యాక... జనంలోకి వచ్చిన అజిత్... షాలినీని చుంబించిన దృశ్యం క్షణాల్లో సోషల్ మీడియా అంతటా వైరల్ అయింది. 24 గంటలసేపు కొనసాగే ఈ రేస్... ఇటు రేసర్ సహనానికీ, అటు వాహనం సామర్థ్యానికీ పెద్ద పరీక్ష. పదిహేనేళ్ల తరువాత రేస్ ట్రాక్ మీద సొంత టీమ్ తరపున దిగిన అజిత్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకొని మరీ... టాప్-3లో నిలిచారు. అజిత్ హీరో, రేసర్ మాత్రమే కాదు, ఎన్నో పోటీల్లో పతకాలు గెలుచుకున్న షూటర్ కూడా! బైక్ మీద దేశం చుట్టేస్తూ ఉంటారు. డ్రోన్ టెక్నాలజీ లాంటి అభిరుచులు చాలా ఉన్నాయి. ప్రాణాలకు తెగించే సాహసాలంటే అతనికి ప్రాణం. "యాభై మూడేళ్ల వయసులోనూ ఇవన్నీ చెయ్యగలుగుతున్నానంటే ఇల్లాలి ప్రోత్సాహమే కారణం. ఈ ఏడాది ఏప్రిల్‌కు పాతికేళ్లు నిండే మా వైవాహిక జీవితంలో... షాలినీ చేసిన త్యాగాలే ఎక్కువ. ఆమే నా ధైర్యం" అంటారు అజిత్.

మొదట్లో ఒప్పుకోలేదు...

షాలినీ... ఒకప్పుడు దక్షిణాదిలో, ప్రధానంగా తమిళంలో అగ్రశ్రేణి బాలతార. నాలుగేళ్ల వయసులోనే తెరంగేట్రం చేశారు. ఆమె తండ్రి దాస్‌కు సినిమాలంటే ఆసక్తి. నటుడు కావాలనుకున్న తన అభిరుచిని తన కుమార్తెలైన షాలినీ, షామిలీ, కుమారుడు రిచర్డ్ రిషి ద్వారా నెరవేర్చుకున్నారు. వారిలో తొలుత తెరంగేట్రం చేసిన షాలినీ.... తమిళ, కన్నడ, మలయాళ, హిందీ చిత్రాలతో పాటు 'బంధం', 'జైలుపక్షి', 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' తదితర తెలుగు చిత్రాల్లోనూ ఆకట్టుకున్నారు. ఆరేళ్ల విరామం తరువాత హీరోయిన్‌గా రీఎంట్రీ ఇచ్చారు. వరుసగా సినిమాలు చేస్తున్న సమయంలో... అజిత్ హీరోగా 'అమర్కాలం' చిత్రాన్ని తీయాలనుకున్న దర్శకుడు శరణ్... కథానాయిక పాత్ర కోసం షాలినీని సంప్రతించారు. కానీ ప్లస్-2 పరీక్షలకు సిద్ధం అవుతున్న షాలినీ ఆ ఆఫర్‌ను తిరస్కరించారు. ఆ పాత్రను షాలినీతోనే చేయించాలనుకున్న శరణ్... మూడు నెలలపాటు తీవ్రంగా ప్రయత్నించి మరీ ఆమెను ఒప్పించారు.

గాయంతో మొదలైన ప్రేమ

ఆ సినిమా సెట్‌లోనే అజిత్‌కు, షాలినీకి పరిచయమైంది. షూటింగ్‌లో అనుకోని సంఘటన జరిగింది. అది షాలినీని అజిత్ కత్తితో బెదిరించే సన్నివేశం. అజిత్ కత్తిని పొరపాటున విదిలించడంతో... షాలినీ చేతికి గాయమై, రక్తస్రావమైంది. అజిత్ వెంటనే షూటింగ్ ఆపించి... ఆమెకు ప్రథమ చికిత్స చేయించారు. ఆ తరువాత ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో అజిత్ చూపిన శ్రద్ధకు ఫిదా అయిపోయానంటారు షాలినీ. "నా కారణంగా షాలినీకి గాయం కాగానే నాకు



దిక్కు తోచలేదు. ఆమెకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిశాక నా మనసు కుదుటపడింది. నేను ఆమెను ప్రేమిస్తున్నాననే విషయం కూడా అప్పుడే నాకు అర్థమైంది" అంటారు అజిత్. షూటింగ్ విరామంలో ఒకరికొకరు రహస్యంగా కాల్స్ చేసుకొనేవారు. ఈ ఇద్దరి ప్రణయం గురించి తమిళ పత్రికలు అప్పట్లో విస్తృతంగా రాశాయి కూడా. ఇలా కొన్ని నెలల డేటింగ్ తరువాత... ఇరు కుటుంబాలనూ ఒప్పించి, పెళ్లి చేసుకున్నారు.

అది ఎంత కష్టమో తెలుసు...

మణిరత్నం దర్శకత్వంలో షాలినీ నటించిన 'అలై పాయుదే' (తెలుగులో 'సఖి') చిత్రం 2000 ఏప్రిల్ 14న విడుదలైంది. అదే నెల 24న అజిత్, షాలినీల వివాహం జరిగింది. అప్పటికే నటిస్తున్న మరో చిత్రాన్ని పూర్తి చేసిన షాలినీ ఇరవై రెండేళ్లకే నటనకు స్వస్తి చెప్పి, గృహిణిగా స్థిరపడిపోయారు. ఇరవై నాలుగేళ్లుగా మళ్ళీ తెరపై కనిపించలేదు. 'సఖి' చిత్రంతో ఆమె నటన సర్వత్రా ప్రశంసలందుకుంది. తమిళనాడు ప్రభుత్వం నుంచి ఉత్తమనటిగా ప్రత్యేక బహుమతి కూడా ఆమె అందుకున్నారు. ఈ క్రమంలో ఎన్నో ఆఫర్లు వచ్చినా ఆమె అంగీకరించలేదు. "ఎంతో మంది హీరోయిన్లు పెళ్లయ్యాక కూడా నటిస్తున్నారు. మీకు ఆ ఆలోచన రాలేదా? అనే ప్రశ్న నాకు చాలాసార్లు ఎదురయింది. నటించడం అంటే నాకు ఎంతో ఇష్టం. కానీ అజిత్ నా ప్రాణం. సినిమాలను, ఇంటినీ బ్యాలెన్స్ చేసుకోవడం ఎంత కష్టమో నాకు తెలుసు. అలాంటి సమయాల్లో దేనికీ న్యాయం చెయ్యలేను. అందుకే ఇల్లు, సంసారం నా ప్రాధాన్యం అనుకున్నాను. దానికే కట్టుబడ్డాను" అని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు షాలినీ. "ఆమె తీసుకున్న ఈ నిర్ణయం నా అదృష్టం. నా విజయాలన్నిటి వెనుక ఆమె ఉంది" అంటారు అజిత్. మళ్ళీ కార్ రేసుల్లోకి రావాలనే ఆలోచనతో 'అజిత్ కుమార్ రేసింగ్ టీమ్'ను ఆయన ప్రారంభించినప్పుడు... దాని బ్రోచర్ స్క్రీన్ షాట్‌ను షాలినీ షేర్ చేస్తూ "నిన్ను మళ్ళీ రేసింగ్ డ్రైవర్‌గా చూస్తున్నందుకు, నువ్వు ఇష్టపడేది నువ్వు చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా అనిపిస్తోంది. భవిష్యత్తులో నీకు, నీ టీమ్‌కు సురక్షితమైన, విజయవంతమైన రేసింగ్ కెరీర్ లభించాలని కోరుకుంటున్నాను" అని ట్వీట్ చేశారు.

ఆ క్రెడిట్ ఆమెదే...

ఈ దంపతులకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. వారి బాగోగులు చూసుకుంటూనే... 'మోహిని-మణి ఫౌండేషన్' బాధ్యతల్లో కూడా షాలినీ క్రియాశీలకంగా ఉన్నారు. తన తల్లితండ్రుల పేరిట అజిత్ ఏర్పాటు చేసిన ఈ లాభాపేక్షలేని సంస్థ... వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహనను, పౌర స్పృహను పెంపొందించడంతో సహా పలు కార్యక్రమాలను చేపడుతోంది. "ఆడంబరాలకు, వివాదాలకు దూరంగా ఉండే అజిత్-షాలినీది ఆదర్శప్రాయమైన జంట" అంటారు సినీ అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా. "ఈ క్రెడిట్‌లో అధిక శాతం షాలినీకే చెందాలి" అంటారు అజిత్. సక్సెస్‌లో ఉన్నప్పుడే సినీ రంగం నుంచి తప్పుకొని... భర్త విజయానికి అండగా నిలుస్తున్న షాలినీ... అజిత్‌తో పాటు దాదాపు ప్రతి రేస్‌కూ, పోటీకీ హాజరవుతారు. ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చొని... ఆయనలో ఉత్సాహాన్ని నింపుతూ ఉంటారు. ప్రస్తుతం అజిత్ పూర్తి చేసిన రెండు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఆ తరువాత ఆయన మరే చిత్రానికీ సంతకం చెయ్యలేదు. తన రేసింగ్ కెరీర్, టీమ్ మీదే ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రేసింగ్ సీజన్ పూర్తయ్యాక... మళ్ళీ సెట్స్ పైకి వస్తారు. తదుపరి రేసులకు సిద్ధమవుతున్న అజిత్ నటననూ, అభిరుచినీ సమతుల్యం చేసుకోవడంలో షాలినీ ముఖ్యపాత్ర పోషిస్తున్నారు.

చెవి కమ్మలు.... కొత్తగా...

పదిమందిలో ప్రత్యేకంగా కనిపించాలంటే దుస్తులకు తగ్గట్టు ఆభరణాలు ధరించాల్సిందే! ముఖ్యంగా చెవి కమ్మలను ట్రెండ్‌కు తగ్గట్టు ఎంపిక చేసుకోవాలి. ఉద్యోగినులకు, యువతులకు అన్నివిధాలా అనుకూలంగా ఉండే సరికొత్త చెవి కమ్మల వివరాలు...

నగ్ స్టడ్స్



● ప్రస్తుతం మహిళలు.... నగ్ వర్క్ చేసిన చెవి దిద్దులను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. బంగారంతో వివిధ ఆకృతుల్లో రూపొందించిన దిద్దుల మీద సీజెడ్‌లు లేదా ఆకుపచ్చ, ఎరుపు, గులాబీ రంగు రాళ్లను పొదుగుతారు. వీటికి ముత్యాలను కూడా చేర్చి మరింత ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. వీటిని చీరలు, లెహంగాలు, లంగా-ఓణీ లాంటి సంప్రదాయ దుస్తులు ధరించినపుడు పెట్టుకోవచ్చు.

స్టడ్ హ్యాంగింగ్స్



● నెమలి ఆకారంలో బంగారు దిద్దులను తయారుచేసి వాటికి పెద్ద ముత్యాన్ని చిన్న బంగారు గుండును కొద్దిగా వేలాడేలా జతచేస్తారు. మధ్య వయసు మహిళలు, ఉద్యోగినులు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అందంగా కనిపించడమే కాకుండా రోజువారీ పెట్టుకోవడానికి అనుకూలంగా ఉంటాయి.

ఫ్లవర్ స్టడ్స్



● అందమైన పూల ఆకృతిలో దిద్దులను తయారు చేసి వాటి మధ్యలో కొన్ని గుండ్లను అతికిస్తారు. వీటిని పూర్తిగా బంగారంతోనే తయారు చేస్తారు. ఇవి అన్ని వయసుల వారికీ అన్ని రకాల దుస్తుల మీద చక్కగా నప్పుతాయి.

బాల్ రింగ్స్



● ట్రెండీగా ఉంటూ మోడరన్ లుక్ కోరుకునే అమ్మాయిలకు ఇవి బాగుంటాయి. చిన్న బంతిలా కనిపించే బంగారు గుండులోనించి గుండ్రని రింగుని జొప్పించి వీటిని తయారు చేస్తారు. కార్యాలయాలకు, కాలేజీలకు వెళ్లే యువతులు వీటిని రోజువారీ పెట్టుకోవచ్చు.

బెల్ రింగ్స్



● గుండ్రని రింగులకు బంగారు గుండ్లు అతికించి బంగారు తీగతో మువ్వలు వేలాడేలా అమరుస్తారు. వీటిని యువతులు ఎక్కువగా ఆదరిస్తున్నారు. మోడరన్ దుస్తుల మీద ఆకర్షణీయంగా కనిపిస్తాయి. వీటిని బ్లాక్ మెటల్‌తో కూడా రూపొందిస్తున్నారు.

హూప్స్



● ఒక పెద్ద రింగులో మరో చిన్న రింగును పెట్టి రెంటినీ చక్కని డిజైన్‌తో అనుసంధానిస్తారు. పక్షులు, లతలు, బంగారు గుండ్లతో కూడిన ఈ డిజైన్ ఆకర్షణీయంగా ఉంటుంది. మోడరన్ దుస్తులు ధరించేవారందరికీ ఇవి బాగా నప్పుతాయి. సాధారణంగా కనిపిస్తూనే ముఖానికి రిచ్ లుక్‌నిస్తాయి.

సాధించింది... సమున్నతంగా!

మనసుంటే మార్గం ఉంటుంది. ఈ సామెతను నిజం చేసి, ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాలను అధిరోహించిన అతి పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించింది 17 ఏళ్ల కామ్య కార్తికేయన్. ఈ ముంబయి వాసి పర్వతారోహణ ప్రయాణం ఎలా మొదలైందో తెలుసుకుందాం.

స్ఫూర్తి



ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించాలనే లక్ష్యంతో మొదట ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించింది కామ్య. ఆ తర్వాత యూరప్‌లోని ఎల్‌బ్రస్ పర్వతం, ఆస్ట్రేలియాలోని కోషిస్కో పర్వతం, దక్షిణమెరికాలోని ఏకన్‌కాగ్వా పర్వతం, ఉత్తరమెరికాలోని డెనాలి పర్వతం, ఆ తర్వాత ఆసియాలోని ఎవరెస్టు పర్వతాలను వరుసగా అధిరోహించింది. చివరిగా ఏడవ పర్వతాన్ని అధిరోహించడం కోసం అంటార్కికాకు చేరుకున్న కామ్య, గత నెల 24న తన తండ్రి, ఇండియన్ నేవీ కమాండర్ ఎస్.కార్తికేయన్‌తో కలిసి విన్సన్ పర్వతాన్ని అధిరోహించి చరిత్ర సృష్టించింది. ఆ విధంగా ప్రపంచంలోని ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించడం ద్వారా ప్రపంచంలోని అత్యంత ఎత్తయిన ప్రదేశాలకు చేరుకుంది. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించి చూపించింది.

ట్రెక్కింగ్‌తో మొదలుపెట్టి...

పర్వతారోహణ పట్ల తన తండ్రికున్న మక్కువ నుంచి ప్రేరణ పొందిన కామ్య, చిన్న వయసు నుంచే ట్రెక్కింగ్ మొదలుపెట్టింది. ఆ క్రమంలో ఏడేళ్ల వయసులో పర్వతారోహణ పట్ల ఆసక్తి ఏర్పడడానికంటే ముందు కామ్యకు ట్రెక్కింగ్ మీద ఆసక్తి పెరిగింది. మూడేళ్ల వయసు నుంచే ఎక్కువ దూరాల పాటు ట్రెక్కింగ్ మొదలుపెట్టిన కామ్య, 2015లో, ఏడేళ్ల వయసులో చంద్రశిల పీక్‌కు ట్రెక్కింగ్ చేయడం ద్వారా తన హిమాలయ పర్వతారోహణ ప్రయత్నాలను మొదలుపెట్టింది. ఆ తర్వాత మరింత పురోగతి సాధించి, 2016, 2017లో హర్ కి దున్, కేదార్‌నాథ్ పీక్, రూప్‌కుండ్ లేక్‌లకూ, ఎవరెస్టు బేస్ క్యాంప్‌కూ ట్రెక్కింగ్ చేసి ఇంతటి మైలురాయిని అందుకున్న ప్రపంచంలోని రెండవ బాలికగా పేరు తెచ్చుకుంది. 2019లో కామ్య బ్రిగు లేక్‌ను దాటి, హిమాచల్ ప్రదేశ్‌లోని సార్ పాస్‌ను దాటేసింది.

21 అంతస్తులు... 20 కిలోల బరువు...

పిల్లలు సాధించిన విజయాలకు పొంగిపోని తల్లితండ్రులు ఉండరు. కామ్య తల్లి లావణ్య కార్తికేయన్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. కూతురు సాధించిన విజయాలు చూసి గర్వంతో పొంగిపోతున్న ఆ తల్లి కామ్య గురించి మాట్లాడుతూ... "ఇప్పటివరకూ సాధించిన విజయాల కోసం కామ్య ఎన్ని త్యాగాలు చేసిందో, ఎంత కష్టపడిందో తల్లిగా నాకు తెలుసు. కామ్య ప్రతి రోజూ 2 నుంచి 3 గంటలు సాధన చేస్తుంది. పది నుంచి పన్నెండు కిలోమీటర్ల దూరం పరిగెత్తుతుంది. ముంబయిలో ఉండేవాళ్లం కాబట్టి అక్కడ మలబార్ కొండల మీద ట్రెక్కింగ్ సాధన చేస్తూ ఉండేది. అలాగే మేం 21వ అంతస్తులో ఉండేవాళ్లం. కాబట్టి పర్వతారోహణకు తగినట్టుగా కండరాలను బలపరుచుకోవడం కోసం 10 నుంచి 20 కిలోల బరువుతో పైకీ కిందకూ ఎక్కి దిగడం సాధన చేసింది. ఇలా కామ్య అనుకున్నది సాధించడం కోసం శాయశక్తులా కష్టపడింది. పట్టుదలగా కృషి చేసింది కాబట్టే ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న ఏడు ఎత్తైన శిఖరాలను అధిరోహించాలనే కలను సాకారం చేసుకోగలిగింది. 2021లో కామ్య, ప్రధానమంత్రి బాలశక్తి పురస్కారాన్ని పొందింది. ప్రధాని మాటలే కామ్యకు ప్రేరణగా మారాయని అనిపిస్తుంది. ఈ సందర్భంగా నేను తల్లులందరికీ ఒక సందేశం ఇవ్వాలనుకుంటున్నాను. తల్లులందరం దృఢంగా ఉండగలిగితే, మనం దృఢమైన ఆడపిల్లలను పెంచగలుగుతాం" అంటూ కామ్య గురించి చెప్పుకొచ్చింది లావణ్య కార్తికేయన్. కామ్య కథ ప్రపంచవ్యాప్త యువతకు, ప్రత్యేకించి కన్న కలలను నిజం చేసుకోవాలనే అమ్మాయిలకు స్ఫూర్తినిస్తుంది. ప్రపంచంలోని ఏడు ఎత్తయిన శిఖరాలను అధిరోహించడం ద్వారా విజయాలను సాధించడానికి వయసుతో సంబంధం లేదనీ, కలలను సాకారం చేసుకోవాలనే దృఢ సంకల్పం, అంకితభావాలుంటే ఎవరైనా అనుకున్నది సాధించగలుగుతారనీ కామ్య నిరూపించింది.

చిత్రజ్యోతి

SINCE 1965

కోపంగా చూడకే గాలి దుమారమే రేగినట్లు



కిరణ్ అబ్బవరం నటిస్తోన్న తాజా చిత్రం 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, సారెగమ నిర్మిస్తున్నారు. వచ్చే నెల 14న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. 'అగ్గిపుల్లె అలా గీసినట్లు, కోపంగా చూడకే గాలి దుమారమే రేగినట్లు, ఆవేశమెందుకే నొక్కిపెట్టు' అని సాగుతుందీ గీతం. సామ్ సీఎస్ సంగీతం అందించారు.


ఇండో-కొరియన్ హారర్ కామెడీ



వరుణ్ తేజ్ పుట్టిన రోజు సందర్భంగా కొత్త సినిమాను ప్రకటించారు. ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించనున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ దీన్ని భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. ఈ మేరకు మేకర్స్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ రిలీజ్ చేశారు. పోస్టర్ ఒక ప్రత్యేకమైన కొరియన్ కనెక్షన్‌ను చూపిస్తోంది. ఈ ఇండో-కొరియన్ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ యూనిక్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. తమన్ సంగీతం అందించనున్న ఈ చిత్రం ప్రొడక్షన్ వర్క్ మార్చిలో ప్రారంభం కానుంది. ఇతర నటీనటులు, సాంకేతిక సిబ్బంది వివరాలను త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.

అమ్మకు పద్మ అవార్డు వచ్చేలా ప్రయత్నిస్తా

- సీనియర్ నటుడు నరేశ్



"మా అమ్మ విజయనిర్మలపై ఓ బయోపిక్ తెరకెక్కించే ఆలోచన ఉంది. 46 సినిమాలకు దర్శకత్వం వహించిన ఏకైక మహిళా దర్శకురాలు విజయనిర్మల. ఆమెకు పద్మ అవార్డు రాకపోవడం బాధాకరం. ఆమెకు అవార్డివ్వాలని ఒకసారి ఢిల్లీ వరకు వెళ్లాను. అయినా ప్రయోజనం లేదు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అమ్మ పేరును పద్మ అవార్డు కోసం రికమెండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అర్హులను గుర్తించి అవార్డులను ఇవ్వడం సంతోషకరమైన విషయం. అమ్మకు ఆ పురస్కారం దక్కేలా మరోసారి ప్రయత్నిస్తా" అని అన్నారు సీనియర్ నటుడు నరేశ్. ఇటీవలే విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఇందులో ముఖ్యమంత్రి పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించారు నరేశ్. ఆదివారం విలేకరులతో ముచ్చటించిన ఆయన తన తదుపరి చిత్రాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'నా కెరీర్‌లోనే ఈ ఏడాది తీరిక లేని సంవత్సరంగా ఉండనుంది. 40 రోజుల్లో 22 కథలు విన్నాను. ప్రస్తుతానికి తొమ్మిది సినిమాల్లో నటిస్తున్నా' అని చెప్పారు. సోమవారం ఆయన పుట్టినరోజు కావడంతో ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేశారు.

మూడు పాత్రల చుట్టూ కోర్టు డ్రామా



ప్రియదర్శి లాయర్‌గా ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఏ నోబడి'. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. హీరో నాని సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి రామ్ జగదీశ్ దర్శకుడు. న్యాయవాదిగా కేసు ఫైల్ పట్టుకుని ఆలోచిస్తున్న ప్రియదర్శి, హర్ష్ రోషన్, శ్రీదేవి ఈ పోస్టర్‌లో కనిపించారు. 'మూడు కీలక పాత్రల చుట్టూ తిరిగే కోర్టు డ్రామా కథ ఇది. బలమైన కథాంశంతో ఈ సినిమా ఆలోచింపజేసే విధంగా ఉంటుంది' దర్శకుడు రామ్ చెప్పారు. 'షూటింగ్ దాదాపు పూర్తయిందనీ, హోలీ సందర్భంగా మార్చి 14న విడుదల చేస్తాం' అని నిర్మాత ప్రశాంతి తిపిర్నేని చెప్పారు.

వాషింగ్టన్ కుర్రోడు



సత్య వినుగొండ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్.కె.వి విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు సత్య మాట్లాడుతూ "ఇది విభిన్న తరహా యాక్షన్‌తో కూడిన వినోదాత్మక చిత్రం" అని చెప్పారు.

విభిన్న కథనాలతో...



రవిబాబు, సుమన్, ఏస్తర్, ఆమని, రాశి ప్రధాన పాత్రల్లో శెట్టిపల్లి శ్రీనివాసులు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'షూటర్'. ఈనెల 22న వరల్డ్ వైడ్‌గా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. చిత్ర దర్శకనిర్మాత శ్రీనివాసులు మాట్లాడుతూ 'విభిన్న కథనాలతో 'షూటర్'ని తెరకెక్కించాం. ప్రతి ఫ్రేమ్ ఆర్టిస్టులతో అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. డ్రమ్స్ రాంబాబు సంగీతం అందించారు.

తిరుమలలో చిత్ర బృందం



'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర బృందం ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. చిత్ర నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, చైల్డ్ ఆర్టిస్ మాస్టర్ బుల్లిరాజ్ భీమాలా రేవంత్, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ బృందంలో ఉన్నారు. తిరుమల (ఆంధ్రజ్యోతి)

నీరజ్.. పెళ్లి సర్‌ప్రైజ్

టెన్నిస్ క్రీడాకారిణి హిమానీని వివాహమాడిన జావెలిన్ స్టార్



న్యూఢిల్లీ: జావెలిన్ సూపర్‌స్టార్, ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా ఓ ఇంటివాడయ్యాడు. హరియాణాకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి హిమానీ మోర్‌ను పెళ్లి చేసుకున్నాడు. ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా, కేవలం కుటుంబసభ్యుల సమక్షంలో రెండ్రోజుల క్రితమే జరిగిన ఈ వివాహానికి సంబంధించిన ఫొటోలను నీరజ్ ఆదివారం సోషల్ మీడియాలో పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచాడు. 'నా జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించా. ఈ సందర్భంగా ఆశీస్సులు అందించిన అందరికీ కృతజ్ఞతలు' అని 27 ఏళ్ల చోప్రా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. రెండ్రోజుల క్రితమే జరిగిన ఈ వేడుకకు వేదిక ఎక్కడన్న విషయాన్ని వెల్లడించలేను. నూతన దంపతులు ఇప్పటికే హనీమూన్‌కు కూడా వెళ్లారు. ఇంతకుమించి ఏమీ చెప్పలేను' అని నీరజ్ మామ భీమ్ తెలిపారు.



ఎవరీ హిమాని?

హరియాణాలోని సోనీపట్‌కు చెందిన 25 ఏళ్ల హిమానీ మోర్.. 2021 వరకు టెన్నిస్ క్రీడలో కొనసాగింది. ఢిల్లీలోని ప్రఖ్యాత మిరండా హౌజ్ కళాశాల నుంచి రాజనీతిశాస్త్రం, వ్యాయామ విద్యలో డిగ్రీ చేసిన హిమాని.. ప్రస్తుతం అమెరికాలోని ఓ యూనివర్సిటీలో స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చదువుతోంది. హిమాని టెన్నిస్‌లో అంతర్జాతీయస్థాయిలో ఆడకపోయినా.. జాతీయస్థాయిలో మాత్రం రాణించింది. 2018లో జాతీయస్థాయిలో అత్యుత్తమంగా సింగిల్స్‌లో 42వ, డబుల్స్‌లో 27వ ర్యాంకును అందుకుంది.



జొకో X అల్కారజ్ క్వార్టర్స్‌లో ఢీ



జ్వెరేవ్, సబలెంక, గాఫ్ ముందంజ

ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: దిగ్గజం నొవాక్ జొకోవిచ్, యువ సంచలనం కార్లోస్ అల్కారజ్ మ్యాచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్లోనే చోటుచేసుకోనుంది. ఆదివారం జరిగిన నాలుగో రౌండ్‌లో జొకోవిచ్ 6-3, 6-4, 7-6 (4)తో లెహెచ్కా (చెక్ రిపబ్లిక్)ను చిత్తు చేశాడు. మరో ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో అల్కారజ్ 7-5, 6-1తో ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి జాక్ డ్రేపర్ (బ్రిటన్) గాయంతో వైదొలిగాడు. దాంతో అల్కారజ్ క్వార్టర్స్‌కు చేరాడు. పురుషుల ఇతర రౌండ్-16 మ్యాచ్‌ల్లో రెండో సీడ్ జ్వెరేవ్ 6-1, 2-6, 6-3, 6-2తో 14వ సీడ్ హంబర్ట్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 6-1, 6-1, 6-1తో డవిడోవిచ్‌పై విజయం సాధించారు

గాఫ్ సెట్ ఓడినా...: మూడో సీడ్ గాఫ్ (అమెరికా) వరుస సెట్ల విజయ పరంపరకు బ్రేక్ పడింది. రెండో గ్రాండ్‌స్లామ్ అందుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగిన గాఫ్ నాలుగో రౌండ్‌లో 5-7, 6-2, 6-1తో బెలిండా బెన్సిక్‌పై నెగ్గింది. గాఫ్ ఈ సీజన్‌లో ఆడిన గత 13 మ్యాచ్‌ల్లో ఒక్క సెట్ కూడా ఓడిపోకపోవడం విశేషం. మరో ప్రీక్వార్టర్స్‌లో బడోసా 6-1, 7-6 (2)తో ఓల్గా డానిలోవిక్‌పై సునాయాసంగా నెగ్గింది. సబలెంక 6-1, 6-2తో అండ్రీవాను ఓడించింది.

మిక్స్‌డ్‌లో బోపన్న ముందుకు

భారత ఆటగాడు రోహన్ బోపన్న మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టాడు. రెండో రౌండ్‌లో.. అమెరికా, మొనాకో ద్వయం టేలర్/హ్యారిగోతో బోపన్న/జాంగ్ షువాయ్ (చైనా) జంట తలపడాల్సి ఉంది. కానీ ప్రత్యర్థి వాకోవర్ ఇవ్వడంతో బోపన్న జోడీ ముందంజ వేసింది.

పాక్‌దే తొలి టెస్టు

ముల్తాన్: స్పిన్నర్లు సాజిద్ ఖాన్ (5/50), అబ్రార్ అహ్మద్ (4/27) చెలరేగడంతో వెస్టిండీస్‌తో తొలి టెస్టులో పాకిస్థాన్ 127 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆట మూడో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 109/3తో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన పాకిస్థాన్ 157కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 93 ఆధిక్యంతో కలిపి 250 పరుగుల టార్గెట్‌ను విండీస్‌కు పాక్ నిర్దేశించింది. ఛేదనలో విండీస్ 123 రన్స్‌కే ఆలౌటైంది. అంతకుముందు తొలిఇన్నింగ్స్‌లో పాక్ 230, విండీస 137 రన్స్ చేశాయి.

44కే కూల్చేశారు

యువ భారత్ సూపర్ బోణీ

విండీస్‌పై 9 వికెట్లతో గెలుపు

అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్



వెస్టిండీస్: 13.2 ఓవర్లలో 44 ఆలౌట్ (కాసర్ 15, అసబి 12; పరునిక 3/7, జోషిత 2/5, ఆయుషి 2/6);
భారత్: 4.2 ఓవర్లలో 47/1 (సనిక 18 నాటౌట్, కమలిని 16 నాటౌట్).

కౌలాలంపూర్: డిఫెండింగ్ చాంపియన్ భారత్ అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్‌ను అద్భుతంగా ఆరంభించింది. గ్రూప్-ఎలో భాగంగా జరిగిన తమ తొలి మ్యాచ్‌లో బోణీ కొడుతూ 9 వికెట్లతో వెస్టిండీస్‌ను చిత్తుగా ఓడించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్ మహిళలు.. భారత లెఫ్టార్మ్ స్పిన్నర్లు పరునిక సిసోడియా (3/7), జోషిత (2/5), ఆయుషి శుక్లా (2/6) ధాటికి 13.2 ఓవర్లలో 44 పరుగులకే కుప్పకూలారు. స్వల్ప లక్ష్యాన్ని భారత మహిళలు 4.2 ఓవర్లలోనే 47/1 స్కోరు చేసి అలవోకగా ఛేదించారు. తెలుగమ్మాయి, ఓపెనర్ గొంగడి త్రిష (4) నిరాశ పరిచినా.. మరో ఓపెనర్ కమలిని (16 నాటౌట్), సనిక చల్కే (18 నాటౌట్) భారత్‌ను విజయతీరాలకు చేర్చారు. భారత్ రెండో మ్యాచ్‌ను మలేసియాతో మంగళవారం ఆడనుంది.

మలేసియా 23 పరుగులకే..: గ్రూప్-ఎలోనే జరిగిన మరో మ్యాచ్‌లో శ్రీలంక మహిళలు 139 పరుగుల తేడాతో ఆతిథ్య మలేసియాను చిత్తుచేశారు. తొలుత లంక 6 వికెట్లకు 162 పరుగులు చేసింది. ఛేదనలో లంక భీకరమైన బౌలింగ్ ధాటికి మలేసియా 14.1 ఓవర్లలో 33 పరుగులకే ఆలౌటైంది.

షకీబ్‌పై అరెస్టు వారెంట్

ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షకీబల్ హసన్ అటు ఆటపరంగానే గాకుండా ఇటు వ్యక్తిగతంగానూ చిక్కుల్లో ఇరుక్కున్నాడు. అనుమానాస్పద బౌలింగ్ యాక్షన్ కారణంగా ఇప్పటికే ఐసీసీ నుంచి నిషేధం ఎదుర్కొంటున్న ఈ ఆల్‌రౌండర్‌పై రెండు చెక్ బౌన్సుల కేసుకు సంబంధించి బంగ్లాదేశ్ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. షకీబల్ ఛైర్మన్‌గా ఉన్న అల్ హసన్ ఆగ్రో ఫామ్ అనే సంస్థ ఐఎఫ్ఐసీ బ్యాంక్‌కు చెల్లించాల్సిన రూ. 3 కోట్ల చెక్‌లు బౌన్స్ అయ్యాయి. బ్యాంకు ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో కోర్టుకు హాజరవ్వాలన్న ఆదేశాలను షకీబల్‌తో పాటు సంస్థకు చెందిన ముగ్గురు ధిక్కరించారు. దీంతో ముగ్గురిపై అరెస్టు వారెంట్ జారీ అయింది.

సురేఖకు రజతం

పారిస్: విజయవాడ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ రజతంతో మెరిసింది. ఫ్రాన్స్‌లో జరిగిన ఇండోర్ ఆర్చరీ వరల్డ్ సిరీస్ ఫైనల్లో సురేఖ 146-147తో అలెజాండ్రా ఉస్కియానో (కొలంబియా) చేతిలో ఓడి ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది.

అర్జున్ గేమ్ డ్రా

విక్‌ాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్‌లో తెలుగు కుర్రాడు అర్జున్ ఇరిగేసి రెండో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. ఆదివారం అనీష్ గిరితో గేమ్‌లో అర్జున్ పాయింట్ పంచుకున్నాడు. కాగా, తొలి రౌండ్లో అర్జున్‌పై హరికృష్ణ గెలిచాడు. ఇక, ఆరంభ రౌండ్లో నెగ్గిన ప్రపంచ చాంపియన్ గుకేష్. వ్లాదిమిర్ ఫెడొసీవ్‌తో జరిగిన రెండో రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు.



ఖోఖోలో మనోళ్లు కేక

భారత్ డబుల్ ధమాకా

పురుషులు, మహిళల టైటిళ్లు కైవసం

న్యూఢిల్లీ: అంచనాలను నిలబెట్టారు..అద్భుత ఆటతో అదరగొట్టారు..ఫలితంగా భారత పురుషులు, మహిళలు మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్‌లో విజేతలుగా నిలిచారు. ఆదివారం జరిగిన మహిళల ఫైనల్లో భారత్ 78-40 పాయింట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసి విజేతగా ఆవిర్భవించింది. ఇక..పురుషుల జట్టు 54-36 పాయింట్ల తేడాతో నేపాల్‌ను ఓడించి చాంపియన్‌షిప్ దక్కించుకుంది. తొలుత జరిగిన అమ్మాయిల ఫైనల్లో మనోళ్లు అన్ని రంగాలలో తిరుగులేని ప్రదర్శన కనబరచారు. అనూహ్యమైన వేగంతో ప్రత్యర్థిని ఉక్కిరి బిక్కిరి చేశారు. భారత్ ధాటికి నేపాల్ చేష్టలుడిగింది. మొదటి టర్న్ ఆరంభంనుంచే భారత అటాకర్లు విజృంభించారు. తొలి టర్న్‌లోనే 34 పాయింట్లతో భారత్ తిరుగులేని స్థితిలో నిలిచింది. రెండో టర్న్‌లో నేపాల్ 35-24కి ఆధిక్యాన్ని తగ్గించింది. కానీ మూడో టర్న్‌లో దుమ్ము రేపిన భారత మహిళలు ఇంకో 38 పాయింట్లను ఖాతాలో వేసుకున్నారు. నాలుగో టర్న్ ఆరంభానికి 49 పాయింట్ల ఆధిక్యంలో నిలిచిన భారత్‌ను అడ్డుకోవడం నేపాల్ వల్ల కాకపోయింది. ఈ టర్న్‌లో ఆ జట్టు కేవలం 16 పాయింట్లే చేయగలిగింది.

ప్రపంచకప్ ఫైనల్స్‌లో నేపాల్ చిత్తు



పురుషుల జట్టు జోరు

నేపాల్‌తో తుది పోరులో పురుషుల జట్టు కూడా అన్ని రంగాలలో కదం తొక్కింది. దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్లో తేలిపోయిన డిఫెన్స్ విభాగం..నేపాల్‌పై చెలరేగింది. తొలి టర్న్..అటాకింగ్‌లో 26 పాయింట్లను భారత్ సాధించింది. రెండో టర్న్‌లో నేపాల్ 18 పాయింట్లు రాబట్టింది. దాంతో రెండు టర్న్‌లు ముగిసే సరికి భారత్ 26-18తో ముందంజలో నిలిచింది. మూడో టర్న్..అటాకింగ్‌లో భారత పురుషులు మరింత దూకుడుతో ఇంకో 28 పాయింట్లు సొంతం చేసుకున్నారు. ఇక..చివరి టర్న్‌లో నేపాల్ 18 పాయింట్లే చేయడంతో భారత్ విజయం ఖాయమైంది.

అమ్మాయిల విజయంలో తెలుగోడు



ఖోఖో వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకున్న భారత మహిళల జట్టు విజయంలో ఒక తెలుగోడి పాత్ర ఉండడం విశేషం. అతడి పేరు ఇస్లావత్ నరేష్. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా, ధర్మారం మండలం, బంజరపల్లి తండా నరేష్ స్వస్థలం. నరేష్ ప్రస్తుత భారత జట్టుకు సహాయ కోచ్. 1995లో ఆటగాడిగా కెరీర్ ప్రారంభించిన నరేష్ 2015లో ఎన్ఐఎస్ శిక్షణ పూర్తి చేసి కోచ్‌గా మారాడు. దక్షిణమధ్య రైల్వేలో 2016లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించి తొలుత ఆ జట్టుకు సహాయ కోచ్‌గా ఆతర్వాత భారత రైల్వే జట్టు చీఫ్ కోచ్‌గా అంచెలంచెలుగా ఎదిగాడు. తాజాగా ఖోఖో వరల్డ్‌కప్ నెగ్గిన భారత మహిళల జట్టుకు సహాయ కోచ్‌గా, స్కిల్ అనలైజర్‌గా క్రీడాకారుల ప్రదర్శనను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, వారి తప్పులను, బలహీనతలను సరిచేస్తూ దేశానికి తొలి విశ్వకప్‌ను అందించడంలో నరేష్ కీలకపాత్ర పోషించాడు. జట్టు ఫుట్‌వర్క్, డైవింగ్ పద్ధతులు మెరుగుపరచుకోవడంలోనూ నరేష్‌ది ప్రధాన భూమిక.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

బిజినెస్

హిండెన్‌బర్గ్ వ్యవస్థాపకుడు నేట్ ఆండర్సన్‌కు కష్టాలు

కెనడాలో కేసు నమోదు




టొరంటో: భారత బిలియనీర్ గౌతమ్ అదానీకి చుక్కలు చూపించిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వ్యవస్థాపకుడు నేట్ ఆండర్సన్‌కు కష్టాలు ప్రారంభమయ్యాయి. కెనడాకు చెందిన ఆన్సన్ అనే హెడ్జ్ ఫండ్ అధినేత మోయిజ్ కస్సమ్ తాను ఒక నివేదికను తయారు చేసేటప్పుడు ఆండర్సన్‌తో సహా పలువురు అందులో పాల్గొన్నారని ది మార్కెట్స్ ఫ్రాడ్ అనే వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే ఆండర్సన్ ఈ విషయాన్ని అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజీ కమిషన్(ఎస్ఈసీ)కి తెలియజేయలేదు. దీంతో ఆండర్సన్‌పై కెనడాలోని ఒంటారియో సుపీరియర్ కోర్ట్ ఆఫ్ జస్టిస్‌లో కేసు నమోదైంది. అమెరికా ఎస్ఈసీ కూడా దీనిపై దర్యాప్తు జరిపే అవకాశం ఉందని భావిస్తున్నారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థను మూసివేస్తున్నట్టు ఆండర్సన్ గత వారం ప్రకటించారు. ఆ వెంటనే ఆయనపై ఈ కేసు నమోదవడం విశేషం.

భారత్‌లోనూ కార్ల తయారీ

న్యూఢిల్లీ: చైనా విద్యుత్ వాహనాల (ఈవీ) సంస్థ బీవైడీ భారత్‌లోనూ తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తోంది. బీవైడీ ఇండియా ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వెహికల్స్ (ఈపీవీ) విభాగం బిజినెస్ హెడ్ రాజీవ్ చౌహాన్ ఈ విషయం వెల్లడించారు. ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోకు హాజరైన ఆయన పీటీఐ వార్తా సంస్థతో ఈ విషయం చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)తో కలిసి 100 కోట్ల డాలర్ల పెట్టుబడితో భారత్‌లో ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసేందుకు బీవైడీ గతంలో ముందుకొచ్చింది. అయితే, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అందుకు అనుమతించలేదు. దాంతో ఆ ప్రతిపాదన అమలుకు నోచుకోలేదు. రెండు దేశాల సంబంధాలు ఇప్పుడు కొద్దిగా గాడినపడ్డాయి. ఈ నేపథ్యంలో బీవైడీ ఈ ఆలోచన చేయడం విశేషం. సరిహద్దు ఘర్షణలతో భారత-చైనా సంబంధాలు వేడెక్కినా ఆ ప్రభావం తమ కంపెనీపై ఏ మాత్రం లేదని చౌహాన్ తెలిపారు. చైనా పౌరులకు వీసాల మంజూరు చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం కఠినం చేసిన ప్రభావం కూడా తమపై లేదన్నారు. వివేకవంతులైన భారతీయులు తమ వాహనాలు కొంటూనే ఉన్నారన్నారు. గత ఏడాది బీవైడీ ఇండియా భారత్‌లో 3,500 వాహనాలు విక్రయించింది. కాగా ఈ ఏడాది అమ్మకాలు మరింత పెరుగుతాయని భావిస్తున్నట్టు చౌహాన్ చెప్పారు.

వీసాల సమస్య లేదు: బీవైడీ



బీవైడీ ఇండియా బిజినెస్ హెడ్ రాజీవ్ చౌహాన్

అన్ని రంగాల్లోనూ అగ్రగామి కావడమే లక్ష్యం

ఐటీసీ కొత్త వ్యాపార వ్యూహం

న్యూఢిల్లీ: సిగరెట్ల నుంచి వినియోగ వస్తువుల వరకు విభిన్న వ్యాపార రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీసీ తమ వ్యాపారాలన్నింటిలోనూ అగ్రగామి కావాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇందుకోసం "భవిష్యత్ వ్యూహం" రూపొందించుకుంది. నానాటికీ మారుతున్న భవిష్యత్తుకు దీటుగా నిలవగల సంస్థగా ఐటీసీని తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ పురి చెప్పారు. డిజిటైజేషన్, స్థిరత్వ, ఇన్నోవేషన్, సరఫరా వ్యవస్థ సామర్థ్యం పోటీ సామర్థ్యం పెంచుకునేందుకు దీటైన సాధనాలని గుర్తించామన్నారు. రూ.70,000 కోట్ల ఐటీసీ గ్రూప్ వ్యాపారాల్లో ఎఫ్ఎంసీజీ విభాగం 70 శాతం వాటా కలిగి ఉంది. తదుపరి వ్యూహంలో భాగంగా ఈ విభాగంపై మధ్యకాలిక దృక్పథంలో రూ.20,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ఐటీసీ గత ఏడాది ప్రకటించింది. అలాగే ఐటీసీ పేపర్ బోర్డు కూడా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాల్లోకి ప్రవేశించాలని నిర్ణయించింది. మొక్కల ద్వారా లభించే మౌల్డెడ్ ఫైబర్‌ను ఉపయోగించి స్థిరమైన ప్యాకేజింగ్ సొల్యూషన్లు అందించే ప్రయత్నంలో భాగంగా ఇటీవలే మధ్యప్రదేశ్‌లోని సెహోర్‌లో అత్యాధునిక మౌల్డెడ్ ఫైబర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది.

23,500 పైన బుల్లిష్

(జనవరి 20-24 తేదీల మధ్య వారా



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,392-23,047 పాయింట్ల మధ్యన కదలాడి 228 పాయింట్ల నష్టంతో 23,203 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,500 కన్నా పైన ముగిస్తే స్వల్ప కాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,246, 23,317, 23,550, 23,868 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,500
బ్రేక్‌డౌన్ స్థాయి: 22,900
నిరోధ స్థాయిలు: 23,400, 23,500, 23,600
(23,300 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు:23,000, 22,900, 22,800

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	122	విజయవాడ	136
వరంగల్	122	గుంటూరు	135
కరీంనగర్	122	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	122	చిత్తూరు	104
కర్నూలు	122	నెల్లూరు	109
విశాఖపట్నం	132	అనంతపురం	109
గోదావరి	136		



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	503	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	



ఆగని ఎఫ్‌పీఐల అమ్మకాల హోరు

ఈ నెలలో ఇప్పటికే రూ.44,396 కోట్లు వెనక్కి

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లో విదేశీ పోర్టుఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) అమ్మకాల హోరు కొనసాగుతోంది. ఈ నెల 17వ తేదీ నాటికి మన మార్కెట్ నుంచి ఈ సంస్థలు రూ.44,396 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. ఈ నెల 2న తప్ప మిగతా అన్ని రోజుల్లో ఎఫ్‌పీఐలు అమ్మకాలకు దిగడం గమనార్హం. ఇవే సంస్థలు గత ఏడాది డిసెంబరులో మన మార్కెట్లో రూ.15,446 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశాయి. 2023లో రికార్డు స్థాయిలో రూ.1.71 లక్షల కోట్లు మదుపు చేసిన ఎఫ్‌పీఐలు గత ఏడాది కేవలం రూ.427 కోట్లు మాత్రమే మన స్టాక్ మార్కెట్లో మదుపు చేశాయి.

బడ్జెట్‌లో పెట్టుబడులే కీలకం

న్యూఢిల్లీ: నీరసించిన భారత వృద్ధి రేటును గాడిలో పెట్టాలంటే మూలధన పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టక తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇందుకోసం వచ్చే కేంద్ర బడ్జెట్‌లోనూ కేటాయింపులు పెంచాలని ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సభ్యుడు నగేశ్ కుమార్ సూచించారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై పెట్టుబడులు మన జీడీపీ వృద్ధి రేటును మరింత ముందుకు తీసుకు వెళతాయన్నారు. డాలర్ బలం వల్లే రూపాయి మారకం రేటు కుంగిపోతోందన్నారు. ఈ విషయంలో మిగతా దేశాల కరెన్సీలతో పోలిస్తే రూపాయి మారకం రేటు పతనం తక్కువేనన్నారు.

అంతర్జాతీయ సంకేతాలే కీలకం..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేస్తుండటం, డాలర్ ఇండెక్స్, యూఎస్ బాండ్ లాభాలు పెరుగుతుండటం ప్రతికూల అంశాలు. మరికొన్ని రోజులు బెంచ్‌మార్క్ సూచీలు ఒడుదొడుకులకు గురి కావచ్చు. ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లు కాస్త జోరు ప్రదర్శిస్తున్నాయి. గత వారం మీడియా, రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ హెల్త్‌కేర్, ఫార్మా షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. మెటల్, సీపీఎస్ఈ, పీఎస్‌యూ బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లకు డిమాండ్ పెరిగింది. కేంద్ర బడ్జెట్ సమీపిస్తుండటంతో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఇండస్ టవర్: గత ఏడాది సెప్టెంబరులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేర్లలో 31 శాతం మేర కరెక్షన్ జరిగింది. కీలక మద్దతు స్థాయి రూ.320 వద్ద తాజాగా ట్రెండ్ రివర్సల్ మొదలైంది. చివరి ఐదు సెషన్లలో నాలుగు సార్లు లాభపడటం, నిఫ్టీతో పోల్చితే 13 శాతం పెరగటం శుభసూచకం. డిసెంబరు త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు విడుదల చేయవచ్చన్న అంచనాలు ఉన్నాయి. గత శుక్రవారం ఈ షేరు 2.30 శాతం లాభంతో రూ.362 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.350 వద్ద పొజిషన్ తీసుకుని రూ.385/390 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.340 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మారికో: ప్రస్తుతం ఎఫ్ఎంసీజీ రంగం కాస్త బలం ప్రదర్శిస్తోంది. జీవితకాల గరిష్ఠం నుంచి 20 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ షేరు ప్రస్తుతం కీలక స్థాయిల్లో కదలాడుతోంది. అక్యుములేషన్ జరుగుతోంది. 200 రోజులు, 21 రోజుల సగటు విలువపైన చలిస్తుండటం సానుకూల అంశం. గత శుక్రవారం 1.81 శాతం లాభంతో రూ.664 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.640 వద్ద పొజిషన్ తీసుకుని రూ.720/730 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.625 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆర్‌వీఎన్ఎల్: గత ఏడాది జూలైలో రూ.647 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ కౌంటర్‌లో 44 శాతం మేర కరెక్షన్ జరిగింది. బడ్జెట్‌లో రైల్వేలకు 20 శాతం మేర కేటాయింపులు పెంచుతారన్న అంచనాలు, ఆకర్షణీయమైన ధరలకు లభిస్తుండటంతో రైల్వే షేర్లపై మదుపరులకు ఆసక్తి పెరుగుతోంది. గత శుక్రవారం 3.71 శాతం లాభంతో రూ.426 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.400/410 శ్రేణిలో ఎంటరై రూ.455 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.390 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్ ఇండియా: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం మేర పతనమైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం మూమెంటమ్ కనిపిస్తోంది. ఇప్పటికే షేరు బాగా పతనమవటంతో ట్రెండ్ రివర్సల్ జరిగే అవకాశం ఉంది. చివరి నాలుగు సెషన్లలోనే ఈ షేరు 8 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.387 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.380 వద్ద పొజిషన్ తీసుకుని రూ.430/450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.365 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


టాటా కన్స్యూమర్: ఈ షేరు రూ.1,250 స్థాయి వద్ద జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 30 శాతం మేర కరెక్షన్‌కు గురైంది. ఆ తర్వాత రూ.880 వద్ద కీలక మద్దతు లభించింది. అప్పటి నుంచి కాస్త పటిష్ఠతను సూచిస్తోంది. గత శుక్రవారం రూ.954 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.940 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.925 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కీలక మద్దతు 23,000 చేరువలో..



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో ప్రధాన మద్దతు స్థాయి 23,000 వద్ద మద్దతు తీసుకుని తక్షణ డౌన్‌ట్రెండ్‌ను నివారించుకుంది. కాని శుక్రవారం మరోసారి కరెక్షన్‌లో పడడం అప్రమత్త సంకేతం. గత వారం నిఫ్టీ సైడ్‌వేస్‌లో పరిమిత పరిధిలో కదలాడి 230 పాయింట్ల నష్టంతో క్లోజయింది. టెక్నికల్‌గా మార్కెట్ వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమన అనిశ్చితంగా ముగిసింది. గత రెండు వారాల్లో వెయ్యి పాయింట్ల మేరకు నష్టపోయింది. మిడ్‌క్యాప్-100 సూచీ 2,300 పాయింట్లు నష్టపోయినా బలమైన పునరుజ్జీవం సాధించి 22 పాయింట్ల స్వల్ప లాభంతో క్లోజైంది. స్మాల్ క్యాప్-100 సూచీ కూడా 720 పాయింట్ల మేరకు నష్టపోయినా కోలుకుని ముందు వారంతో పోల్చితే 26 పాయింట్ల స్వల్ప లాభంతో ముగిసింది. ప్రస్తుతం నిఫ్టీ మానసిక అవధి 23,000 సమీపంలో ఉంది. ఇక్కడ మరింత అప్రమత్త ట్రెండ్‌కు ఆస్కారం ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి.

బుల్లిష్ స్థాయిలు: గత రెండు వారాల్లో నిట్టనిలువుగా దిగజారినందు వల్ల సానుకూలత కోసం కన్సాలిడేట్ కావడం అవసరం. ప్రస్తుత స్థాయిలో పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శించినా మైనర్ నిరోధం 23,300 కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధం 23,500. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక సానుకూలత ప్రదర్శిస్తుంది.

బేరిష్ స్థాయిలు: ఒక వేళ బలహీనత ప్రదర్శించినా ప్రధాన మద్దతు స్థాయి 23,000 వద్ద పునరుజ్జీవం తప్పనిసరి. మరింత బలహీనపడితే స్వల్పకాలిక బలహీనత ఎదుర్కొనక తప్పదు. అప్రమత్తత అవశ్యం.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 195 పాయింట్ల నష్టంతో 48,500 వద్ద ముగిసింది. రికవరీ బాట పడితే ప్రధాన నిరోధం 49,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 48,000.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 200 డీఎంఏ కన్నా దిగువకు వచ్చింది. సానుకూలత కోసం ఇక్కడ బౌన్స్‌బ్యాక్ కావాలి. అలాగే మార్కెట్ ప్రస్తుతం 23,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్", గతంలో ఏర్పడిన బాటమ్‌కు చేరువవుతోంది. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత దిగజారవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,300, 23,370
మద్దతు	23,080, 23,000



ఎన్డీఆర్ఎఫ్‌లోని విపత్తుల రక్షణ పరికరాలను పరిశీలిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్





తిరుపతిలో నిర్మించిన ఫోరెన్సిక్ ల్యాబొరేటరీని విజయవాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, చిత్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనిత




బోరుబావిలో పడిన పిల్లల్ని రక్షించే విధానాన్ని పరిశీలిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మోదీ కొండంత అండ

● రాష్ట్రాభివృద్ధికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అద్భుతంగా సహకరిస్తోంది. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ కావాలన్న ప్రధాని మోదీ ఆకాంక్షలో భాగస్వామి అయ్యేందుకు మరింత తోడ్పాటు అవసరం. రాష్ట్రంలోనూ 2047 విజన్ లక్ష్యంగా పెట్టుకున్నాం. - ముఖ్యమంత్రి చంద్రబాబు

రాష్ట్రానికి పూర్వవైభవం తెస్తాం

- గత పాలనలో అంతా విధ్వంసం
- వెంటిలేటర్ నుంచి బయటపడ్డాం
- కేంద్రం ఆక్సిజన్ ఇచ్చి ఆదుకుంది
- ఏపీ పునర్నిర్మాణంలో అమిత్ షా సూచన సంతృప్తినిచ్చింది: బాబు



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్రం సహకారంతో రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల నాటికి రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయి, వ్యవస్థలు దెబ్బ తిని వెంటిలేటర్‌పై ఉందని.. ప్రజలు 93 శాతం స్ట్రైక్ రేట్‌తో ఇచ్చిన విజయంతో కేంద్రం ఆక్సిజన్ అందించి ఆదుకుందన్నారు. వెంటిలేటర్ నుంచి బయటపడ్డాం కానీ ఇంకా కోలుకోలేదన్నారు. ఎన్నికల ముందు పది లక్షల కోట్లకు పైగా అప్పులు.. రాజధాని పూర్తిగా విధ్వంసం.. కొట్టుకుపోయిన పోలవరం డయా ఫ్రమ్ వాల్.. ఇలాంటి ఘోరమైన పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. అమరావతికి 15 వేల కోట్ల సాయం కేంద్రం నుంచి అందడంతో రాజధాని పనులు వేగవంతమయ్యాయని, పోలవరం డయా ఫ్రమ్ వాల్ పనులు తాజాగా మొదలయ్యాయని, ఈ రెండింటినీ పూర్తి చేసి తీరుతామన్నారు. ఆదివారం విజయవాడ సమీపంలోని కొండపావులూరు వద్ద జరిగిన ఎన్డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక వేడుకల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ... దేశంలో ఏ మూల సమస్య ఉన్నా పరిష్కారానికి పట్టుదలతో కష్టపడే అమిత్ షా శాంతిభద్రతల పరిరక్షణలో వినూత్నంగా ఆలోచిస్తుంటారని అన్నారు. సమస్యలపై లోతుగా అధ్యయనం చేసే అమిత్ షా నేతృత్వంలో దేశ నలుమూలలా శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని కొనియాడారు. ఆయన పనితీరు చూసి అప్పుడప్పుడు తాను అసూయ పడుతుంటానని నవ్వుతూ వ్యాఖ్యానించారు. సర్వనాశనమైన ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో వినూత్నంగా ఆలోచించాలంటూ అమిత్ షా చేసిన సూచన తనకు ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్ల సాయంతో కేంద్రం ప్రాణం పోసిందని, ఆంధ్రుల చిరకాల వాంఛ రైల్వే జోన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారన్నారు. అలాగే గోదావరి-బనకచెర్ల ప్రాజెక్టుకు కేంద్రం సహకరించాలని చంద్రబాబు కోరారు.

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడిన ఆరు నెలల్లోనే రాష్ట్రానికి మూడు లక్షల కోట్ల రూపాయల సహకారం అందించామన్నారు. అమరావతి నిర్మాణానికి నిధులిచ్చామని, 2028 నాటికి పోలవరం ప్రాజెక్టు నీళ్లు రాష్ట్రంలోని పొలాల్లో పారిస్తామన్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా రైల్వే జోన్ ఏర్పాటైందని, తాజాగా విశాఖ ఉక్కుకు ఊతమిచ్చి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని మరింత పెంచామని అమిత్ షా పేర్కొన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ సేవలు భేష్

'విపత్తుల నిర్వహణ సంస్థలు ఒకే చోట ఉంటే విపత్కర పరిస్థితుల్లో సమన్వయం చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. గ్రామ స్థాయిలో ఎన్‌సీసీ ప్రతినిధుల నుంచి కేంద్ర ప్రభుత్వం వరకూ అన్నీ సమన్వయం చేసుకుంటేనే ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. గతంలో ఒడిశాలో తుఫాన్లు వస్తే వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల రెండు సార్లు తుఫాన్లు వచ్చినా ముందస్తు ప్రణాళికతో ఎదుర్కోవడం వల్ల ఒక్క ప్రాణం కూడా పోలేదు. గతంలో ఉపశమనం తప్ప ముందు జాగ్రత్త చర్యలు ఉండేవి కావు. మోదీ పాలనలో జీరో క్యాజువాలిటీ లక్ష్యం నిర్దేశించుకుని పని చేస్తున్నాం. దేశ, విదేశాల్లో ఎన్డీఆర్ఎఫ్ ఎన్నో విజయాలు సాధించింది. విపత్తుల్లో చిక్కుకున్న ప్రజలు ఎన్డీఆర్ఎఫ్ యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తుల్ని చూడగానే ధైర్యం వచ్చిందని నాకు చాలా చోట్ల చెప్పారు. జపాన్, నేపాల్, మయన్మార్, టర్కీ తదితర దేశాల అధ్యక్షులు సైతం ఎన్డీఆర్ఎఫ్ సేవల్ని కొనియాడారు' అని అమిత్ షా వివరించారు.

ఢిల్లీలోనూ గెలుస్తాం

'గత ఏడాది సార్వత్రిక ఎన్నికలతో పాటు ఇటీవల మహారాష్ట్రలో భారీ విజయం సాధించాం. అదే తరహాలో త్వరలో జరిగే ఢిల్లీ ఎన్నికల్లో ఎన్డీయే భారీ విజయాన్ని సాధించబోతోంది' అని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

220 కోట్ల రూపాయల ఖర్చుతో కేంద్రం చేపట్టిన పలు పనులకు అమిత్ షా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కృష్ణా జిల్లా కొండపావులూరులో యాభై ఎకరాల్లో నిర్మించిన ఎన్ఐడీఎం భవనాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రారంభించారు. సుపాల్ తొమ్మిదో బెటాలియన్‌లోని రీజినల్ రెస్పాన్స్ సెంటర్(ఆర్‌సీసీ)తో పాటు హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీ(ఎన్‌పీఏ)లో ప్రొబెషనరీ ఐపీఎస్‌లకు శిక్షణ ఇచ్చే ఇంటిగ్రేటెడ్ ఇండోర్ షూటింగ్ రేంజ్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అలాగే తిరుపతిలోని ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. జాతీయ, ప్రాంతీయ భాషల్లో రూపొందించిన ఎన్డీఆర్ఎఫ్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. విశిష్ట ప్రతిభ కనబరిచిన తొమ్మిది మందికి రాష్ట్రపతి పోలీసు సేవా పతకాలు అందజేశారు. ప్రకృతి విపత్తుల్లో ఎన్డీఆర్ఎఫ్ అందించే సేవలకు సంబంధించిన మాక్ డ్రిల్‌ను తిలకించి, ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, బండి సంజయ్, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి సహకరిస్తాం


'అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ఆర్థిక నిర్వహణలో మంచి అనుభవం ఉన్న చంద్రబాబు కష్టానికి కేంద్రం తోడ్పాటు ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిన రాజధాని అమరావతికి గడిచిన ఆరు నెలల్లోనే 27 వేల కోట్ల రూపాయల భరోసాతో ఏపీ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచాం. ఇటీవలే రాష్ట్రపతి చేతుల మీదుగా ఎయిమ్స్ ప్రారంభమైంది. రాష్ట్రంలో రూ.1.20 లక్షల కోట్లతో జాతీయ రహదారులు నిర్మిస్తున్నారు' అని అమిత్ షా వెల్లడించారు.



● గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తే, ఎన్డీయే కూటమి రాష్ట్రాన్ని కాపాడుతోంది. మరోసారి వైసీపీ అధికారంలోకి వచ్చుంటే ఆ విపత్తును ఊహించుకోలేం. - ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఆర్నెల్లలోనే కేంద్రం భారీ సాయం

- రాష్ట్రాన్ని ఎన్డీయే కూటమి కాపాడుతోంది
- ప్రతి పంచాయతీలో 'విపత్తు' బృందాలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఆర్నెల్లలోనే భారీ సాయం అందించిందంటూ కేంద్రానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబుతో కలసి ఎన్డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పవన్ మాట్లాడుతూ.. విపత్తు నిర్వహణ గ్రామ స్థాయిలో జరగాలని, ప్రతి పంచాయతీ పరిధిలో అత్యవసర సమయంలో స్పందించే బృందాలు అవసరమన్నారు. అమిత్ షా సూచన మేరకు పంచాయతీరాజ్ దీనిపై పటిష్ఠ కార్యాచరణతో ముందుకు వెళ్తుందన్నారు. విశాలమైన సముద్ర తీరం గల ఏపీలో కేంద్రం విపత్తుల నిర్వహణ సంస్థను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో మన తీర ప్రాంతవాసులకు భరోసా దక్కినట్లేనన్నారు. విశాఖ ఎల్జీ పాలిమర్స్‌లో దుర్ఘటన, అచ్యుతాపురం సెజ్‌లో అమ్మోనియా లీకేజీ ప్రమాదం, విజయవాడను ముంచెత్తిన వరదల్లో ఎన్డీఆర్ఎఫ్ కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. మనుషులతో పాటు మూగజీవాలను సైతం కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ రెండు దశాబ్దాల్లో 18 వేల రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. విజయవాడ వరదల్లో సేవలందించిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి పవన్ కల్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇక్కడ స్థలం కేటాయిస్తే, నరేంద్ర మోదీ నిధులిచ్చి భవనాల నిర్మాణంతో అభివృద్ధి చూపించారన్నారు.

పార్టీని బలోపేతం చేయండి

- రాష్ట్రాభివృద్ధికి నిధులు వరదలా ఇస్తున్నాం
- చాలా ఇచ్చాం.. మరిన్ని ఇస్తాం.. ప్రజల్లోకి వెళ్లి అవన్నీ చెప్పండి
- బీజేపీ రాష్ట్ర నేతలకు అమిత్‌షా దిశానిర్దేశం
- జగన్ కేసులు తేల్చాలి: ఆదినారాయణ రెడ్డి

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రాభివృద్ధికి నిధులు వరదలా ఇస్తున్నాం. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతాయి. రైల్వే జోన్ ప్రధాని మోదీ చేతుల మీదుగా సాకారమైంది. ప్రజల్లోకి వెళ్లి చెప్పండి. పార్టీని బలోపేతం చేయండి' అంటూ బీజేపీ రాష్ట్ర నేతలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, ఆదినారాయణ రెడ్డి తదితరులు ఆదివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందని ఈ సందర్భంగా వారిని అమిత్ షా ప్రశ్నించగా అంతా బాగానే ఉందని, ప్రజలు కూటమి పాలన పట్ల సంతృప్తిగానే ఉన్నారని నేతలు బదులిచ్చారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు 11,440 కోట్లు కేంద్రం ఇవ్వడంపై మంచి స్పందన వచ్చిందని నేతలు చెప్పగా.. 'అంతే కాదు ఇంకా చాలా ఇచ్చాం. మరిన్ని ఇస్తాం. రాష్ట్ర అభివృద్ధిలో నరేంద్ర మోదీ పూర్తిగా సహకరిస్తారు. విశాఖపట్నంలో ఇటీవల రెండు లక్షల కోట్లతో అభివృద్ధి పనులకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లండి' అని అమిత్‌షా నిర్దేశించారు. కూటమి ధర్మం తప్పకుండా పార్టీని బలోపేతం చేసుకోవడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని అమిత్‌షా సూచించగా.. రాష్ట్ర నేతలు సరే అన్నారు. కాగా, జగన్ రాష్ట్రాన్ని దోచేశాడని, అన్ని కేసులున్నా బయట స్వేచ్ఛగా తిరగడం ప్రజలకు నచ్చట్లేదని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అన్నారు. జగన్ కేసుల విషయంలో ముందడుగు పడితే బాగుంటుందని అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి తొక్కిసలాట ఘటన గురించి అమిత్ షా ఆరా తీసినట్టు తెలిసింది.

చెత్తాంధ్ర నుంచి స్వచ్ఛాంధ్రగా..!

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

విజయవాడ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం మిగిల్చిన చెత్తను తొలగించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని, రాష్ట్రాన్ని చెత్తాంధ్ర నుంచి స్వచ్ఛాంధ్ర దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు వార్షిక ప్రణాళికలు రూపొందించుకున్నట్టు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలపై చెత్త పన్ను వేసి, వ్యర్థాల తొలగింపుపై దృష్టి సారించలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 46.59 లక్షల టన్నుల (55 శాతం) చెత్తను తొలగించామని చెప్పారు. అక్టోబరు 2నాటికి 100శాతం చెత్తను తొలగిస్తామన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సన్నద్ధం: సీపీఐ

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సన్నద్ధం కావాలని సీపీఐ నిర్ణయించింది. ఉద్యమ కార్యాచరణపై ఆదివారం విజయవాడలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో చర్చించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలని, పెంచిన విద్యుత్తు చార్జీలను ప్రభుత్వమే భరించాలని, అదానీతో గత ప్రభుత్వం చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు ఆమోదించారు. కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు.

స్టీల్ ప్లాంట్‌పై వైసీపీది కుట్ర బుద్ధి: మంత్రి అచ్చెన్న

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడాన్ని అన్ని పార్టీలు స్వాగతిస్తుంటే.. వైసీపీ మాత్రం కుట్రబుద్ధి చూపిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే కడుపు మంటతో వైసీపీ నేతలు తప్పుడు కూతలు కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం సంప్రదింపులు చేశాకే నిర్ణయం తీసుకున్నామని నాటి కేంద్రమంత్రి పార్లమెంట్‌లో ప్రకటన చేసిన విషయాన్ని వైసీపీ నేతలు మరిచిపోయారా? అని నిలదీశారు.

దావోస్ పర్యటనకు చంద్రబాబు

'ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి ప్రపంచ పెట్టుబడుల పటంలో నిలిపేందుకు సిద్ధంగా ఉన్నాం. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు 55వ వార్షికోత్సవాన్ని వేదికగా చేసుకుని పెట్టుబడులు రాబడతాం." - చంద్రబాబు

- రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యం
- దిగ్గజ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు
- ప్రపంచ ఆర్థిక సదస్సులో 'బ్రాండ్ ఏపీ' నినాదం
- రాష్ట్రానికి గత వైభవాన్ని తీసుకొస్తాం: సీఎం

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం దావోస్ పర్యటనకు బయలుదేరింది. సోమవారం నుంచి శుక్రవారం వరకూ సాగే ఈ పర్యటనలో భాగంగా సీఎం బృందం ఆదివారం ముందుగా ఢిల్లీకి వెళ్లింది. అక్కడినుంచి అర్ధరాత్రి 1.30 గంటలకు జ్యూరిచ్ చేరుకుంటుంది. అక్కడ భారత రాయబారితో పాటు పదిమంది దిగ్గజ పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలతో సమావేశమవుతారు. అలాగే 'మీట్ అండ్ గ్రీట్ ' కార్యక్రమంలో భాగంగా తెలుగు సంతతికి చెందిన పారిశ్రామికవేత్తలను కలుస్తారు. అనంతరం దావోస్‌కు వెళ్తారు. రాత్రి పారిశ్రామికవేత్తలతో, ఆర్సెలర్‌మిట్టల్ సంస్థ యజమాని లక్ష్మీ మిట్టల్‌తో డిన్నర్‌లో పాల్గొంటారు. రెండోరోజు దావోస్‌లో గ్రీన్ హైడ్రోజన్‌పై జరిగే ప్రత్యేక సెషన్‌లో చంద్రబాబు పాల్గొంటారు. కోకాకోలా, ఎల్జీ సహా ఇతర దిగ్గజ పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు బృందంతో వరుస సమావేశాల్లో పాల్గొంటారు. యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్‌తో భేటీ అవుతారు. 'ఎనర్జీ ట్రాన్సిషన్, 'ది బ్లూ ఎకానమీ' అంశాలపై జరిగే సెషన్లలో సీఎం ప్రధానోపన్యాసం చేస్తారు. జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తారు. దావోస్ సదస్సులో భాగంగా మూడోరోజు పలువురు వ్యాపారవేత్తలు, వాణిజ్య సంస్థల యాజమాన్యాలు, ప్రతినిధులతో సమావేశమవుతారు. నాలుగో రోజు జ్యూరిచ్ చేరుకుని అక్కడి నుంచి భారత్‌కు తిరుగు ప్రయాణమవుతారు. చంద్రబాబు వెంట మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, ఉన్నతాధికారులు ఉన్నారు.



దావోస్ పర్యటనకు బయలుదేరిన సీఎం చంద్రబాబుకు వీడ్కోలు చెబుతున్న అధికారులు

పారిశ్రామిక అనుకూల విధానాలే ఆకర్షణ

'బ్రాండ్ ఏపీ' నినాదంతో రాష్ట్రంలో ప్రత్యేకంగా అమలు చేస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహక విధానాలను దావోస్ సదస్సులో చంద్రబాబు బృందం పెట్టుబడిదారులకు వివరించనుంది. 2014 నుంచి 2019 వరకూ జాతీయ స్థాయిలో మిగిలిన రాష్ట్రాలతో పోటీ పడుతూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్' అమలులో టాప్‌లో నిలిచిన ఏపీ.. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ విధానానికి మరింత పదును పెట్టి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పాలసీని అమలు చేస్తోంది. గతంలో పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానించి, వారితో సంప్రదింపులు జరుపుతూ 21 రోజుల్లోనే పెట్టుబడులు పెట్టేందుకు అనువైన సహకారాన్ని ప్రభుత్వం తరఫున అందించేవారు. అయితే ఇప్పుడు పారిశ్రామికవేత్తల వద్దకే మంత్రులు వెళ్లి రాష్ట్రంలోని పెట్టుబడుల సానుకూల ధోరణులను వివరిస్తున్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టాలని స్వాగతిస్తున్నారు. దీనికోసం వారికి ఏం కావాలో ఆరా తీస్తున్నారు. పొరుగు రాష్ట్రాలు కూడా పెట్టుబడుల ప్రోత్సాహక విధానాలను అమలు చేస్తూ పోటీ పడుతుండటంతో సంప్రదింపుల ప్రక్రియకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహక విధానాలను లోకేశ్, భరత్ దావోస్‌లో మార్కెటింగ్ చేయనున్నారు.

తొలిరోజు నుంచీ చంద్రబాబు బిజీ

దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు పెట్టుబడులను ఆకర్షించే పనిలో తొలిరోజు నుంచే బిజీబిజీగా గడపనున్నారు. ఆదివారం రాత్రి దావోస్‌లోని కాంగ్రెస్ సెంటర్‌లో పెట్టుబడిదారులతో సమావేశమవుతారు. రెండోరోజు ఉదయం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తులపై ప్రధానోపన్యాసం చేస్తారు. డీపీ వరల్డ్ సీఈవో, యూఏఈ ఆర్థికమంత్రి అబ్దుల్లా బిన్‌తో భేటీ అవుతారు. ఎల్జీ కెమ్ సీఈవో షిన్ హాక్ చియోల్, కేరిస్‌బర్గ్ సీఈవో జాకబ్ అరూప్ అండర్సన్, ఏపీ మొల్లర్ మీర్స్క్ సీఈవో విన్సెంట్ క్లెర్క్‌తో సీఎం సమావేశమవుతారు. ఆ తర్వాత 'బిజినెస్ టుడే' న్యూస్ డైరెక్టర్ రాహుల్ కన్వల్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇస్తారు. టాటా సన్స్ అండ్ టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో ప్రత్యేక సమావేశం ఉంటుంది. గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైఖేల్ గోజ్‌మేన్, సిస్కో చైర్మన్ అండ్ సీఈవో చుక్ రాబిన్స్, వాల్‌మార్ట్ సీఈవో కాత్ మెక్లేతో భేటీ అవుతారు. మధ్యాహ్నం సీఎన్‌బీసీ టీవీ18తో మోడరేటర్ షెరీన్‌భాన్‌తో నిర్వహించే 'బిల్డింగ్ నెక్స్ట్ పెట్రోకెమికల్ హబ్' డిబేట్‌లో పాల్గొంటారు. సీఎన్‌బీసీకి, బ్లూమ్‌బెర్గ్ సీనియర్ ఎడిటర్ మేనకా దోషికి ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తారు. ఎనర్జీ ట్రాన్స్‌మిషన్- పబ్లిక్ పాలసీ సెమినార్‌లోనూ, సీఎన్‌బీసీ టీవీ-18 నిర్వహించే 'పయనీరింగ్ ద బ్లూ ఎకానమీ ఆఫ్ టుమారో' సెమినార్‌లోనూ పాల్గొంటారు. 22న యూనిలీవర్ సీఈవో హెన్‌స్కూమాచర్‌తో, పెట్రోమాస్ సీఈవో మహమ్మద్ తాఫిక్‌తో, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో సమావేశమవుతారు. మేఘా ఇంజినీరింగ్‌తో ఒప్పంద కార్యక్రమంలో పాల్గొంటారు. ఇంటర్నేషనల్ బేవరేజెస్, పెప్సికో చీఫ్ కార్పొరేట్ ఆఫీసర్ ఏజెన్ విల్మ్‌సెన్‌తోనూ, పెప్సికో ఫౌండేషన్ చైర్మన్ స్టీవెన్ కెహోతో భేటీ అవుతారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు రాబోర్టో బోక్సతో సమావేశం తర్వాత మధ్యాహ్నం బీఎంజీఎఫ్ మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌తో చంద్రబాబు సమావేశమవుతారు. రాయిటర్స్ ఆసియా ఎడిటర్ ఉమాగలానీకి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇస్తారు.

యువతకు ఉద్యోగాలు.. భారీ పెట్టుబడులే లక్ష్యం: లోకేశ్

రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు, భారీ పెట్టుబడుల సాధనే లక్ష్యంగా దావోస్ వెళ్తున్నట్లు మంత్రి లోకేశ్ ప్రకటించారు. పారిశ్రామికవేత్తలను చంద్రబాబు కలిసే ముందుగా వారితో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రంలో అమలులో ఉన్న సరళతర వాణిజ్య విధానాలను, భౌగోళికంగా సానుకూలాంశాలను వివరిస్తారు. ఇప్పటికే అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలతో సమావేశమవుతున్న లోకేశ్ .. దావోస్‌లోనూ అదే తరహా విధానాన్ని అమలు చేస్తారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కాగా, దావోస్ పర్యటనకు వెళ్తున్న సీఎం బృందానికి గన్నవరం విమానాశ్రయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఎంవో కార్యదర్శులు వీడ్కోలు పలికారు. రాష్ట్రానికి పూర్వవైభవాన్ని తీసుకువస్తానని చంద్రబాబు ఈ సందర్భంగా వారితో వ్యాఖ్యానించారు.

లోకేశ్‌కు ఆ అర్హత ఉంది..

- డిప్యూటీ సీఎంగా ఆయన పేరు పరిశీలించాలి: సోమిరెడ్డి
- నేను సైతం అదే కోరుతున్నాను: సయ్యద్ రఫీ
- ఉప ముఖ్యమంత్రి ఇస్తే తప్పేముంది: వర్మ
- తెలుగుదేశం పార్టీలో పెరుగుతున్న విజ్ఞాపనలు



అమరావతి, పిఠాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను ఉప ముఖ్యమంత్రిని చేయాలన్న విజ్ఞాపనలు తెలుగుదేశం పార్టీలో ఊపందుకుంటున్నాయి. లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులురెడ్డి శనివారం కోరిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదనను సమర్థిస్తున్న వారి జాబితా ఆదివారం మరింత పెరిగింది. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధులు సయ్యద్ రఫీ, ఎస్వీఎస్ఎన్ వర్మ కూడా లోకేశ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఆ పదవికి లోకేశ్ వంద శాతం అర్హుడేనని యువగళం పాదయాత్ర ద్వారా తనలోని నాయకత్వ లక్షణాలను నిరూపించుకున్నారని సోమిరెడ్డి అన్నారు. టీడీపీ కేడర్‌తో పాటు రాష్ట్ర ప్రజానీకం కూడా ఆయన నాయకత్వాన్ని జై కొట్టిందన్నారు. డిప్యూటీ సీఎం పదవికి అన్ని విధాలా అర్హుడైన లోకేశ్ పేరును పరిశీలించాలని కోరుతున్నట్లు 'ఎక్స్'లో వెల్లడించారు. టీడీపీ అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ కూడా 'నేను సైతం లోకేశ్‌ను డిప్యూటీ సీఎంగా నియమించాలని సీఎం చంద్రబాబును కోరుతున్నాను' అని వెల్లడించారు. 'లోకేశ్.. టీడీపీలో మూడోతరం నాయకుడిగా ముందుకొచ్చి, 3వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసి, ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. 95,500 మెజార్టీతో విజయం సాధించి, చరిత్ర సృష్టించారు. లోకేశ్ కృషివల్లే టీడీపీ సభ్యత్వం కోటికిపైగా నమోదైంది. విద్యాశాఖలో సంస్కరణలు తెచ్చారు. రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడుల సాధనకు కృషి చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ సమయంలో న్యాయపోరాటం చేశారు. అప్పుడే ఆయన పోరాట పటిమ పార్టీకి, ప్రజలకు తెలిసింది' అని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం ఇవ్వాల్సిందే: మాజీ ఎమ్మెల్యే వర్మ

ప్రజలు, కార్యకర్తల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే మంత్రి లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాల్సిందేనని... ఇది కోటి మంది కార్యకర్తలు, నాయకుల కోరిక అని పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఇందులో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం ఇవ్వాలని పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు కోరుతున్న విషయాన్ని ప్రస్తావించగా.. తానూ అదే కోరుకుంటున్నానని చెప్పారు. కార్యకర్తలు, నాయకుల మనోభావాలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

చెక్కు చెదరని రాఫ్ట్ ఫౌండేషన్





భారీ మోటర్లతో నీటిని తోడుతున్న ట్రాక్టర్లు, నీటి నుంచి బయటపడిన సచివాలయ భవనాల రాఫ్ట్ ఫౌండేషన్

- నీటి నుంచి సచివాలయ పునాదులు బయటకు
- 24 రోజులుగా 16 అడుగుల మేర నీటి తోడివేత
- పూర్తిగా బయటపడిన 1, 2 బ్లాకుల పునాదులు
- 3, 4, 5 బ్లాకుల్లో కొనసాగుతున్న నీటి తోడకం

గుంటూరు, తుళ్లూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని నిర్మాణంలో గుండెకాయ వంటి సచివాలయ భవన సముదాయ రాఫ్ట్ ఫౌండేషన్ ఇప్పటికీ చెక్కు చెదరలేదు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దాదాపు ఐదేళ్లపాటు నీళ్లలో నానిన రాఫ్ట్ ఫౌండేషన్ నేటికీ ద్రుఢంగా దర్శనమిచ్చింది. రాజధాని అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం రాఫ్ట్ ఫౌండేషన్ చుట్టూ చేరిన నీటిని మోటర్లతో తోడివేసే కార్యక్రమాన్ని గత నెల 25న ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పని దాదాపు 24 రోజులపాటు నిర్విరామంగా సాగగా.. చివరకు 16 అడుగుల మేర నీటిని తోడిన తర్వాత ఆదివారం సాయంత్రం 1, 2 బ్లాకుల రాఫ్ట్ ఫౌండేషన్ పూర్తిగా దర్శనమిచ్చింది. చుట్టూ ఉన్న నీరు తొలగిపోయినప్పటికీ ఇంకా అడుగు మేర బురద పేరుకుపోయి ఉంది. సచివాలయ భవనాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని భావించిన అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018లో 40 నుంచి 50 అంతస్తులు ఉండేలా 5 భవనాల(టవర్ల) సముదాయాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. అప్పటి సీఎం చంద్రబాబు నేతృత్వంలో 2018 డిసెంబరు 7న నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే రాజధానిపై గత ప్రభుత్వపు నిర్లక్ష్యం, కక్ష సాధింపు విధానాల వల్ల సచివాలయ భవనాల పునాదులు ఐదేళ్లపాటు నీటిలోనే ఉండిపోయాయి. వ్యర్థ జలాలు శాశ్వత భవనాల పునాదుల్లోకి చేరడంతో 16 అడుగుల మేర నీరు నిలిచింది. భవనాల పునాదులు, పిల్లర్లు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఆ నీటిని తొలగించే పనులను నర్మదా ఆఫ్‌షోర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించింది. ముంబై నుంచి 8 భారీ మోటార్లను తెప్పించిన ఆ కంపెనీ నీటిని తోడించింది. దీంతో 1, 2 బ్లాకుల రాఫ్ట్ ఫౌండేషన్, క్రాస్ పిల్లర్లు బయటపడ్డాయి.

3, 4, 5 బ్లాకుల వద్ద ఇంకా నీరు..

భారీ మోటార్లు 24 రోజుల పాటు నీటిని తోడగా 1, 2 బ్లాకుల వద్ద మాత్రమే నీరు తొలగిపోయింది. 3, 4, 5 బ్లాకుల వద్ద కూడా నీటిమట్టం తగ్గినా.. పూర్తిగా తొలగించేందుకు మరింత సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే 1, 2 బ్లాకుల వద్ద అడుగు మేర పేరుకుపోయిన బురదను తొలగించడం పెద్ద సమస్యలా కనిపిస్తోంది. దాన్ని పూర్తిగా ఎండిన తర్వాత తీయడం సులభంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయి తే.. అక్కడ నీటి ఊట కలవరపెడుతోంది. దీంతో ఊటను తొలగిస్తూ, మట్టిని తీసేందుకు చర్యలు చేపడుతున్నారు. కాగా, టెండర్ల ప్రక్రియ కూడా తుది దశకు చేరడంతో.. త్వరలోనే సచివాలయ శాశ్వత భవనాల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

ఐఐటీ భరోసా నిజమైంది..

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సచివాలయ భవనాల రాఫ్ట్ ఫౌండేషన్, పునాదుల నాణ్యతపై ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ మద్రాస్ సంస్థల నిపుణులతో అధ్యయనం చేయించింది. వారు రాఫ్ట్ ఫౌండేషన్‌కు ఎలాంటి ఢోకా లేదని తేల్చి చెప్పారు. నీటిలో నుంచి బయటపడ్డ రాఫ్ట్ ఫౌండేషన్‌ను చూస్తే వారు చెప్పింది నిజమేనని తేలింది.

కోర్టులు, మీడియా సమన్వయంతో పనిచేయాలి

- మీడియా కథనాలపై న్యాయమూర్తులు అప్రమత్తతతో ఉండాలి
- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్



విశాఖపట్నం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కోర్టులు, మీడియా పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయాలని, జవాబుదారీతనంతో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ పేర్కొన్నారు. విశాఖ బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో సౌత్ జోన్-2 రెండు రోజుల జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సులో ఆదివారం 'జ్యుడీషియరీ అండ్ గవర్నెన్స్ త్రూ ఎమర్జింగ్ అండ్ ఫ్యూచర్ టెక్నాలజీస్, జ్యుడీషియరీ అండ్ మీడియా' అనే అంశంపై పలువురు న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు మాట్లాడారు. ఈ సందర్భంగా జస్టిస్ కురియన్ జోసెఫ్ మాట్లాడుతూ, మీడియా అందించే సమాచారం విశ్వసనీయతను కలిగి ఉండాలని, అదే పరస్పర సహకారానికి ప్రామాణికంగా నిలుస్తుందని చెప్పారు. కోర్టు వ్యవహారాల్లో, సమాచార చేరవేతలో మీడియా పాత్ర, తీర్పులు.. ఇతర ప్రక్రియల్లో ఏఐ పాత్ర గురించి వివరించారు. ఏఐ వినియోగంపై విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య మాట్లాడుతూ, జ్యుడీషియరీ విభాగంలో పనిచేసే వారంతా మీడియాపై, అక్కడ జరిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కోర్టు వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాత్రపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం.సుందర్ విశ్లేషించారు. ఏఐ అనేది న్యాయమూర్తులకు సహకారిగా ఉంటుందని, ప్రత్యామ్నాయం కాదని అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తులు ఏఐ టెక్నాలజీని తుది ప్రామాణికంగా తీసుకోరాదన్నారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ప్రెసిడెంట్ జస్టిస్ రవినాథ్ తిల్హరి, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, సీనియర్ న్యాయమూర్తులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డిపై కేసు నమోదు

రాప్తాడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, ఆయన కుటుంబంపైనా అసభ్యకర వ్యాఖ్యలు చేసిన అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డిపై ఎట్టకేలకు పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. రాప్తాడు పోలీసుస్టేషన్‌లో శనివారం రాత్రి ఆయనపై కేసు నమోదు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2022 నవంబరులో తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీపీ గదిలో ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి అసభ్యకరంగా, అభ్యంతరకరంగా మాట్లాడారు. చంద్రబాబును, లోకేశ్‌ను, వారి కుటుంబ సభ్యులను దూషించారు. ఆ వీడియో వైరల్ అయిన నేపథ్యంలో చంద్రశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని టీడీపీ నాయకులు 15 రోజుల క్రితం ఎస్పీ జగదీశ్‌కు ఫిర్యాదు చేశారు.

గుంటూరులో కొకైన్ కలకలం

గుంటూరు కార్పొరేషన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గుంటూరులో కొకైన్ కలకలం రేపింది. దీన్ని సరఫరా చేస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ శాఖ అధికారులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు కథనం ప్రకారం.. గుంటూరులోని నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ దాదావలి, ఖాసీంపీరా అనే ఇద్దరు సోదరులు, సంపత్‌నగర్ శివారు నంబూరు సుభాని కాలనీకి చెందిన షేక్ సమీర్‌బాజీ కొకైన్ విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై రవీందర్‌నగర్ నుంచి శ్యామలానగర్‌కు కొకైన్ తీసుకెళ్తున్న ఈ ముగ్గురు పట్టుబడ్డారు. వీరి వద్ద 7 ప్యాకెట్లలో 8.5 గ్రాముల కొకైన్‌తో పాటు ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

వైవీ సుబ్బారెడ్డిపై కబ్జా కేసు

రాయదుర్గం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డిపై భూకబ్జా కేసు నమోదైంది. కొండాపూర్‌లోని సర్వే నంబర్ 87లో 2ఎకరాల 30 గుంటల స్థలాన్ని ఆక్రమించారంటూ షేక్ జమీల్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదుపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. వైవీ సుబ్బారెడ్డిని ఏ-1గా పేర్కొన్నారు. ఆయన భార్య స్వర్ణలత(ఏ-2)తోపాటు.. అనుచరులు అనీల్‌కుమార్, శివ, నాగిరెడ్డి, మొయిన్‌లను నిందితులుగా పేర్కొన్నారు. సుబ్బారెడ్డి అనుచరులు ఎక్స్‌వేటర్‌తో తమ ప్రహరీ కూల్చివేశారని జమీల్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే రోజు ఉదయం స్వర్ణలత తమ భూమిని ఆక్రమిస్తున్నారంటూ కొడంగల్‌కు చెందిన గజ్జెల నర్సింహారెడ్డి, అనీల్‌రెడ్డి, సూపర్‌వైజర్ జమీల్ ఫిర్యాదు చేసినట్లు గచ్చిబౌలి పోలీసులు వివరించారు. దీనిపైనా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

'టీ-5' మిశ్రమాన్ని ఆపండి!

(మొదటి పేజీ తరువాయి)

పునరాలోచనలో పడినట్టు రాష్ట్ర జలవనరుల శాఖకు సమాచారం ఇచ్చింది. అయితే, అనేక చర్చలు, పరిశీలనల తర్వాత శనివారం పనులు ప్రారంభించామని.. ఇప్పుడు అకస్మాత్తుగా సందేహాలు వెలిబుచ్చడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ వ్యవహారంపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు దావో‌స్‌లోనే చర్చించనున్నారు. సత్వరమే నిర్ణయం తీసుకుని పనులు సజావుగా సాగేలా చూడాలని కోరనున్నారు.

అసలు ఏం జరిగింది?

డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి టీ-5 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమం వినియోగించవచ్చని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)కి సీడబ్ల్యూసీ శుక్రవారం చెప్పింది. దీంతో ఈ సమాచారాన్ని రాష్ట్ర జల వనరుల శాఖకు, పోలవరం చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తికి పీపీఏ చేరవేసింది. శనివారం ఉదయం డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే, 'టీ-5 కాంక్రీట్ మిశ్రమంపై పునరాలోచనలో పడినట్లు శనివారం రాత్రి సీడబ్ల్యూసీ నుంచి సమాచారం వచ్చింది. దీంతో ప్రభుత్వం సహా అధికారులు నివ్వెరపోయారు. అంతా సవ్యంగా సాగుతున్న సమయంలో మళ్లీ ఈ ఆటంకాలేంటని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆయన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు చేరవేశారు. పెట్టుబడుల సదస్సు కోసం దావో‌స్‌కు వెళ్తున్న రామ్మోహన్‌నాయుడును దీనిపై సీఎం చంద్రబాబుతో మాట్లాడాలని కోరారు.

ఎందుకీ అభ్యంతరం?

డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం కోసం వాడే ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమంపై సీఎస్ఆర్ఎంఎస్, అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ ఇచ్చిన అభిప్రాయాలను సీడబ్ల్యూసీ పరిగణనలోకి తీసుకుంది. అనంతరం 'టీ-5' మిశ్రమాన్ని వాడాలని పీపీఏ ద్వారా రాష్ట్ర జల వనరుల శాఖకు సూచించింది. ఇదే విషయాన్ని కేంద్ర జల శక్తి కార్యదర్శి దేబర్షి ముఖర్జీకి సైతం సీడబ్ల్యూసీ వెల్లడించింది. అయితే.. 'టీ-16' మిశ్రమం అయితే.. ప్రాజెక్టు భవిష్యత్తుకు మరింత భద్రత కల్పిస్తుందన్న అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ అభిప్రాయాన్ని కూడా దేబర్షికి సీడబ్ల్యూసీ వివరించింది. దీంతో టీ-5, టీ-16 మిశ్రమాల విషయంలో అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ నుంచి స్పష్టమైన సూచనలు తీసుకోవాలని దేబర్షి ఆదేశించారు. 'టీ-5' వాడాక భవిష్యత్తులో సమస్యలు ఎదురైతే ఎవరు బాధ్యత వహిస్తారని సీడబ్ల్యూసీని నిలదీశారు. దీంతో టీ-5 మిశ్రమంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్రానికి సీడబ్ల్యూసీ సమాచారం చేరవేసింది.

ఏదైనా ఓకే.. పనులు సాగాలి: సీఎం

సీడబ్ల్యూసీ అభ్యంతరం, దీనికి ముందు జరిగిన పరిణామాలను సీఎం చంద్రబాబు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ విషయంపై దావోస్ పర్యటనలో ఉన్న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో అక్కడే చర్చించాలని నిర్ణయించారు. ఈ సమస్యపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని పాటిల్‌ను కోరనున్నారు. సీడబ్ల్యూసీ సూచించినట్టు 'టీ-5' మిశ్రమానికైనా, అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ చెబుతున్న 'టీ-16' మిశ్రమానికైనా తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేయనున్నారు. పనులు ప్రారంభించాక.. కాస్త ఆగాలంటూ సీడబ్ల్యూసీ పేర్కొనడంపై పాటిల్‌ను ప్రశ్నించనున్నారు.

నేడు తుది నిర్ణయం!

డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో కాంక్రీట్ మిశ్రమం వినియోగంపై సీడబ్ల్యూసీ.. సోమవారం అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్, సీఎస్ఎంఆర్ఎస్, ఐఐటీ-తిరుపతితో సంప్రదింపులు జరపనుంది. 'టీ-5' మిశ్రమం వాడాలో, లేదంటే అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ చెప్పినట్లు 'టీ-16' మిశ్రమం వాడాలో తేల్చనుంది. ఏ మిశ్రమం వాడేందుకైనా తాము సిద్ధమేనని సీడబ్ల్యూసీకి కాంట్రాక్టు సంస్థ బావర్ వెల్లడించింది. దీంతో సోమవారం కాంక్రీట్ మిశ్రమంపై తుది నిర్ణయాన్ని వెల్లడిస్తామని ప్రకటించింది.



విజయవాడలో జరిగిన 'గిరిజన-ఆదివాసీ' సమ్మేళనంలో కొమ్ముపాగా ధరించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గిరిజనులు వ్యాపార రంగంలోకి రావాలి

- వారి ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్: వెంకయ్యనాయుడు
- విజయవాడలో 'గిరిజన-ఆదివాసీ' సమ్మేళనం

వన్‌టౌన్(విజయవాడ), జనవరి 19(ఆంధ్రజ్యోతి): గిరిజనులు, ఆదివాసీల ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వ్యాపార రంగంలో రాణించాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'గిరిజన-ఆదివాసీ' సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఆదివాసులు తమదైన ప్రత్యేక హస్తకళా నైపుణ్యాన్ని కలిగి ఉన్నారని, అందుకే వారి సహజసిద్ధ నైపుణ్యాలను ప్రోత్సహించడం, వారి ఉత్పత్తులను ప్రచారం చేయడం, వారి ఆదాయ వనరులను మెరుగుపరచడం ఎంతో ముఖ్యమని చెప్పారు. గిరిజనుల వివిధ ఉత్పత్తులు, హస్తకళల సహజసిద్ధ నైపుణ్యాలకు వ్యాపార విలువలను జోడించుకోవాలని సూచించారు. ఈ-కామర్స్, డిజిటల్ వ్యాపార మార్గాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ-గిరిజన యువకులు సాంకేతికతను అందిపుచ్చుకుని, అభివృద్ధి సాధించవచ్చని, ఈ దిశగా ఆదివాసీ-గిరిజనులందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. మీరు ఒక్క అడుగు ముందుకేస్తే, మీ కోసం వంద అడుగులు ముందుకు వేయడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయనే విషయాన్ని ఆదివాసీ-గిరిజన సోదరులు గ్రహించాలని చెప్పారు. దేశ జనాభాలో ఆదివాసీలు దాదాపుగా 10 కోట్ల మంది ఆదివాసీలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ప్రసంగించారు.

'ఢిల్లీ' ఎవరి ఖిల్లా?



(మొదటి పేజీ తరువాయి)

ఉపసంహరణకు సోమవారంతో గడువు ముగియనుండటంతో ప్రధాన పార్టీలన్నీ ప్రచారాన్ని ఉధృతం చేయనున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. అదే నెల 8న ఓట్ల లెక్కింపు జరగనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 53.57 శాతం ఓట్లతో ఆమ్ ఆద్మీ పార్టీ 62 స్థానాలు గెలుచుకుంటే, 38.51శాతం ఓట్లతో బీజేపీ 8 స్థానాలకే పరిమితమైంది. 4.26 శాతం ఓట్లతో కాంగ్రెస్ ఒక్క సీటూ గెలుచుకోలేకపోయింది. ఆర్నెల్ల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 54.35శాతం, కాంగ్రెస్ 18.91శాతం సాధించి ఓటు బ్యాంకును మెరుగుపరుచుకున్నాయి. ఆప్ మాత్రం 24.17 శాతం ఓట్లకు పడిపోయింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో జననాడి ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికంగా మారింది. ఈ మూడు పార్టీలకు న్యూఢిల్లీ నియోజకవర్గం అత్యంతకీలకంగా మారింది. ఇక్కడ ఆప్ అధినేత కేజ్రీవాల్, బీజేపీ నుంచి మాజీ ఎంపీ, మాజీ సీఎం సాహెబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ, మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ ఇక్కడ పోటీ చేయలేదు. ఈసారి ఆ పార్టీ పర్వేశ్‌ను నిలబెట్టడం, 2013లో షీలా దీక్షిత్‌ను ఓడించి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్‌ను ఢీకొనేందుకు ఆమె కుమారుడు సందీప్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. ఆప్ నుంచి కేజ్రీవాల్ ఒక్కరే ప్రచారం చేస్తుండగా బీజేపీ, కాంగ్రెస్ నుంచి పలువురు జాతీయ స్థాయి నేతలు ప్రచారం చేస్తున్నారు. బీజేపీ తరఫున ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, యూపీ సీఎం యోగి సహా పలు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకముందే నరేంద్రమోదీ జనవరి 3న రాంలీలా మైదానంలో పార్టీ ప్రచారాన్ని ప్రారంభించి భారీ ఎత్తున ప్రాజెక్టులు ప్రకటించారు. కాంగ్రెస్ తరఫున లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంకా గాంధీ, పార్టీ అధ్యక్షుడు ఖర్గే, సచిన్ పైలట్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఇటీవల సీలంపూర్‌లో రాహుల్ జరిపిన ర్యాలీకి పెద్ద ఎత్తున ప్రజాస్పందన లభించింది. సోమవారం న్యూఢిల్లీ నియోజకవర్గంలో సందీప్ దీక్షిత్ మద్దతుగా పాదయాత్ర చేస్తున్న రాహుల్ ఇతర నియోజకవర్గాల్లో కూడా పాదయాత్రలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. షీలాదీక్షిత్ హయాంలో ఢిల్లీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రధానంగా ప్రచారానికి ఉపయోగించుకుంటోంది. ఢిల్లీలో బీజేపీ కంటే ఆప్ పార్టీయే తమకు ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్ భావిస్తోంది. దీంతో.. జాతీయ స్థాయిలో బీజేపీని తీవ్రంగా విమర్శించే రాహుల్, ఇతర కాంగ్రెస్ నేతలు ఈసారి కేజ్రీవాల్‌నే లక్ష్యంగా చేసుకున్నారు. తమకు గతంలో మద్దతుగా నిలిచిన మురికివాడల ప్రజలు, దళితులు, మైనారిటీలు ఆప్‌వైపు తరలడంతో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌పైనే ప్రధానంగా విమర్శలు చేస్తున్నారు. ఈసారి ముస్లింలు పూర్తిగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశాలున్నాయి. ఇక దాదాపు అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున స్వతంత్ర అభ్యర్థులు, చిన్నా చితక పార్టీల నేతలు పోటీకి దిగడంతో ఆ చీలే ఓట్లు ఎక్కడ దెబ్బ కొడతాయోనని 3 పార్టీలూ ఆందోళన చెందుతున్నాయి. మొత్తం 70 నియోజకవర్గాల్లో 980 మంది అభ్యర్థులు 1521 నామినేషన్లు దాఖలు చేయగా 1040 నామినేషన్లను ఎన్నికల సంఘం ఆమోదించింది.

ఉచిత వరాల మధ్య ఓటర్లు ఎటువైపు?

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు పెద్ద ఎత్తున ఉచిత వరాలపై హామీలు గుప్పిస్తుండటంతో ప్రజలు ఏ పార్టీవైపు ఆకర్షితులవుతారన్న విషయం అంచనా వేయడం కష్టంగా మారింది. ఢిల్లీ ఎన్నికల ఘట్టం ప్రారంభమైన కొద్దిరోజులకే 8వ పే కమిషన్‌ను నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం వల్ల ఢిల్లీలో అత్యధికంగా ఉన్న ప్రభుత్వోద్యోగులు తమకు అనుకూలంగా మారతారని బీజేపీ ఆశాభావంతో ఉంది. మహిళలకు నెలకు రూ. 2,500 చొప్పన చెల్లిస్తామని, గర్భిణులకు రూ. 21వేలతో పాటు ఆరు న్యూట్రిషన్ కిట్లను అందిస్తామని, రూ. 500కే పేదలకు ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేస్తామని బీజేపీ ప్రకటించింది. ఆప్ కూడా మహిళలకు నెలకు రూ. 2,500 చెల్లిస్తామని, వృద్ధులకు ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స అందిస్తామని, ఉచిత విద్యుత్తు, నీటి సరఫరా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం,ఆడపిల్ల వివాహానికి రూ.లక్ష చెల్లిస్తామని ప్రకటించింది. తాజాగా అద్దె ఇళ్లలో నివసించేవారందరికీ ఉచిత విద్యుత్తు, నీటి సరఫరా కల్పిస్తామనీ కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ కూడా రూ. 500కు గ్యాస్ సిలిండర్, ఉచిత రేషన్ కిట్, 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీలను గుప్పించింది.

మహా కుంభమేళాలో సిలిండర్ పేలుడు

- పెద్ద ఎత్తున మంటలు.. 18 టెంట్లు దగ్ధం



ప్రయాగ్‌రాజ్, మహాకుంభమేళా నగర్(యూపీ): మహా కుంభమేళాలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఎల్పీజీ సిలిండర్ పేలడంతో కుంభమేళా సెక్టార్-19లోని గీతా ప్రెస్ వద్ద 18 టెంట్లు పూర్తిగా కాలిపోయాయి. పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ అలుముకోవడంతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో భక్తులెవరూ గాయపడలేదు. వెంటనే స్పందించిన సిబ్బంది, ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశారు. మంటలు అదుపులోకి వచ్చి, సాధారణ పరిస్థితులు ఏర్పడేదాకా సమీపంలో ఉన్న భక్తులను అక్కడి నుంచి అధికారులు ఖాళీ చేయించారు. మౌని అమావాస్య కోసం ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, అగ్ని ప్రమాదం గురించి తెలియడంతో ఘటనాస్థలికి వెళ్లారు. ఇకముందు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. మహాకుంభమేళాలో అగ్ని ప్రమాదం ఘటన గురించి తెలియడంతో ప్రధాని మోదీ, యోగికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. కాగా అఖాడాల్లో యాగాలు జరుగుతుంటాయి కాబట్టి పొగ రావడం మామూలే. కానీ.. పెద్ద ఎత్తున మంటలు రావడంతో భయాందోళనకు గురయ్యామని స్థానికులు చెప్పారు.

చదువుల ఒత్తిడి చిదిమేసింది!

- మిమ్స్‌లో ఎంబీబీఎస్ విద్యార్థి ఆత్మహత్య



నెల్లిమర్ల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): 'డాడీ, అమ్మా.. పదేళ్లుగా విమ్మల్ని చాలా కష్టపెట్టాను. బతకాలంటే భయమేస్తోందమ్మా. నన్ను క్షమించండి డాడీ, అమ్మా. సారీరా తమ్ముడూ'.. అని సూసైడ్ నోట్ రాసి.. ఓ ఎంబీబీఎస్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మిమ్స్‌లో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్న, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన అత్కూరి సాయిమణిదీప్(24) కళాశాల హాస్టల్‌లో శనివారం రాత్రి గడ్డి మందు తాగి తనువు చాలించాడు. చదువులో వెనుకబడడం, ఇంట్లోవాళ్లను ఇబ్బంది పెడుతున్నానన్న తీవ్ర మానసిక సంఘర్షణతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మణిదీప్ ద్వితీయ సంవత్సర సబ్జెక్టులు ఉండిపోవడంతో అవి రాసేందుకు పండుగకు ఇంటికి వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉండిపోయినట్లు సమాచారం. ఓ పక్క ఏకాంతం, మరోపక్క మానసిక సంఘర్షణ.. ఆత్మహత్యకు పురిగొల్పి ఉండవచ్చని భావిస్తున్నారు. మణిదీప్ తండ్రి రామారావు నిడదవోలు మండలం అట్లపాడులోని వికాస్ విద్యా సంస్థల డైరెక్టర్‌గా ఉన్నారు.

'తులసి'కి సంతర్పణ!

సీఐడీ మాజీ ఏడీజీ పీవీ సునీల్‌కుమార్ నిర్వాకం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ప్రతి ప్రభుత్వ శాఖకు ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ ఉంటుంది. అందులోని డాష్‌బోర్డులో ఆ శాఖ అధికారుల వివరాలు, ఆ శాఖ నుంచి ప్రజలకు ఎలాంటి పథకాలు అందుతున్నాయో, వాటి లక్ష్యాలు ఏమిటో పొందుపరుస్తారు. ఆయా శాఖలు ఐటీ కంపెనీలతో ఈ సైట్లను తయారు చేయిస్తుంటాయి. కొన్ని శాఖలు ఆ వెబ్‌సైట్ నిర్వహణ బాధ్యతలను తయారు చేసిన కంపెనీకే అప్పగిస్తాయి. ఈ మొత్తం ప్రక్రియకు ఏడాదికయ్యే ఖర్చు రూ.లక్షల్లోనే ఉంటుంది. అయితే జగన్ ప్రభుత్వంలో సీఐడీ అదనపు డీజీగా వ్యవహరించిన పీవీ సునీల్‌కుమార్ రూటే వేరు! అప్పట్లో ఆయన పోలీసు గృహ నిర్మాణ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గానూ కొంతకాలం కొనసాగారు. ఆ సమయంలో ఈ సంస్థకు సరికొత్త డాష్‌బోర్డును సిద్ధం చేయించాలని నిర్ణయించారు. దీనికి క్లౌడ్ బేస్ వెబ్ అండ్ మొబైల్ టెక్నాలజీ అని నామకరణం కూడా చేశారు. దీనికోసం ఈ-టెండర్లను ఆహ్వానిస్తూ 2019 జనవరి 30న నోటిఫికేషన్ విడుదల చేశారు. టెండర్లు ఖరారు చేయడానికి నలుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. డాష్‌బోర్డు కోసం రూ.1.69 కోట్లు, మొదటి ఏడాది నిర్వహణకు రూ.33.80 లక్షలు, జీఎస్టీ 18శాతం కింద మరో రూ.36,50,400, మరో రెండేళ్ల పాటు వార్షిక నిర్వహణను పొడిగింపునకు రూ.33.80 లక్షలు చొప్పున మొత్తం రూ.3,06,90,400 చెల్లించాలని నిర్ణయించారు.

ఇద్దరితోనే టెండర్ల ఖరారు

ఎంత పెద్ద ప్రాజెక్టయినా, చెల్లించే మొత్తం ఎంత చిన్నదైనా ఒకసారి టెండర్ ప్రకటన వెలువడిన తర్వాత అందులో కనీసం మూడు టెండర్లు కచ్చితంగా దాఖలు కావాలి. లేదంటే ఆ టెండర్లు రద్దుచేసి మళ్లీ కొత్తగా ప్రకటన ఇవ్వాలి. ఇక్కడే సునీల్‌కుమార్ తన సొంత నిబంధనలను అమలు చేశారు. పోలీసు గృహనిర్మాణ సంస్థ ఆహ్వానించిన టెండర్లలో రెండు సంస్థలే పాల్గొన్నాయి. అందులో ఒకటి మెగట్రాన్ ఐటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, రెండోది వీఎస్ఎన్ ఇన్ఫ్రో ప్రైవేట్ లిమిటెడ్. ఇందులో వీఎస్ఎన్ సంస్థకు అర్హత లేదని కమిటీ తేల్చింది. రఘురామరాజును వేధించిన కేసులో నిందితుడిగా ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న కామేపల్లి తులసిబాబుకు చెందిన మెగట్రాన్ కంపెనీకి అన్ని అర్హతలు ఉన్నట్టు నిర్ధారించి ఎంపిక చేసింది. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం ఈ డాష్‌బోర్డును నిర్వహించిన దాఖలాలు లేవు. టెండర్ ఖరారు చేయగానే మెగట్రాన్ కంపెనీకి రూ.3.06 కోట్లు సునీల్ ఏకమొత్తంలో చెల్లించారు. ఇదిప్పుడు పోలీసు శాఖలో పెనుదుమారం రేపుతోంది. వాస్తవానికి డాష్‌బోర్డు తయారీ, నిర్వహణ ఖర్చు ఏడాదికి రూ.10 లక్షలకు మించదని ఐటీ కంపెనీల నిర్వాహకులు చెబుతున్నారు. కానీ దానికి రూ.3.06 కోట్లు చెల్లించడం, ప్రాజెక్టును దక్కించుకున్న సంస్థ ఐదేళ్ల కాలంలో దాన్ని పూర్తిచేయకపోవడం వంటి అంశాలు వివాదాస్పదమవుతున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.